బుధవారం
7•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 269
• పేజీలు : 16 + (16/20)+ 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

ఢిల్లీలో టీఆర్ఎస్ పోరు



తెలంగాణ రాష్ట్రంలో రిజర్వేషన్ల కోటా పెంచాలనే డిమాండ్‌తో మంగళవారం లోక్‌సభ బయట ప్లకార్డులతో ఆందోళనకు దిగిన టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, కవిత, బూర నర్సయ్య గౌడ్, మల్లారెడ్డి, బాల్క సుమన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి

రిజర్వేషన్ల కోటా పెంచాలంటూ పార్లమెంట్ లోపలా బయటా ఎంపీల ఆందోళన

గాంధీ విగ్రహం వద్ద నిరసన.. అనంతరం లోక్‌సభలో నిలదీత

ఎంపీల నినాదాలతో దద్దరిల్లిన సభ

డిమాండ్లు నెరవేరేదాకా పోరాటం ఆగదు: ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్, కవిత

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని డిమాండ్‌చేస్తూ టీఆర్ఎస్ ఎంపీలు దేశ రాజధాని ఢిల్లీలో పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. తొలిరోజైన సోమవారం లోక్‌సభను స్తంభింపజేసిన టీఆర్ఎస్ ఎంపీలు.. రెండోరోజైన మంగళవారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. లోక్‌సభ లోపల, బయట నిరసన తెలిపారు. ముస్లింలు, ఎస్టీలకు విద్యాసంస్థల్లో, ఉద్యోగ కల్పనలో మరిన్ని రిజర్వేషన్లు ఇచ్చేందుకుగాను ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను 50% నుంచి 62 శాతానికి పెంచుతూ రాష్ట్ర శాసనసభ గతేడాది ఏప్రిల్‌లో చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేశారు. తమ రాష్ట్ర ప్రభుత్వం చేసిన సిఫారసును రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని నినదించారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన జరిపిన ఎంపీలు 11 గంటల తర్వాత లోక్‌సభలో కూడా తమ నిరసన గళాన్ని వినిపించారు. ఎంపీల నిరసన ప్రతిధ్వనులతో లోక్‌సభ దద్దరిల్లింది. వారిని శాంతింపజేసేందుకు స్పీకర్ సుమిత్రామహాజన్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి, ఉపనేత వినోద్‌కుమార్,

మిగతా 2వ పేజీలో


మంగళవారం సూర్యాపేట సభకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు.. సభనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నాడు కొంపలుముంచి నేడు యాత్రలా?

కాంగ్రెస్ నేతలపై మంత్రి కేటీఆర్ మండిపాటు

- టీఆర్ఎస్‌ది ఉడుం పట్టు.. కాంగ్రెస్‌కు బాగా తెలుసు
- అభివృద్ధిలో మరే రాష్ట్రం దరిదాపుల్లో లేదు
- నాడు కరంటు కోతలపై ధర్నాలు.. నేడు కోతలకోసం విన్నపాలు
- వచ్చే ఎన్నికల్లో కోదాడ నుంచి విజయయాత్ర
- కోదాడ ప్రగతి సభలో మంత్రి కేటీఆర్
- జగదీశ్‌రెడ్డి కార్యదీక్షతో అభివృద్ధిపథంలో జిల్లా
- సీఎం కేసీఆర్‌కు మంత్రి జగదీశ్‌రెడ్డి కుడిభుజం
- సూర్యాపేట సభలో మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

2

తెలంగాణకు 24 టీఎంసీలు

ఏపీకి 9.3 టీఎంసీలు

- ఎట్టకేలకు నీటి విడుదల ఉత్తర్వులను జారీచేసిన కృష్ణాబోర్డు
- ఈ నెలాఖరు వరకు నాగార్జునసాగర్‌లో 515 అడుగుల నీటిమట్టం ఖచ్చితంగా నిర్వహించాలి
- తదనుగుణంగా శ్రీశైలం నుంచి నీటిని విడుదలచేయాలి
- విద్యుత్ అవసరాలు లేకుంటే స్లూయిజ్‌ల ద్వారా విడుదలకు ఆదేశం
- తప్పుడు ప్రచారాన్ని పటాపంచలు చేసిన తెలంగాణ నీటిపారుదలశాఖ

12


త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చివేత దృశ్యం

5

త్రిపురలో హింసాకాండ

లెనిన్, మార్క్స్ విగ్రహాల కూల్చివేత

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ ఓడిపోయి 48 గంటలు గడువకముందే బీజేపీ కార్యకర్తలు విజృంభించారు. భారీగా హింసాకాండకు దిగి కారల్ మార్క్స్, లెనిన్ విగ్రహాలను కూల్చివేశారు. సీపీఎం కార్యాలయాలపై, ఆ పార్టీ కార్యకర్తల ఇండ్లపై దాడులు, దహనాలకు పాల్పడ్డారు. ఈ హింసలో ఇద్దరు మృతి చెందినట్టు తెలిసింది. రాష్ట్రంలో విగ్రహాల కూల్చివేతకు ఇద్దరు కేంద్ర మంత్రులు మద్దతు తెలిపారు. మరోవైపు తమిళనాడులో పెరియార్ కులవాది అని, త్రిపురలో లెనిన్ విగ్రహాలను కూల్చేసినట్లే పెరియార్ విగ్రహాలనూ కూల్చేస్తామంటూ ఆ రాష్ట్ర బీజేపీ నేత రాజా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో వెల్లూరులో బీజేపీ కార్యకర్తలు పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు.

మహిళామూర్తులకు పురస్కారాలు

వివిధ రంగాల్లో సేవలందించిన 20మంది ఎంపిక

విద్యావేత్త కవితాదర్యాని, జిమ్నాస్ట్ అరుణారెడ్డి, రచయిత్రి లక్ష్మీనర్సమ్మ, జర్నలిస్ట్ సౌమ్య నాగపురి, గాయని నిత్యసంతోషిని తదితరులకు అవార్డులు

అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా రేపు ప్రదానం

3

పట్టుకుంటే బంగారం!

పన్నులు ఎగ్గొడుతూ 15 కిలోల ఆభరణాల అక్రమ రవాణా

పట్టపగలు 5 కిలోల బంగారం లూటీ

హైదరాబాద్‌లో రెండు ఘటనలు

6

సిరియాలో కూలిన రష్యా విమానం 32 మంది దుర్మరణం

5

జయహో కేసీఆర్

భారతీయ 'ఝూఠా' పార్టీగా మారిన బీజేపీ

- తెలంగాణలో ఆ పార్టీకి పుట్టగతులుండవు..
- బీజేపీ నేతలపై ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీజేపీ నాయకులు రోజుకో మాట మాట్లాడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, వారి మాటలు రోజురోజుకూ మితిమీరుతున్నాయని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజమెత్తారు. బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదని, అది భారతీయ ఝూఠా పార్టీ అని మండిపడ్డారు. మంగళవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో రాష్ట్రానికొచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా అనేక అబద్ధాలు మాట్లాడగా.. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి కేంద్రం ఇప్పటివరకు రాష్ట్రానికి ఇచ్చిందెంతో.. ఇవ్వాల్సిందెంతో లెక్కలతో సహా చూపించారని, అప్పుడు తోక ముడిచిన ఆయన ఇప్పటివరకు రాష్ట్రం వైపు చూడలేదని చెప్పారు. కరీంనగర్ సభలో ప్రధాని మోదీని తానేమీ అనలేదని, సీఎం కేసీఆర్ వీడియో క్లిప్పింగ్ చూపించి స్పష్టమైన వివరణ ఇచ్చిన తరువాత కూడా బీజేపీ నాయకులు ప్రగతిభవన్‌ను ముట్టడిస్తానంటూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేసే చరిత్ర బీజేపీదని పేర్కొన్నారు.

జాతీయ మీడియాలో విశేష కవరేజీ

కేసీఆర్ ప్రకటనకు ప్రముఖస్థానం ఇచ్చిన పత్రికలు.. మద్దతు వెల్లువెత్తుతున్నదంటూ శీర్షికలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం ప్రత్యామ్నాయ కూటమిని ఏర్పాటుచేసేందుకు సిద్ధమన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటనకు జాతీయ మీడియా విశేష కవరేజీ ఇచ్చింది. హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ టైమ్స్, ఏషియన్ ఏజ్, మింట్, పయనీర్ తదితర ఆంగ్ల పత్రికలతోపాటు, వివిధ ఉర్దూపత్రికలు, బెంగాలీపత్రికలు సైతం కేసీఆర్ ప్రకటనకు ప్రముఖస్థానం ఇచ్చి ప్రచురించాయి. కాంగ్రెస్, బీజేపీయేతర ప్రత్యామ్నాయ కూటమి కోసం కేసీఆర్ ప్రయత్నాలు అంటూ హిందూ ప్రచురించింది. కేసీఆర్‌కు బెంగాల్ సీఎం మమతాబెనర్జీ మద్దతు ప్రకటించిన విషయాన్ని ఆనందబజార్ మొదటిపేజీలో వేసింది. కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్‌కు ఒవైసీ నుంచి మమత దాకా వెల్లువెత్తుతున్న మద్దతు అంటూ టైమ్స్ ఆఫ్ ఇండియా.. ఈశాన్యంలో ఘోర పరాజయాన్ని చవిచూసిన కాంగ్రెస్‌కు మరింత నష్టం కలుగజేయనున్న కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్ అంటూ ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ శీర్షికలు పెట్టాయి.



ఇది థర్డ్ ఫ్రంట్ కాదు ప్రజల ఫ్రంట్..



తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచచరిత్రలో ఏ దేశంలో లేని విధంగా ముందుకు తీసుకుపోయిన గుండెధైర్యంగల వ్యక్తి కేసీఆర్. అలాంటి నాయకుడు నేడు మరో అద్భుతమైన, సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. దేశంలో గుణాత్మక మార్పు తీసుకురావటానికే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి అడుగిడుతున్నారు. ఇది థర్డ్ ఫ్రంట్ కాదు ప్రజల ఫ్రంట్. కేసీఆర్‌లాంటి మనోధైర్యం, దీక్ష, పట్టుదల ఉన్న వ్యక్తి జాతీయ రాజకీయాల్లో అడుగిడాల్సిన అవసరం ఉంది.

– మాజీ ఎంపీ మంద జగన్నాథం



మంగళవారం సూర్యాపేట బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ సురేంద్రమోహన్ తదితరులు కూడా ఉన్నారు.



కోదాడ బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

నాడు కొంపలుముంచి నేడు యాత్రలా?

కాంగ్రెస్ నేతలపై విరుచుకుపడిన మంత్రి కే తారకరామారావు

- టీఆర్ఎస్ ఉడుంపట్టు కాంగ్రెస్‌కు బాగా తెలుసు
- ధీమాతో పనిచేసే దమ్మున్న ప్రభుత్వం మాది
- అభివృద్ధిలో మరే రాష్ట్రం దరిదాపుల్లో లేదు
- కోదాడ ప్రగతిసభలో మంత్రి కేటీఆర్

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

అరవై ఏండ్ల పాలనలో ఆంధ్ర నాయకులకు తొత్తులుగా మారి, వారి మోచేతి నీళ్లకోసం మోకరిల్లినవారు, తెలంగాణ ప్రజల కొంపలు ముంచినవారు.. నేడు ఏదో సాధిస్తామంటూ యాత్రలు చేపట్టడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు విమర్శించారు. మంగళవారం కోదాడ పట్టణంతోపాటు నియోజకవర్గ పరిధిలో రూ.55 కోట్ల వ్యయంతో 1,110 డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలకు జిల్లా మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన భారీ బహిరంగసభలో కేటీఆర్ ప్రసంగించారు. 'కాంగ్రెస్ వారు తాము పెద్ద వాళ్లం అంటారు. ఎలాపడితే అలా విమర్శలు చేయవద్దంటారు. తెలంగాణను నట్టేట ముంచినందుకు పెద్దవారా? ఆకారాలు పెంచినందుకు పెద్దవారా? లేక సంపాదనలో పెద్దవారా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను ఇప్పటికే దేశానికే రోల్‌మోడల్‌గా మార్చిన సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సాహసోపేత నిర్ణయాలతో ప్రజలకు కావాల్సిన వాటిగురించి ఎప్పటికప్పుడు ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. అభివృద్ధిని చాలెంజ్‌గా తీసుకొని, అమలుచేయలేకపోతే ఎన్నికల్లో పోటీకే రామని సవాల్ విసిరిన దమ్మున్న ప్రభుత్వం మాది. అంతటి గట్స్ ఉన్న సీఎం మా కేసీఆర్' అని కేటీఆర్ అన్నారు. టీఆర్ఎస్ ఏదిపట్టినా అది ఉడుంపట్టులాగే ఉంటుందని, టీఆర్ఎస్ చేతిలో దెబ్బతిన్న కాంగ్రెస్‌కు అది బాగా తెలుసునని వ్యాఖ్యానించారు. కోదాడ నియోజకవర్గం రాష్ట్రానికే ముఖద్వారమని, అలాంటి నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ఇక్కడి నుంచే విజయయాత్ర ప్రారంభించాలని పిలుపునిచ్చారు. తెలంగాణఉద్యమ సమయంలో కాంగ్రెస్ నాయకులు మనలో ఎన్నో అపనమ్మకాలు కల్గిస్తూ, మనలోమనకే చిచ్చుపెట్టే కుతంత్రాలు చేశారని గుర్తుచేశారు. దాదాపు 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ నాయకులు అలంకారాలు, ఆస్తులు పెంచుకున్నారు తప్ప నాగార్జునసాగర్‌నుంచి నీరు తెప్పించలేకపోయారని విమర్శించారు. ఉమ్మడి పాలనలో కిరణ్‌కుమార్‌రెడ్డి పిల్లిశాపనార్థాలు పెడుతూ తెలంగాణ వస్తే మీకు కరెంట్ ఉండదని శపించారని, కానీ మూడున్నరేండ్లలోనే తెలంగాణ వెలుగులు విరజిమ్మాయని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం మనసున్నవ్యక్తి సీఎం సీటుపైకి రావడంతో ఎన్ని సంక్షేమపథకాలు, ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయో ఆలోచించాలన్నారు. పెన్షన్లు, రేషన్ బియ్యం, కల్యాణలక్ష్మి తదితర పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఇవ్వని హామీలుకూడా అమలుచేస్తున్నామనిచెప్పారు. కాంగ్రెస్ హయాంలో కరంట్ కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే, నేడు 24గంటల కరంట్ వద్దని రైతులు చెప్తున్నారంటే తమ పనితీరును అర్థం చేసుకోవాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయడమేకాకుండా, ఎకరానికి నాలుగు వేలు పెట్టుబడి ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని అన్నారు. రైతులకు రూ.5 లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించామని చెప్పారు. 'కోదాడ నియోజకవర్గం మీదుగా సాగర్ నీళ్లు కిందికి పోతాయి తప్ప ఈ ప్రాంతానికి సాగుకు సరైన రీతిలో నీళ్లు పారలేదు. అదీ కాంగ్రెస్ గొప్పతనం' అని ఎద్దేవా చేశారు. కానీ, మన ముఖ్యమంత్రి సీతారామ ప్రాజెక్టుద్వారా గోదావరి జలాలతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయబోతున్నారని చెప్పారు. వారి హయాంలో తాగునీరు, కరంట్ ఇవ్వకుండా, తెలంగాణ ఇవ్వకుండా వందల మంది, వేల మందిని బలిగొన్న నాయకులు ఓ 40మంది బస్సెక్కి దిక్కుమాలిన యాత్రకు బయలుదేరారన్నారు. వారి తీరు వంద ఎలుకలను తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్టు ఉందని ఎద్దేవాచేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఎక్కడ? అని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నేతలనుద్దేశించి.. 'నేడు ఏ నియోజకవర్గంలో చూసినా ఇండ్ల నిర్మాణాలు కనిపిస్తాయి. కోదాడలోనే 1400 ఇండ్లు నిర్మాణం కాబోతున్నాయి. మేం నిర్మించే ఒక్క డబుల్‌బెడ్ రూం ఇల్లు మీరు కట్టించిన ఏడు ఇందిరమ్మ ఇండ్లకు సమానం' అని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కట్టిస్తున్న ఒక్కో ఇంటికి పట్టణాల్లో రూ.5.40లక్షలు, గ్రామాల్లో రూ.5.04 లక్షలు వెచ్చిస్తున్నామని తెలిపారు.

యాత్రలు కాదు చర్చకు సిద్ధం కావాలి: జగదీశ్‌రెడ్డి

పెద్ద నాయకులం అని పదేపదే చెప్పుకొనే కాంగ్రెస్ నాయకులు వారు సాధించిందేంటో చెప్పలేని దుస్థితిలో ఉన్నారని మంత్రి జగదీశ్‌రెడ్డి ఎద్దేవాచేశారు. మేలు చేసేవారిని ప్రజలే పెద్ద నాయకులుగా అభిమానిస్తారన్నారు. కానీ.. ఒడ్డు పొడుగు ఉండి, సంపాదించుకున్నవారు తమకు తామే పెద్దనాయకులం అంటూ సర్టిఫై చేసుకోవడం హేయమన్నారు. డెబ్బై ఏండ్ల పాలనలో జరుగని అభివృద్ధి, సంక్షేమం ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తున్నాయని చెప్పారు. దీనికి కారణమైన ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారని అన్నారు. ఏండ్ల తరబడి అధికారంలో ఉండి ఏదీ సాధించని వారు నేడు యాత్ర పేరిట ప్రజల వద్దకు వెళితే పట్టుమని పదిమంది కూడా రావడం లేదని ఎద్దేవాచేశారు. దమ్ము ధైర్యం ఉంటే ఎన్నికల మ్యానిఫెస్టోపై చర్చకు సిద్ధపడాలని సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రతి కుటుంబానికి తండ్రిలా వ్యవహరిస్తూ, అన్నీ సమకూరుస్తున్నారన్నారని చెప్పారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పార్లమెంట్, 12 నియోజకర్గాల్లో టీఆర్ఎస్ విజయంతో ఈ ప్రాంతం గులాబీమయం అవుతుందన్నారు. బహిరంగసభలో శాసనమండలి డిప్యూటీ స్పీకర్ నేతి విద్యాసాగర్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, వేముల వీరేశం, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, పూల రవీందర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం నీళ్లతో సూర్యాపేట సస్యశ్యామలం

జగదీశ్‌రెడ్డి కార్యదీక్షతో అభివృద్ధి పథంలో జిల్లా.. నియోజకవర్గ అభివృద్ధికి 1500 కోట్ల నిధులు

నాలా ఆధునీకరణ శంకుస్థాపనలో మంత్రి కేటీఆర్.. సీఎం కేసీఆర్‌కు జగదీశ్‌రెడ్డి కుడిభుజమని వ్యాఖ్య

సూర్యాపేట, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం నీళ్లతో సూర్యాపేట జిల్లా సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. మంగళవారం సూర్యాపేటలోని పెద్దనాలా ఆధునీకరణకోసం రూ.82 కోట్లతో చేపట్టనున్న పనులకు మంత్రి జీ జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గ అభివృద్ధికి జగదీశ్‌రెడ్డి రూ.1500 కోట్ల నిధులను తీసుకొచ్చారని తెలిపారు. జిల్లాకేంద్రంలో అతి పెద్ద సమస్యగా ఉన్న నాలా అభివృద్ధికోసం ఆయన కోరగానే రూ.82 కోట్లు మంజూరు చేశామన్నారు. అవసరమైతే మరిన్ని నిధులిస్తామన్నారు. 2001 నుంచి నాటి ఉద్యమ నేత, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కుడి భుజంగా ఉంటూ ఎలాంటి పదవులు, గుర్తింపులేకుండా నిస్వార్థంగా సేవచేసిన జగదీశ్‌రెడ్డి నేడు సూర్యాపేట ఎమ్మెల్యేగా వందల కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడిగా ఉన్ననాటినుంచే కేసీఆర్‌కు సూర్యాపేట నియోజకవర్గంపై మక్కువ ఉందన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి సూర్యాపేట నియోజకవర్గానికి మూడుసార్లు వచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ పూల రవీందర్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్, మదర్‌డెయిరీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతిరాథోడ్, నల్లగొండ ఇంచార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాశ్ పాల్గొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.34 గంటలకు



సూర్యాస్తమయం: 6.20 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం షష్ఠి రా.తె. 2.03 వరకు, నక్షత్రం: విశాఖ రాత్రి 10.35 వరకు, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.14 నుంచి 2.50 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.27 నుంచి 1.55 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.04 నుంచి 12.51 వరకు, వర్జ్యం: తె. 3.02 నుంచి 4.38 వరకు.

లోకం పోకడ





మంగళవారం లోక్‌సభలో స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న టీఆర్ఎస్ ఎంపీలు



పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీఆర్ఎస్ ఎంపీలు

ఢిల్లీలో టీఆర్ఎస్ పోరు

మొదటిపేజీ తరువాయి...

ఎంపీ కవిత, బాల్కసుమన్ తదితరులు పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. ఇదే సమయంలో కావేరీ జల వివాదంపై తమిళనాడు ఎంపీలు, ఏపీకి ప్రత్యేక హోదాకోసం ఆ రాష్ట్ర ఎంపీలు నిరసనలతో హోరెత్తించారు. ఎంపీల నిరసన ప్రతిధ్వనుల మధ్య సభను రెండుసార్లు వాయిదావేయాల్సి వచ్చింది. అనంతరం కరీంనగర్ ఎంపీ, లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష ఉపనేత బీ వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఉద్యోగాల నియామకాలలో 50శాతానికి మించి రిజర్వేషన్లను సుప్రీంకోర్టు అనుమతించిన దాఖలాలున్నాయని గుర్తుచేశారు. ఎం నాగరాజు, ఇతరులకు, కేంద్రం మధ్య కేసులో, అదేవిధంగా అశోక్‌కుమార్ అనే వ్యక్తికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య కేసులో 50శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వవచ్చని సుప్రీంకోర్టు తీర్పులిచ్చిన విషయాన్ని వివరించారు. ఈ తీర్పులను దృష్టిలో పెట్టుకుని తమ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రెండు ప్రత్యేక కమిటీలను నియమించారని తెలిపారు. షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్లపై అధ్యయనానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ చెల్లప్ప ఆధ్వర్యంలో, ముస్లింల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ సుధీర్ ఆధ్వర్యంలో కమిటీలను నియమించారని చెప్పారు. సమగ్ర అధ్యయనం తర్వాత చెల్లప్ప కమిటీ ఎస్టీల రిజర్వేషన్‌ను 6% నుంచి 9.08 శాతానికి పెంచాలని సిఫారసు చేసిందన్నారు. సుధీర్ కమిటీ బీసీ–ఈ గ్రూపులో ముస్లింలకు ప్రస్తుతమున్న రిజర్వేషన్‌కు అదనంగా 6% పెంచాలని సిఫారసు చేసిందని వెల్లడించారు. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితికి, తెలంగాణలో పరిస్థితికి మధ్య తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీ జనాభా మొత్తంగా 7.11% ఉంటే తెలంగాణలో వారి జనాభా 9.08శాతంగా ఉందని విశ్లేషించారు. వెనుకబడిన ముస్లింల జనాభా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 9.56% ఉంటే తెలంగాణలో 12.68% ఉందని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఆర్థికంగా, సామాజికంగా అణగారిన వర్గాలకు సముచిత న్యాయం చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రిజర్వేషన్లను 50% నుంచి 62 శాతానికి పెంచడానికి నిర్ణయించారని వివరించారు. దీనికి రాష్ట్ర చట్టసభలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రిజర్వేషన్ల పెంపు, విభజన చట్టంలోని హామీలపై తాము కేంద్రంతో రాజీలేని పోరాటం చేస్తామని ఎంపీ జితేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

రిజర్వేషన్ల అధికారాన్ని రాష్ట్రాలకే ఇవ్వాలి: ఎంపీ కవిత

రిజర్వేషన్లు 50% మించరాదని రాజ్యాంగంలో ఎక్కడాలేదని నిజామాబాద్ ఎంపీ కవిత స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు మాత్రమే ఒక తీర్పులో చెప్పిందని, పైగా అవసరమైనచోట 50శాతానికి మించి ఇవ్వవచ్చని తీర్పులు ఇచ్చిందని గుర్తుచేశారు. మైనార్టీలు అన్ని వర్గాల కంటే వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ నివేదిక వెల్లడించిందన్నారు. తమ రాష్ట్రంలో ప్రతిపాదించినవి మతపరమైన రిజర్వేషన్లు కావని, సామాజిక ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇవ్వాలని నిర్ణయించినవేనని కవిత స్పష్టంచేశారు రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 ప్రకారం రిజర్వేషన్లపై కేంద్రానికి అధికారం ఉందని, దీన్ని సవరించి, రాష్ట్రాలకే రిజర్వేషన్లను నిర్ణయించే అధికారాన్నివ్వాలని ఆమె డిమాండ్ చేశారు. విభజనచట్టంలో తెలంగాణకు పారిశ్రామిక రాయితీలు కల్పించే విషయాన్ని కవిత ప్రస్తావించారు. విభజన చట్టంలోని హామీలు, రిజర్వేషన్ల పెంపు అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని ఆమె తేల్చిచెప్పారు.

దేశరాజకీయాల్లోకి కేసీఆర్‌కు స్వాగతం

తెలంగాణ ఉద్యోగ సంఘాల నేతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఉద్యమనేత, ముఖ్యమంత్రి కేసీఆర్ దేశరాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకోవడం ఆహ్వానించతగ్గ పరిణామమని, దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఈ నిర్ణయాన్ని స్వాగతించాలని తెలంగాణ ఉద్యోగసంఘాల నేతలు అన్నారు. తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత, టీజీవో ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, టీఎన్జీవో ప్రధానకార్యదర్శి మామిండ్ల రాజేందర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు మణిపాల్‌రెడ్డి తదితరులు కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతించారు. జాతీయ రాజకీయాలలో కేసీఆర్ ప్రవేశంతో దేశంలో గొప్ప మార్పులు వస్తాయని తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథం ప్రవీణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎం కేసీఆర్ రాక హర్షణీయం



దేశ రాజకీయాల్లోకి సీఎం కేసీఆర్ రావడం హర్షణీయం. ఆయన వస్తే విప్లవాత్మక మార్పులు వస్తాయి. కేసీఆర్‌కు ప్రజా సమస్యలపైన స్పష్టమైన విజన్ ఉన్నది. దేశ రాజకీయాల్లో కేసీఆర్‌లాంటి వ్యక్తి ఉండాలి.

–రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



రాజకీయాలలో గుణాత్మక మార్పులను తీసుకురావాలనే లక్ష్యంతో మూడోఫ్రంట్ ఏర్పాటుకు సన్నద్ధమవుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. దేశప్రజల సమస్యలను పరిష్కరించే దిశలో తెలంగాణ నాయకత్వం ముందువరుసలో నిలువడం దేశచరిత్రలోనే అపూర్వఘట్టం.

– బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ జీ దేవీప్రసాద్

కేసీఆర్ ప్రయత్నం చారిత్రక అవసరం



కేంద్ర, రాష్ట్రాల అధికారాలు పునర్నిర్వచించేలా నిజమైన సమాఖ్య వ్యవస్థ రావాలని టీఆర్ఎస్ అధినేత జాతీయస్థాయిలో చేస్తున్న ప్రయత్నం చారిత్రక అవసరం. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం తగ్గించడంతోపాటు రాష్ట్రాల ప్రయోజనాలు, నిర్ణయాలపై కేంద్రానికి పరిమిత అధికారం ఉండేలా గుణాత్మక మార్పు అత్యావశ్యం.

–చంద్రశేఖర్‌గౌడ్, తెలంగాణ గ్రూప్1 అధికారుల సంఘం అధ్యక్షుడు

దేశ రాజకీయాల్లో చరిత్ర సృష్టిస్తారు



దేశంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు ప్రయత్నాలను దేశ ప్రజలంతా స్వాగతిస్తున్నారు. దేశ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారు. దేశవ్యాప్తంగా, చాలా రాష్ట్రాలు కొత్త నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నాయి.

–గెల్లు శ్రీనివాస్‌యాదవ్, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు

కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్‌కు సంపూర్ణ మద్దతు



ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటుచేసే థర్డ్‌ఫ్రంట్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తాం. దేశ రాజకీయాల్లోకి సీఎం కేసీఆర్ అడుగువేయడం అభినందనీయం. ప్రజాస్వామ్యబద్ధంగా కేంద్రంలో ప్రభుత్వం నడువకపోవడంతో మూడో ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తామని కేసీఆర్ ప్రకటించడం దేశ ప్రజలకు ఊరట కలిగింది. ఆయన వేసే ప్రతి అడుగులో 80 లక్షల మంది మాజీ సైనికులు ముందుంటాం.

– అమ్మిక రంగయ్యగౌడ్, మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం

కేసీఆర్‌తోనే కార్మికులకు న్యాయం



దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ, కాంగ్రెస్ విఫలమయ్యాయి. సీఎం కేసీఆర్ మూడో ఫ్రంట్ ఏర్పాటు నిర్ణయం సంతోషకరం. ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం.

– నక్క యాదగిరి, దక్షిణ భారతదేశ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యుడు

సత్తా ఉన్న నాయకుడు



సీఎం కేసీఆర్ సత్తా ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందారు. అధికార వికేంద్రీకరణ, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, రాష్ట్రాల అభివృద్ధి కార్యక్రమాల నిర్ణయాల్లో కేంద్రం జోక్యం చేసుకోకూడదు.

–వైవీ శ్రీనివాస్, నార్వే టీఆర్ఎస్ కోర్‌కమిటీ సభ్యుడు

కేసీఆర్‌తో అన్ని రాష్ట్రాలకు న్యాయం



దేశాన్ని పాలించే సత్తా ఉన్న నాయకుడు కేసీఆర్ జాతీయ రాజకీయాలకు రావడం చాలా సంతోషదాయకం. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరుగాలంటే కేంద్రంలో మార్పు అవసరం. దానికి కేసీఆర్ నాయకత్వం వహించాలి.

–గుంత అరవింద్‌బాబు, టీఆర్ఎస్ జర్మనీ కోర్ కమిటీ సభ్యుడు

రైతుల సంక్షేమం కోసం థర్డ్‌ఫ్రంట్

కరువు, కాటకాలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం థర్డ్‌ఫ్రంట్ తెస్తున్నారు.

–మహేందర్ బొజ్జ, పోలండ్ టీఆర్ఎస్ కోర్‌కమిటీ సభ్యుడు

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం సీఎం కేసీఆర్ ప్రధానమంత్రి కావాలి. **–ఐరెడ్డి సందీప్‌రెడ్డి, టీఆర్ఎస్ ఫిన్లాండ్ కోర్ కమిటీ సభ్యుడు**

దేశ రూపరేఖలను మార్చడానికి జాతీయ రాజకీయాల్లోకి సీఎం కేసీఆర్ అడుగు పెట్టడం శుభ పరిణామం. **– జీ మహేందర్‌శర్మ**

జాతీయ రాజకీయాల్లోకి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశించడం సంతోషించదగ్గ, ఆహ్వానించదగ్గ పరిణామం.కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడం ద్వారా దేశ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.

–తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ)

దేశ రాజకీయాలపై సీఎం కేసీఆర్ దృష్టిసారించడం శుభ పరిణామం. దేశ రాజకీయాల్లోకి ఆయన వెళ్లడం కచ్చితంగా దేశప్రజలకు మేలు చేస్తుంది.

– కాందూరి నరేందర్ ఆచార్య, ప్రతాపురం శేషాచార్యులు, రాష్ట్ర బ్రాహ్మణ శ్రీ వైష్ణవ సేవా సమితి

మహిళామూర్తులకు పురస్కారాలు

అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా రేపు ప్రదానం

వివిధ రంగాల్లో సేవలందించిన 20 మంది ఎంపిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇరవై మంది మహిళా ప్రముఖులకు విశిష్ట పురస్కారాలను ప్రకటించింది. అనేక రంగాలలో అద్భుత సేవలందించిన మహిళలను ఈ పురస్కారాలకు ఎంపికచేశారు. మార్చి 8న గురువారం హైదరాబాద్ పబ్లిక్‌గార్డెన్స్‌లోని తెలుగు లలితకళాతోరణంలో ఘనంగా నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో ఈ పురస్కారాలను ప్రదానంచేస్తారు.

అవార్డు గ్రహీతలు వీరే..

అవార్డులకు ఎంపికైన వారిలో విద్యారంగంలో సేవలందిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్‌ఆర్ట్స్ కాలేజీ వైస్‌ఛాన్సలర్ కవితాదర్యాని విశిష్ట మహిళా పురస్కారానికి ఎంపికయ్యారు. క్రీడారంగంలో ప్రపంచ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇటీవల కాంస్యపతకాన్ని గెలుచుకొన్న అరుణారెడ్డి, వైద్యరంగంలో పుణెలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోపతి సంస్థ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ సత్యాలక్ష్మి అవార్డులకు ఎంపికయ్యారు. పద్యకవిత్వంలో విలక్షణ సాహిత్య సృజనచేసి అభినవ మొల్లగా పేరుగడించిన చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ, బాలసాహిత్యానికి అపురూప కానుకలను అందించిన డాక్టర్ సిరి సాహిత్యవిభాగంలో ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. రాంకోఠిలోని రాష్ట్ర ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో నృత్యాన్ని అభ్యసించి, అదే కళాశాలలో నృత్యగురువుగా సేవలందించిన మంజులా శ్రీనివాస్ నృత్యరంగంలో అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం సొంతంగా ఒక డ్యాన్స్ అకాడమీని నిర్వహిస్తున్నారు. ఆమె వద్ద నృత్యం నేర్చుకున్న వేలమంది ప్రపంచవ్యాప్తంగాఉన్నారు. సినీగాయని, కర్ణాటక సంగీత కళాకారిణి నిత్య సంతోషిని శాస్త్రీయ సంగీత రంగంలో అవార్డుకు ఎంపికయ్యారు. సంగీతంలో ప్రవేశమున్న తల్లి నుంచి చిన్ననాటి నుంచే సంగీత పాఠాలు నేర్చుకున్న సంతోషిని వేల సంఖ్యలో భక్తి, సినీ గీతాలు ఆలపించారు. చిత్రకళావిభాగంలో కవితాదేవుస్కర్ విశిష్ట మహిళా పురస్కారాలకు ఎంపికయ్యారు. సినిమారంగంలో నందినిరెడ్డిని, జానపదసంగీతంలో ఝాన్సీని ఎంపికచేశారు. ఉద్యమగానంలో ఈదునూరి పద్మను ఎంపికచేశారు. ఔత్సాహిక మహిళా పురస్కారానికి డీ రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు. జర్నలిజం విభాగంలో 'నమస్తే తెలంగాణ' జర్నలిస్ట్ సౌమ్య నాగపురి, లతాజైన్ విశిష్ట మహిళా పురస్కారాలను అందుకోనున్నారు. సౌమ్య నాగపురి.. నమస్తే తెలంగాణ ప్రారంభ కాలం నుంచి సంస్థలో పనిచేస్తున్నారు. ఆర్తితో కూడిన తెలంగాణ అనుభవాలు, మన సంప్రదాయ ఆహార్యం, పసందైన పల్లె రుచులను పరిచయం చేస్తూ ఆమె తెలంగాణ 'జిందగీ'ని ఆవిష్కరించారు. పదేండ్ల పాత్రికేయ జీవితంలో ఎన్నో జీవితాల గెలుపోటముల్ని పంచుకునే ప్రముఖుల ముచ్చట్లను ఆమె అందించారు. మొట్టమొదటిసారి మెట్రోరైల్‌ను నడిపి ప్రశంసలందుకొన్న సుప్రియ సనమ్, ఢిల్లీ ఆర్టీసీ డ్రైవర్ సరితలను తెలంగాణ ప్రభుత్వం విశిష్ట మహిళా పురస్కారాలకు ఎంపికచేసింది. మహిళా సాధికారతలో యాప భద్రమ్మ, వ్యవసాయంలో బొగ్గం జయమ్మ, ప్రజాప్రతినిధుల విభాగంలో కొత్తపల్లి సర్పంచ్ శైలజ, సామాజిక సేవారంగంలో గండ్ర రమాదేవి విశిష్ట పురస్కారాలకు ఎంపికయ్యారు. లలితకళాతోరణంలో గురువారం జరిగే అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో వీరందరికీ పురస్కారాలను అందజేస్తారు. ఒక్కొక్కరికీ లక్ష రూపాయల చెక్కు, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను ఇచ్చి సత్కరిస్తారు.

టీ హబ్‌ను సందర్శించిన కెనడా బృందం

- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా అనలిటిక్స్‌పై కలిసి పనిచేసేందుకు ఆసక్తి**



మంగళవారం హైదరాబాద్‌లోని టీహబ్‌ను సందర్శించిన అనంతరం మాట్లాడుతున్న కెనడాకు చెందిన ప్రముఖ ఆవిష్కరణల కేంద్రం బోరియాలిస్ ఏఐ బృందం సభ్యులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన టీహబ్ వివిధ స్టార్టప్‌లకు విశేషమైన భరోసాను కల్పిస్తున్నదని కెనడాకు చెందిన ప్రముఖ ఆవిష్కరణల కేంద్రం బోరియాలిస్ ఏఐ పేర్కొంది. వివిధ రంగాల్లో టీహబ్ ఆవిష్కరణలు తమ ప్రత్యేకతను చాటుకున్నాయని ప్రశంసించింది. కెనడాకు చెందిన ఈ బృందంలోని ప్రతినిధులు మంగళవారం టీహబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టీహబ్‌లోని స్టార్టప్ ప్రతినిధులతో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వమే ముందుకు వచ్చి ఆవిష్కరణల కేంద్రం ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా అనలిటిక్స్‌పై కలిసి పనిచేసేందుకు కెనడా బృందం ఆసక్తి చూపింది. దీనిపై ప్రాథమికంగా చర్చలు జరిపింది.

తెలంగాణలో పెరిగిన 27 పీజీ మెడికల్ సీట్లు

- **ఎంసీఐ ఉత్తర్వులు జారీ** ■ **వైద్యసిబ్బందిని, అధికారులను అభినందించిన మంత్రి లక్ష్మారెడ్డి**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని నాలుగు మెడికల్ కాలేజీల్లో 27 పీజీ మెడికల్ సీట్లను పెంచుతూ.. మంగళవారం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) ఉత్తర్వులు జారీచేసింది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి తాజా పెంపుదల వర్తిస్తుంది. కాకతీయ మెడికల్ కాలేజీ పరిధిలో డెర్మటాలజీ (ఎండీ)లో ఒక సీటు, ఓబీజీవై (ఎండీ)లో ఐదు, రేడియోడయాగ్నసిస్ (ఎండీ)లో మూడు, ఈఎన్టీ (ఎంఎస్) ఒకటి, ఆప్తమాలజీ (ఎంఎస్)లో ఒక సీటును అదనంగా పెంచారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో అనస్తీషియాలజీ (ఎండీ)లో ఇప్పటివరకు పది సీట్లు ఉండగా.. అదనంగా మరో రెండు సీట్లను పెంచారు. పల్మోనరీ మెడిసిన్ (ఎండీ)లో ప్రస్తుతం మూడు సీట్లు ఉండగా.. ఒక సీటును పెంచారు. నిమ్స్‌లో అనస్తీషియాలజీ (ఎండీ) లో పదిహేను సీట్లుండగా.. ఇరవై ఒక్కటికి పెంచారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ పరిధిలో ఓబీజీవై (ఎండీ) లో నాలుగు సీట్లు, ఈఎన్టీ (ఎంఎస్) లో మూడు సీట్లను అదనంగా పెంచుతూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఈ నాలుగు వైద్య కళాశాలల్లో ఇప్పటివరకు 70 పీజీ వైద్య విద్య సీట్లు ఉండగా.. తాజాగా పెంచిన 27 సీట్లతో కలుపుకొని మొత్తం 97 సీట్లయ్యాయి. ఇదిలా ఉండగా.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చొరవతో ప్రభుత్వ దవాఖానల్లో సదుపాయాలు, ఆధునీకరణ, యంత్రాలను పెంచడంతో వైద్య విద్యలో సీట్లను పెంచారు. పీజీ సీట్ల సంఖ్యను పెంచడంతో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సీట్లు పెరుగడానికి కృషిచేసిన వైద్య సిబ్బందిని, అధికారులను వైద్య, ఆరోగ్య శాఖామంత్రి లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు.

రైతుల ఆదాయం రెట్టింపు చేస్తాం

- **అందుకోసమే వ్యవసాయాధారిత పరిశ్రమలు**
- **త్వరలోనే విధివిధానాలు ఖరారు**
- **మార్చి 15న మరోసారి ఉపసంఘం సమావేశం**
- **ఆహారశుద్ధి కేంద్రాల ఏర్పాటుపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రి పోచారం**



ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు విధివిధానాల రూపకల్పన కోసం వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో సమావేశమైన క్యాబినెట్ సబ్ కమిటీ బృందం. చిత్రంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పరిశ్రమలశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ ఉన్నారు.

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని పటిష్ఠ పరుచడం ద్వారా, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడంలో భాగంగా.. విధివిధానాల రూపకల్పన కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆగ్రోప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు విధివిధానాల రూపకల్పన కోసం వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ మంగళవారం సచివాలయంలోని డీ బ్లాక్‌లో సమావేశమైంది. రాష్ట్రంలో ప్రాంతాలవారీగా అనుగుణంగా ఉండే పరిశ్రమలు, పంటల విస్తీర్ణం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిశ్రమలు, కొత్తగా అవసరమయ్యే పరిశ్రమల స్థాపనకు సంబంధించిన వివిధ అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్టు మంత్రి పోచారం తెలిపారు. త్వరలో వ్యవసాయ శాఖ, ఇతర సంబంధితశాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలు.. రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథితో సమావేశమై సలహాలు, సూచనలను అందిస్తారని వివరించారు.

రైతు శ్రేయస్సే సీఎం లక్ష్యం

ఇప్పటివరకు దేశంలో వ్యవసాయరంగం గురించి కానీ, రైతుల గురించి కానీ పట్టించుకున్న నాయకుడే లేరని మంత్రి పోచారం అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక, టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక, స్వయంగా రైతు అయిన సీఎం కేసీఆర్.. రైతుల సాధక బాధకాలు తెలిసినవారిగా.. వారి శ్రేయస్సుకోసం కృషిచేస్తున్నారని చెప్పారు. రైతుశక్తిని, వారి ఆత్మగౌరవాన్ని పెంచి, పంటలకు లాభసాటి ధరలను కల్పించాలనే ఉద్దేశంతో దేశంలోనే మొదటిసారిగా రైతుల కోసం శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా, రాబోయే కొద్దిరోజుల్లో రెండు పంటలకూ సాగునీరు, వచ్చే వానాకాలంనుంచి ముందస్తు పెట్టుబడికి ఎకరానికి రూ.8000 అందిస్తామని పేర్కొన్నారు. సేద్యాన్ని బలోపేతంచేస్తూ రైతులు ఆనందంగా పంటలు పండించడమే కాకుండా.. పండించిన పంటను ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఇతర ప్రాంతాలకు, దేశాలకు ఎగుమతులు చేసి రైతులకు మంచి ధరలు వచ్చే విధంగా విధివిధానాలను రూపొందించడమే క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు ఉద్దేశం అన్నారు. జిల్లాలవారీగా పంటల ఉత్పత్తుల సమాచారం సేకరిస్తామని, వాటి ఆధారంగా ఆహారశుద్ధి (ఫుడ్‌ప్రాసెసింగ్) యూనిట్లను ఏర్పాటుచేస్తామని మంత్రి పోచారం చెప్పారు. రైతులు పంటలు పండించినందుకు ఆనందపడాలన్నదే వీటి ఉద్దేశమని స్పష్టంచేశారు. ఈ నెల 15న మంత్రివర్గ ఉపసంఘం మరోసారి సమావేశమవుతుందని చెప్పారు. వ్యవసాయాధారిత పరిశ్రమలకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేసిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేసి క్యాబినెట్ ఆమోదం తీసుకొంటామని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకొనే ఈ చర్యలతో తెలంగాణ వ్యవసాయరంగం మున్ముందు దేశంలోనే అగ్రగామి అవుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు, మార్కెటింగ్‌శాఖ మంత్రి టీ హరీశ్‌రావు, ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ డాక్టర్ ఎం జగన్మోహన్, పరిశ్రమలశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, టీఎస్‌ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ యూనివర్సిటీకి నిధులు

రూ. 9.6 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొండాలక్ష్మణ్ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయ నిర్వహణ, వివిధ పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. రెండు జీఓల్లో రూ. 9.6 కోట్లను హార్టికల్చర్ యూనివర్సిటీకి కేటాయించినట్లు వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవోగా రజత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఎన్నికల సంఘం తొలి ప్రధానాధికారిగా 1991 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రజత్‌కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం సచివాలయంలోని హెచ్ బ్లాక్‌లో ఇంచార్జి ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) అనూప్‌సింగ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. సీఈవోగా పనిచేసిన భన్వర్‌లాల్ పదవీవిరమణ తర్వాత అనూప్‌సింగ్ ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అటవీ పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న రజత్‌కుమార్‌ను సీఈవోగా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పూర్తిస్థాయి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా రజత్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు.

మార్కెట్‌యార్డుకు విద్యాసాగర్‌రావు పేరు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మం డలం జాజిరెడ్డిగూడెం సబ్‌మార్కెట్‌యార్డుకు తెలంగాణ సాగునీటిపారుదలరంగ నిపుణుడు, దివంగత విద్యాసాగర్‌రావు పేరును ఖరారు చేసింది. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆన్‌లైన్‌లోనే ఎల్పీసెట్, డీఈఈసెట్


కన్వీనర్‌గా రమణకుమార్

నేడు సెట్స్ కమిటీ సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా భాషా పండితుల ఉమ్మడి ప్రవేశ పరీక్షలు (ఎల్పీసెట్), డీఎడ్/డైట్ కాలేజీల్లో సీట్ల భర్తీకి డీఈఈసెట్-2018 ఆన్‌లైన్లో నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రెండువారాల్లో నోటిఫికేషన్‌తోసహా పరీక్షల తేదీలను విడుదల చేయనున్నారు. మే నెలాఖరులో ఎల్పీసెట్, జూన్ రెండో వారంలో డీఈఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించే అవకాశాలున్నాయి. ఎల్పీసెట్, డీఈఈసెట్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రమణకుమార్‌ను కన్వీనర్‌గా నియమిస్తూ మంగళవా రం విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. దీనిపై బుధవారం సెట్స్ కమిటీ సమావేశమై పలు అంశాలపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు కన్వీనర్ రమణకుమార్ తెలిపారు.

9 నుంచి 19 వరకు అఫిలియేషన్ దరఖాస్తుల స్వీకరణ

2018-19 విద్యా సంవత్సరంలో భాషా పండితుల కాలేజీలు అఫిలియేషన్ పొందడం కోసం ఈ నెల 9 నుంచి 19 వరకు దరఖాస్తుల స్వీకరణకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్టీ) నోటిఫికేషన్ జారీచేసింది. అఫిలియేషన్ కోసం రూ.75వేలు ఫీజును చెల్లించాలని విద్యాశాఖ డైరెక్టర్ కిషన్ తెలిపారు.




ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మాత్రమే నిలబడగలుగుతుందనే అభిప్రాయం ఉండేది. కానీ ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాల్లో గెలువడం ద్వారా బీజేపీ ఆ అభిప్రాయాన్ని మార్చింది.


రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి

ప్రజల సొమ్మును దోచుకుటున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఇప్పటివరకు నీరవ్ మోదీ, మెహల్ చోక్సీ, విన్సస్ డైమండ్ జతిన్ మెహతాల సంస్థలు కలిసి 27000 కోట్లు కొల్లగొట్టాయి. ఈ ముగ్గురికి ప్రభుత్వం, ఈ ప్రభుత్వ నాయకత్వం అండ ఉన్నది. ప్రధాని వీళ్లకు వ్యక్తిగతంగా తెలుసు.

ఆనంద్‌శర్మ, కాంగ్రెస్ సీనియర్ నేత



చరిత్రలో నేడు




1876

అమెరికాలో టెలిఫోన్‌పై పేటెంట్ పొందిన అలెగ్జాండర్ గ్రాహంబెల్.

1912



దక్షిణ ధృవాన్ని కనుగొన్నట్టు ప్రకటించిన రోనాల్డ్ అమండ్ సేన్.



1936

వర్సైల్స్ ఒప్పందాన్ని ఉల్లంఘించి రైన్‌లాండ్‌కు సేనలను పంపిన హిట్లర్.

జార్జి వాషింగ్టన్ దేశాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ, పదవి పట్ల ఆసక్తి కనబరుచలేదు. ఎంతో ఒత్తిడి వల్ల రెండోసారి కూడా అంగీకరించారు. మూడోసారి కొనసాగమన్నప్పుడు, అది నిరంకుశత్వానికి దారితీస్తుందని హెచ్చరించారు. ఆ తరువాత కాలంలో అమెరికనులు నిరంకుశత్వాలను ఎదుర్కోవడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టారు. కానీ అధ్యక్షుడు ట్రంప్ మాత్రం నిరంకుశత్వాన్నే ఇష్టపడుతున్నారు. చైనా అధ్యక్షుడు జి జిన్ పింగ్ జీవితకాలం అధ్యక్షుడిగా ఉండటం గ్రేట్ అని మెచ్చుకున్నారు. ట్రంప్ కూడా అట్లా ఉండాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

ది న్యూయార్క్ టైమ్స్

శత్రువుకు అందనంత రహస్యంగా వేగంగా కదలాలని ప్రష్యన్ యుద్ధ వ్యూహకర్త కార్ల్‌వాన్ కాజ్‌విట్జ్ చెప్పాడు. కానీ కాంగ్రెస్ ఈ విషయంలోనే వెనుకబడుతున్నది. మేఘాలయలో అతి పెద్ద పార్టీగా అవతరించింది. పార్టీ పెద్దలు అధికారం కోసం హడావుడి చేసి, చివరికి చాప చుట్టుకొని వచ్చారు. తోడు పెళ్లికూతురుగా ఉండటానికి అలవాటు పడినవాళ్లు ఎప్పటికీ పెళ్లికూతురు కాలేరు. కాంగ్రెస్‌ది అదే పరిస్థితి. గతంలో మణిపూర్‌లో, గోవాలో కూడా ఇటువంటి అనుభవాలే ఎదురయ్యాయి. ఉప ఎన్నికల్లో గెలిచిన ఆనందాన్ని పొందుతున్నదే తప్ప, 2019 ఎన్నికల కోసం సమాయత్తం కావడం లేదు.

హిందుస్థాన్ టైమ్స్

ఈశాన్య రాజకీయం

చాలాకాలం తర్వాత ఈశాన్య రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించాయి. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ చురుకైన పాత్ర నిర్వహించడమే ఈ ఆసక్తికి కారణం. త్రిపురలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న సీపీఎంను ఓడించి, అపూర్వమైన రీతిలో బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోవడం విశేషమే. మొత్తం అరువై స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీ 35 స్థానాలను, ఆదివాసీ పార్టీ అయిన మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ ఎనిమిది స్థానాలను గెలుచుకున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇది వామపక్షానికి, మత పార్టీకి మధ్య ముఖాముఖి జరిగిన పోరుగా కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. బీజేపీ నేతలు కూడా తాము సీపీఎంను మట్టి కరిపించిన ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు పార్టీలు నిజంగానే తమ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రచారం సాగిస్తే బాగానే ఉండేది. కానీ సిద్ధాంతాలు, విలువలకు తావు లేకుండా, రాజకీయ ఎత్తుగడలతో తలపడ్డాయి. ఈశాన్యంలో సాధించిన విజయాలతో బీజేపీ దేశవ్యాప్త పార్టీగా మారిందని కూడా ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ బలహీనపడిన చోట ఆ శూన్యాన్ని కొంతవరకు బీజేపీ భర్తీచేస్తున్న మాట నిజమే. అయితే బీజేపీకి ఉత్తరాదిన ఉన్న పునాది ఇతర ప్రాంతాల్లో ఇంకా ఏర్పడలేదు. రేపు కేంద్రంలో మరో బలమైన రాజకీయ పక్షం అవతరిస్తే, ఈశాన్య రాష్ట్రాల్లోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అటువైపు మొగ్గడానికి ఎంతోకాలం పట్టదు.

మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల తీరును గమనిస్తే, కాంగ్రెస్ పోరాడే సత్తా కోల్పోయిందనేది స్పష్టమవుతున్నది. కాంగ్రెస్ బలహీనపడే కొద్దీ బీజేపీ బలపడుతున్నది. త్రిపురలో కాంగ్రెస్ 2013లో 36.54 శాతం ఓట్లు తెచ్చుకున్నది. కానీ ఈ ఎన్నికల్లో ఒక్కసారిగా 1.8 శాతానికి పడిపోయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ 43 శాతం ఓట్లు తెచ్చుకుంటే, మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ 7.5 శాతం ఓట్లు పొందింది. ఇంతకాలం సీపీఎంను ఓడించడానికి కాంగ్రెస్ పార్టీ ఏ మాత్రం ఆసక్తి చూపలేదని స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్ నాయకత్వంపై మమతాబెనర్జీ కూడా ఇటువంటి ఆరోపణలే చేసేవారు. నైరాశ్యంలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను బీజేపీ తమవైపు తిప్పుకున్నది. వీరికి సీపీఎం కార్యకర్తల దాడులను తిప్పికొట్టడానికి కావలసిన గుండె ధైర్యాన్ని బీజేపీ నాయకత్వం అందించింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా తమవైపు చేసే క్రమంలో బీజేపీ ధనబలాన్ని ప్రయోగించిందనే ఆరోపణలున్నాయి. నాగాలాండ్ ఎన్నికల విషయానికి వస్తే, ఇక్కడ కాంగ్రెస్ బలమైన శక్తి కాదు. కానీ 2013 ఎన్నికల్లో యాభై ఆరు స్థానాలకు పోటీ చేసి ఎనిమిది మాత్రమే గెలుచుకున్నది. కానీ 24.89 శాతం ఓట్లు తెచ్చుకున్నది. కానీ ఈ మాత్రం బలాన్ని కాపాడుకోలేకపోయింది. కనీసం ప్రచారానికి కూడా ఎవరూ రాలేదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. మేఘాలయలో పార్టీ బలంగానే ఉన్నప్పటికీ, అధికారానికి చేరువగా వచ్చి కూడా అందుకోలేకపోయింది. అధిష్ఠానం ఎన్నికల ముందు నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే, స్థానిక పార్టీలతో కలిసి అధికారం చేపట్టగలిగి ఉండేది. రెండే రెండు సీట్లు గెలుచుకున్న బీజేపీ 21 సీట్లున్న కాంగ్రెస్‌ను అధికారం చేపట్టకుండా అడ్డుకోగలిగింది.

ఈశాన్యం గిరిజనులతో నిండిన రాష్ట్రం. ప్రధాన భూభాగంతో పోలిస్తే జాతిపరంగా, సాంస్కృతికంగా వైవిధ్యం కనిపిస్తుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన అవకాశవాద రాజకీయాల వల్ల అక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. కేంద్ర పాలకులు మొద్దుబారి ఉండటం వల్ల అక్కడి ప్రజల ఆకాంక్షలను ఏమాత్రం పట్టించుకోలేదు. అనేక సమస్యలను సకాలంలో పరిష్కరించక మురగబెట్టడం వల్ల, సంక్షోభాలు తలెత్తి హింసాయుత ఉద్యమాలు, సాయుధ వేర్పాటువాద పోరాటాలు చెలరేగాయి. ఇప్పుడు కాంగ్రెస్ స్థానంలో వచ్చిన బీజేపీ కూడా అదే బాటలో నడువడం విషాదకరం.

ఈశాన్యం గిరిజనులతో నిండిన రాష్ట్రం. ప్రధాన భూభాగంతో పోలిస్తే జాతిపరంగా, సాంస్కృతికంగా వైవిధ్యం కనిపిస్తుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన అవకాశవాద రాజకీయాల వల్ల అక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. కేంద్ర పాలకులు మొద్దుబారి ఉండటం వల్ల అక్కడి ప్రజల ఆకాంక్షలను ఏమాత్రం పట్టించుకోలేదు. అనేక సమస్యలను సకాలంలో పరిష్కరించక మురగబెట్టడం వల్ల, సంక్షోభాలు తలెత్తి హింసాయుత ఉద్యమాలు, సాయుధ వేర్పాటువాద పోరాటాలు చెలరేగాయి. ఇప్పుడు కాంగ్రెస్ స్థానంలో వచ్చిన బీజేపీ కూడా అదే బాటలో నడువడం విషాదకరం. నాగాలాండ్‌లో బీజేపీ ఇటీవలివరకు నాగాలాండ్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)తో అధికారం పంచుకున్నది. కానీ ఎన్నికల ముందు తెరచాటు మంతనాలు జరిపి, ఎన్‌డీపీపీతో పొత్తు పెట్టుకున్నది. కేంద్రంలో ఇప్పటికీ ఎన్‌పీపీ మిత్రపక్షంగానే ఉన్నది. మణిపూర్‌లో కూడా ఈ పార్టీ మద్దతు తీసుకుంటున్నది. గిరిజన పార్టీల బలహీనతను ఆసరాగా చేసుకొని ఇష్టారీతిన పొత్తులు పెట్టుకోవడం, తిరస్కరించడం వల్ల రాజకీయ విలువలు నశించి, ఆ ప్రభావం సమాజం పడుతుంది. విలువలు లేని రాజకీయాలు ఈశాన్య రాష్ట్రాలను సంక్షోభంలోకి నెట్టవచ్చు. త్రిపురలో సీపీఎం బెంగాలీల ప్రాతినిధ్య పార్టీ. బెంగాలీల ఆధిపత్యం వల్ల ఆదివాసీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటికే తమ ప్రాంతంలో అల్పసంఖ్యాకులుగా మారామని వారు ఆవేదన చెందుతున్నారు. గిరిజన మండలి భూభాగాన్ని రాష్ట్రంగా ప్రకటించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గిరిజనులు బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇచ్చారు. వీరికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వడమో, వారి అస్తిత్వాన్ని కాపాడటానికి ఆమోదయోగ్య పరిష్కారం చూపడమో తప్పనిసరి. మిత్రపక్షమైన ఐపీఎఫ్‌టీతో సత్వరం చర్చలు జరుపడం మంచిది. నాగాలాండ్ కూడా ఇంకా చల్లబడలేదు. ఇక్కడ కూడా నాగా పార్టీలతో చెలిమిని ఎన్నికల ప్రయోజనాలకే పరిమితం చేయకుండా, సమస్య పరిష్కారానికి ఉపయోగించుకోవాలె. కాంగ్రెస్ బాటలోనే బీజేపీ నడిస్తే, ఈశాన్యం మరింత సంక్షోభమయం అవుతుంది.

జనగళం

అధికారుల నిర్లక్ష్యం

రోగాల బారిన పడిన మేకలు, గొర్రెల వధతో మారుమూల గ్రామీణ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రతి మటన్ షాప్ యజమాని మేకలు, గొర్రెలను వధించే ముందు సమీపంలోని పశువుల దవాఖానకు తీసుకెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. వైద్యుడు అనుమతిస్తేనే ఆయా మేకల మాంసం అమ్మాలనే నిబంధనలున్నా ఏ దుకాణాదారుడు ఆయా నిబంధనలను పాటించడం లేదు. పశువైద్యులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో మాంసం దుకాణాదారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పశు వైద్యాధికారులు స్పందించాలి.

- బోడపట్ల కిషన్, కురిక్యాల, కరీంనగర్

శుభపరిణామం

ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో గుణాత్మక మార్పు తెచ్చేందుకు ప్రత్యామ్నాయ కూటమికి ప్రయత్నాలు ప్రారంభించడం హర్షణీయం. ఏండ్ల తరబడి దేశాన్ని పాలించిన జాతీయపార్టీలు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేశాయి. ప్రస్తుత వ్యవసాయ సంక్షోభానికి ఈ పార్టీలు అనుసరించిన విధానాలే కారణం. ఈ క్రమంలోనే కేసీఆర్ కాంగ్రెసేతర, బీజేపీయేతర కూటమి కోసం చేస్తున్న కృషికి దేశవ్యాప్తంగా వివిధ నేతల నుంచి మద్దతు లభించడం శుభపరిణామం.

- సీహెచ్ అరుణ్‌కుమార్, వెల్గనూర్, దండెపల్లి, మంచిర్యాల జిల్లా

దోమలను నివారించాలె

వేసవిలో దోమలు విస్తరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా దోమల నివారణపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి. లేకుంటే డెంగ్యూలాంటి వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉన్నది. చెత్తకుండీలు, మురుగుకాల్వల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయాలి. అప్పుడే దోమల నివారణ సాధ్యమవుతుంది.

- పుల్కం సంపత్ కుమార్, రాములపల్లె, పెగడపల్లి

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

వ్యవసాయం



డాక్టర్ పిడిగెం సైదయ్య

మద్దతు ధరల బాధ్యత కేంద్రానిదే

అధికారంలోకి రాకముందు పార్టీలు వ్యవసాయ సంస్కరణలు, మద్దతు ధరలతోనే మొదలవుతాయని చెబుతుంటాయి. అధికారంలోకి వచ్చాక ఆ విషయం మరిచిపోతుంటాయి. దీంతో గిట్టుబాటు ధర రైతుకు అందని ద్రాక్షగా మారింది. అందుకే రైతులకు లాభం ఉండేలా, ఖర్చులు పోను ధరలు లెక్కగట్టాలని తెలంగాణ రాష్ట్రం మొదటినుంచి కేంద్రానికి విన్నవిస్తున్నది. అలాగే కచ్చితంగా కనీస మద్దతు ధరలలో పూర్తిస్థాయి సంస్కరణలు జరుగాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అంటున్నారు. రైతులందరికి తమ పంటల ధరలు తామే నిర్ణయించుకునే అధికారం ఉండాలని మేలైన సిఫార్సుకు నాంది పలికారు.

వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం. రైతులు వేసే పంటలు, వాతావరణ అనుకూలత, రాష్ట్ర అవసరాలు, వినియోగదారుల డిమాండ్లను బట్టి పంటల విస్తీర్ణం, సరళి, రైతులు పంటలకు ఇచ్చే ప్రాధాన్యం మారుతున్నది. అయితే రాష్ట్ర వ్యవసాయంలో కీలకమైన విత్తనాలు, మద్దతు ధరలను కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకొని పరోక్షంగా రాష్ట్రాలను శాసిస్తున్నది. దేశంలోని అన్నిరాష్ట్రాలు వ్యవసాయ ప్రధానమైనవే. తమ రైతులు పండించాల్సిన పంటల విత్తనాలు, రావాల్సిన ఉత్పత్తుల ధరలపై అవసరాన్నిబట్టి నిర్ణయం తీసుకోకపోవడానికి కారణం అవి తమ పరిధిలో లేకపోవడమే. దేశవ్యాప్తంగా ఒకే విత్తన చట్టం ఉన్నది. 1966 నాటి చట్టం అది. కల్తీ విత్తనాలు రైతులకు అమ్మితే శిక్షించే కఠిన చర్యలు అందులో లేవు. విత్తన భాండాగారంగా పేరొందిన తెలంగాణ రాష్ట్రం సొంతంగా విత్తన చట్టానికి రూపకల్పన చేసుకోవాలనుకుంటున్నా కేంద్రం మొదటినుంచి మోకాలడ్డుతున్నది. దీంతో విత్తన కష్టాలు తీరడంలేదు. అదేవిధంగా రాష్ట్రాల్లో భూముల సారం, వ్యవసాయ వాతావరణ మండలాలతో ముడిపడి ఉంటాయి. దీనివల్ల పంటల ఉత్పత్తి ఖర్చులు ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఉంటాయి. వేర్వేరుగా ఉన్న అన్నిరాష్ట్రాల ఉత్పత్తి ఖర్చులను సరాసరిగా తీసి కేంద్రం ఒకే ధరలు లెక్కగడుతున్నది. దీంతో చాలారాష్ట్రాలు నష్టపోతున్నాయి.

రైతుకు అయ్యే పెట్టుబడి ఖర్చులు తిరిగి తెచ్చేలా మద్దతు ధరలు లేవు. కనీసం ప్రస్తుతం విఫణిలో ఉన్న ధరలు కూడా కల్పించడం లేదు. కేంద్రం 2022 నాటికి రైతుల సరాసరి ఆదాయలు రెట్టింపు చేస్తామన్నది సాకారం కావాలంటే పంటల ఉత్పాదకతలో మెరుగుతోనే సాధ్యం కాదు. రోజురోజుకు పెరుగుతున్న పెట్టుబడులు తిరిగి రాబట్టడంతోపాటు, లాభాలు చూడగలిగితేనే రైతుల బతుకులు మారుతాయి. అయితే ఆ ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. దేశంలోని దాదాపు 17 రాష్ట్రాల్లో వ్యవసాయం నుంచి రైతు సంపాదించగలుగుతున్న ఆదాయం సాలీనా సరాసరి రూ.20,000 మాత్రమే. సంక్షోభంలో ఉన్న వ్యవసాయానికి కాయకల్ప చికిత్స అవసరమని 2016 ఆర్థిక సర్వే చెబుతున్నది. కానీ తాత్కాలిక చికిత్సకు మాత్రమే కేంద్రం పూనుకుంటున్నది.

దేశంలో వానకాలం, యాసంగిల్లో పంటలు సాగుచేసే ముందు ఆయా కాలాల్లో సాగుచేసే పంటలకు కేంద్రం వేర్వేరుగా మద్దతు ధరలు ప్రకటిస్తున్నది. దేశంలో దాదాపు అన్నిరాష్ట్రాల్లో ప్రధాన పంట అయిన వరి క్వింటాలుకు 2016-17 మద్దతు ధర రూ.1470. అలాగే 2015-16లో రూ.1410. అంటే అరువై రూపాయలు మాత్రమే పెంచారు. కానీ వాస్తవానికి దేశంలో సుమారు క్వింటాలు వరి ఉత్పత్తికి అయ్యే ఖర్చు సుమారు రూ.2000. అంటే రైతు క్వింటాలుకు దాదాపు రూ.330 నష్టపోతున్నాడు. తెలంగాణ వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో క్వింటాలు ధాన్యం ఉత్పత్తికి సుమారు రూ.2053 ఖర్చవుతున్నది. ఈ లెక్కన రైతు క్వింటాలుకు రూ.583 నష్టం భరించాల్సి వస్తున్నది. దేశంలోని అన్నిరాష్ట్రాల్లో పంటల ఉత్పాదకత ఒకేవిధంగా ఉండదు. వర్షపాతం, నేల రకాలు, నేల ఉత్పాదకతల్లో తేడాల వల్ల పంటల ఉత్పాదకతలో హెచ్చుతగ్గులున్నాయి. ఛత్తీస్‌గఢ్, బీహార్ రాష్ట్రాల్లో పంట ఉత్పత్తి ఖర్చులు తక్కువ. కాబట్టి ప్రభుత్వం ప్రకటించే ధరలు ఆయా రాష్ట్రాల రైతులకు లాభమే. అదే తెలంగాణ, ఆంధ్ర, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో సాగు ఖర్చులు ఎక్కువ. కాబట్టి కేంద్రం నిర్ణయించిన ధరలు ఏ మాత్రం ఆసరా కావు. దేశంలో వరి, గోధుమల్లో అత్యధిక ఉత్పాదకత సాధిస్తున్న పంజాబ్‌లో సాగు లాభాన్నిచ్చేదిగా లేదని గణాంకాలు చెబుతున్నాయి. 1970లో వరి మద్దతు ధర క్వింటాలుకు రూ.51 ఉంటే, 2016లో రూ.1470. అంటే 29 రెట్లు పెరిగింది. అదే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెరిగితే వంద రెట్లు పెరిగి ఉంటే నేటికి క్వింటాలుకు రూ.5,100 ఉండాలి. కానీ అలాంటి నిర్ణయాలు జరుగకపోవడం దురదృష్టకరం.

కనీస మద్దతు ధరలు ఎంతమంది రైతులకు అందుతున్నాయన్నది పెద్ద ప్రశ్న. అధిక మద్దతు ధరలు అందుబాటులో ఉంటే రైతులు ఎక్కువ మొత్తంలో సాగు విస్తీర్ణం పెంచాలి. కానీ క్షేత్రస్థాయిలో అలా జరుగటం లేదు. అందుకు ప్రధాన కారణాలు- 25 శాతం కంటే తక్కువమంది రైతులకే మద్దతు ధరలపై అవగాహన ఉన్నది. కొన్ని పంటల్లో అయితే ఐదు శాతం మంది రైతులకు కూడా అవగాహన లేదు. గత సంవత్సరాలతో పోలిస్తే మద్దతు ధరలలో పెంపు శాతం తగ్గుతున్నది. 2012 వరకు సరాసరిన 40 శాతం పెంపు ఉంటే, గత మూడేండ్లలో 10 శాతం మేర కు పడిపోయింది. ఆహారపదార్థాల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న కారణం చూపించి ప్రభుత్వాలు మద్దతు ధరల భారీ పెంపునకు మోకాలడ్డుతున్నాయి. అలాగే తక్కువగా ఉన్న ధరలలో సరైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల 10 నుంచి 30 శాతం రైతులకు మాత్ర మే ఆదాయాలు లభిస్తున్నాయని నీతి ఆయోగ్ నివేదిక తెలుపుతున్నది. మద్దతు ధరలు నిర్ణయించడంలో సీఏసీపీ (వ్యవసాయ ఖర్చులు, ధరల నిర్ణాయక కమిషన్) దాదాపు 12 అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఉత్పత్తి ధరలు, ఉత్పత్తి కారకాల ధరల్లో వ్యత్యాసం, మార్కెట్ ధరలు, సరఫరా డిమాండ్, పంటల ధరల్లో తేడా, పారిశ్రామిక ఖర్చు లు, సాధారణ ధరలపై ప్రస్తుత స్థాయిలతో పాటు అంతర్జాతీయ ధరల పరిస్థితి, సబ్సిడీలు, రైతుకు సాగులో అయ్యే ఖర్చులు, ఆదాయాలను బట్టి మద్దతు ధరల నిర్ణయం ఉంటుంది. అయితే ఇన్ని ప్రమాణాలు ఉన్నప్పటికీ రైతుకు లాభం చేర్చడంలో మద్దతు ధరలు విఫలమవుతున్నాయి. ప్రభుత్వం 23 పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తే వాటి ఆధారిత సేకరణ గోధుమ, వరి, పత్తికి మాత్రమే ఉన్నదని 2016 ఆర్థిక సర్వే చెబుతున్నది. ఫలితంగా రైతులు వీటి సాగుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దేశంలో దాదాపు 70కి పైగా పంటలు సాగయితే అందులో 23 (33 శాతం) పంటలకే మద్దతు ధరలున్నాయి. అందువల్లే 85 శాతం సాగు విస్తీర్ణం వీటి పరిధిలో ఉన్నాయి. అందులో మూడు పంటలకే ప్రభుత్వ సేకరణ వ్యవస్థ బలంగా ఉన్నది. దీంతో ఇతర పంటల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెరుగటం లేదు. కాబట్టి కేవలం ఆహారధాన్యాల ఆధారిత సేకరణ నుంచి అపరాలు, నూనె గింజల సేకరణకు మరలడం, ఆన్‌లైన్ సేకరణ, వికేంద్రీకరణ సేకరణలతో ముందుకుసాగితే అన్ని పం టల మద్దతు ధరలు రైతులకు చేరవేయవచ్చు. అన్ని పంటల్లో సరఫరా-డిమాండ్‌ల మధ్య వ్యత్యాసాలను సవరించటం, తద్వారా ద్రవోల్బణం అదుపు సులభమవుతుంది.

మద్దతు ధరలు రైతులకు చేరాలంటే ప్రభుత్వం మొదట విఫణిలో వాస్తవ ధరలకు అనుగుణంగా కనీస మద్దతు ధరలు నిర్ణయించాలి. ముఖ్యంగా అపరాలలో ఈ పద్ధతి అవలంబిస్తే సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతుంది. పంటల సాగుకు అయ్యే వాస్తవిక ఖర్చులు పోను 50 శాతం లాభం ఉండేలా మద్దతు ధరలు నిర్ణయించాలి. ఒక్కో రాష్ట్రంలో పంటల వాస్తవిక సాగు ఖర్చులు వేరుగా ఉండటం, దేశంలోని అన్ని రాష్ట్రాలు సరాసరిని ఆధారంగా కేంద్రం మద్దతు ధరలు నిర్ణయించడంతో చాలా రాష్ట్రాలలో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. కాబట్టి కేంద్రం ధరలకు, రాష్ట్రం ప్రతిపాదించే ధరలకు మధ్య వ్యత్యాసాన్ని రాష్ట్రాలు బోనస్ రూపంలో ఇవ్వాలి. ఆన్‌లైన్ ధరలు చెల్లించడం ద్వారా మద్దతు ధరలు రైతులకు అందించడంలో విజయం సాధ్యమవుతుంది. కమతం, విస్తీర్ణం, బ్యాంకు ఖాతా, పంటల దిగుబడి సమాచారం ముందుగానే పొందుపరుచడం ద్వారా రైతులు ఏ రోజు, ఏ సమయంలో విఫణికి రావాలన్న సమాచారాన్ని ఎస్‌ఎంఎస్ ద్వారా అందుతుంది. తద్వారా మార్కెట్‌లో నిర్ణయించిన తేదీల్లో ఉత్పత్తులు మార్కెట్లలో కొంటాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఇది విజయవంతంగా అమలవుతున్నది. ఉత్పత్తి ఖర్చుల నియంత్రణలో రైతు కృషి, మేలైన మద్దతుధరలు కల్పించడంలో ప్రభుత్వ చొరవతోనే దేశంలో సాగు కష్టాలు తీరుతాయి. ఇందుకు అవసరమైతే రాజ్యాంగ సవరణ చేసి అయినా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ రాష్ట్రంలో పండే పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణయించుకునే అధికారాన్ని కల్పించాలి. అప్పుడే కేంద్రం చెబుతున్న రైతుల ఆదాయాల రెట్టింపు సాధ్యమవుతుంది.

ఉత్పత్తి ఖర్చుల నియంత్రణలో రైతు కృషి, మేలైన మద్దతుధరలు కల్పించడం లో ప్రభుత్వ చొరవతోనే దేశంలో సాగు కష్టాలు తీరుతాయి. ఇందుకు అవసరమైతే రాజ్యాంగ సవరణ చేసి అయినా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ రాష్ట్రంలో పండే పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణయించుకునే అధికారాన్ని కల్పించాలి. అప్పుడే కేంద్రం చెబుతున్న రైతుల ఆదాయాల రెట్టింపు సాధ్యమవుతుంది.

(వ్యాసకర్త: శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

పరిశోధనారంగాన్ని పటిష్ట పర్చాలె

విశ్లేషణ



కనకదుర్గ దంటు

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ ప్రోగ్రాంకు ఉమ్మడి పరీక్ష నిర్వహించాలని నిర్ణయించడం మంచిదే. అయితే ఈ విధానాన్ని అమలుపర్చే ముందు కొన్ని పనులు చేయాలి. విశ్వవిద్యాలయాల్లో ఒకే సమయంలో నిర్ణీత విధానంలో పీహెచ్‌డీ ప్రోగ్రాం మొదలవటానికి ఈ విధానం చాలా ఉపయోగపడుతుంది, కాబట్టి దీన్ని చాలా పటిష్టంగా అమలుపర్చాలి. దానికి కింది అంశాలు ఉపయోగపడుతాయి.

1.ప్రతి అకడమిక్ సంవత్సరంలో ఒకే నెలలో నోటిఫికేషన్ విడుదల, పరిశోధనా పర్యవేక్షకుల కేటాయింపు, అడ్మిషన్లు నిర్ణీత సమయంలో జరుగాలి. 2.పరీక్ష నిర్ణయించే ముందే, ప్రతి విశ్వవిద్యాలయంలో, ప్రతి ఫ్యాకల్టీ మెంబర్, ముఖ్యంగా పరిశోధనా పర్యవేక్షకుల (రీసెర్చ్ సూపర్‌వైజర్లు)లో పొందుపరుచాలి. ఎందుకంటే చాలామంది అభ్యర్థులకు విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యుల వివరాలు తెలియవు. 3.ప్రవేశపరీక్ష సిలబస్, మోడల్ ప్రశ్నాపత్రం వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఇవన్నీ విద్యామండలికి సాధ్యపడకపోతే టీఎస్పీఎస్సీకి పరీక్ష నిర్వహణ అప్పజెప్పాలి. కేవలం సిలబస్ ప్రశ్నాపత్రం తయారు నిపుణుల సహాయంతో మండలి రూపొందించాలి. 4.ఇంకొక పెద్ద అంశం ప్రశ్నాపత్రం ఎలా ఉంచాలనేది. ఒక విశ్వవిద్యాలయ ప్రతిష్ట ఇనుమడించటానికి పరిశోధన ఎంత పటిష్టంగా జరుగుతున్నదన్న అంశం చాలా ముఖ్యం. కనుక ఈ పరీక్ష ద్వారా సరైన అభ్యర్థులను ఎంచుకోవాలి.

5.పరిశోధనకు కావలసినవి ఓర్పు, నేర్పు. ఈ రెండు పదాల్లో చాలా అంశాలు ఇమిడి ఉన్నాయి. ఈ రెండింటికంటే ముఖ్యం పరిశోధన ఎందుకు చేయాలన్న ప్రశ్న. బోధనారంగంలో ఉన్నవారు, ముఖ్యంగా ఉన్నత విద్యారంగంలో ఉన్నవారు ప్రతిభావంతులైతేనే భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం చేయటమే కాకుండా తమ తర్వాతి తరాల ఉపాధ్యాయులను తీర్చిదిద్దాలి. అందుకే బోధనారంగంలో ఉన్నవారు ప్రపంచంలో వస్తున్న మార్పులు, జరుగుతున్న అభివృద్ధి, ముఖ్యంగా వారి రంగంలో గమనిస్తూ దాని ప్రకారమే శిష్యులను తీర్చిదిద్దాలి. ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. గ్లోబలైజేషన్ జరిగి ఇంగ్లిష్‌ను గ్లోబల్ భాషగా అన్ని దేశాలూ ఉపయోగిస్తున్న ఈ సమయంలో కూడా భారతదేశంలోని విశ్వవిద్యాలయాలన్నింటిలో ఇంగ్లిష్ సాహిత్యం మీద జరుగుతున్న పరిశోధన, ఇంగ్లిష్ భాషా నైపుణ్యాల మీద కానీ, మన దేశానికి ఎటువంటి భాష ఎలా బోధించాలన్న అంశాల మీద జరుగుతున్న పరిశోధన కంటే వేల రెట్లు ఎక్కువగా ఉన్నది. ప్రస్తుత కాలంలో ఇంగ్లిష్ సాహిత్యం ఎవరికీ సామాన్యంగా అవసరం లేదు. ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలే చాలా ముఖ్యం. మరి ఈ రంగంలో పరిశోధన ఒక శాతం కూడా జరుగటంలేదు. దీనికి కారణం 21వ శతాబ్దం ప్రవేశించి సుమారు రెండు దశాబ్దాలు గడుస్తున్నా, మన ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు ఈ మారుతున్న అవసరాలు గమనించకపోవటమే! ఇప్పుడు అత్యవసరంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో ఎం.ఏ. ఇంగ్లిష్ భాషా బోధన (ఇఎల్‌టీ) కోర్సు ప్రవేశపెట్టి ఇంగ్లిష్ బోధకులను తయారుచేయవలసిన అవసరం ఉన్నది. డిగ్రీ (బీఏ) స్థాయిలోనూ, పీజీ (ఎం.ఏ) స్థాయిలోనూ ఇఎల్‌టీ ఒక అంశంగా (ఆప్షనల్) ప్రవేశపెట్టాలి. లేకపోతే విశ్వవిద్యాలయాల్లో పరిశోధనాస్థాయి పెరుగదు. బోధకుల స్థాయి కూడా మారదు.

6.ఇక పరిశోధన అనేది ఉత్సాహంతో చేయాలి గానీ తప్పనిసరి అనుకొని కాదు. కనీసం రెండేండ్ల ఓర్పుతో లిటరేచర్ (ఆయా అంశాల్లో ముందు జరిగిన పరిశోధన గురించి) చదువాలి. సైన్స్ సబ్జెక్టయితే ప్రాక్టికల్స్ కూడా తాము ఎంచుకున్న అంశంలో చేయాలి. అందరూ ఫీల్డు వర్క్ చేయాలి. తమ అంశం కాలానికి సమాజానికి ఎలా పనికి వస్తుందో తమ గ్రంథం ద్వారా నిరూపించాలి.

7.ఇక నేర్పు అనే పదంలో చాలా అంశాలు ఇమిడి ఉంటాయి. పరిశోధనకు కావలసినది క్రిటికల్ థింకింగ్. దీని సహాయంతో క్రిటికల్ రీడింగ్, క్రిటికల్ రైటింగ్‌లు అలవర్చుకోవాలి. దానికి కావలసిన లక్షణాలు అవగాహన, విశ్లేషణాశక్తి, చదివినదాన్ని తన అంశానికి సంబంధించేటట్టు మార్చుకోవటం. అందుకే విద్యావేత్తలు ప్రాథమికదశ నుంచి ఎనలిటికల్, క్రిటికల్, క్రియేటివ్ నైపుణ్యాలు పెరిగేటట్టు పిల్లలను తీర్చిదిద్దాలని నిర్దేశిస్తారు. దురదృష్టవశాత్తూ గత రెండు, మూడు దశాబ్దాల నుంచి విద్యారంగంలో జ్ఞాపకశక్తిని పెంచి పరీక్షించేటట్టు బోధన సాగుతున్నది కానీ, ఆ రంగ నిపుణులు మనిషి పెరిగే పై అంశాల మీద శ్రద్ధవహించటం లేదు. ఈ రోజుల్లో ఇంత సాంకేతికత పెరిగాక నిజానికి జ్ఞాపకశక్తికి విలువ లేకుండా పోయింది. కంప్యూటర్ నొక్కితే కావలసిన సమాచారం కనిపిస్తుంది. ఇక మానవ మేధను దానిమీద వ్యర్థపరుచడమెందుకు? నిజానికి జపాన్ వంటి దేశాల్లో జరుగుతున్న అభివృద్ధితో మానవులు రోబోలు చేయలేని పనులు చేస్తేనే వారికి ఉపాధి, ఉద్యోగాలుంటాయి. రోబోకు లేనిది, మనిషికి ఉన్నది స్వయంగా ఆలోచించగలిగిన శక్తే!

ఇక పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి నిర్వహించబోయే ఉమ్మడి పరీక్ష ఈ కింది పద్ధతిలో ఉండాలి.

1.యూజీసీ నెట్ లాగా ఉండాలనుకుంటే రీసెర్చ్ మెథడాలజీ మీద పేపర్ ఆబ్జెక్టివ్ ప్రశ్నలు కలిగి ఉండచ్చు. 2.పరిశోధనాంశానికి సంబంధించిన పేపర్లో మాత్రం ఆబ్జెక్టివ్ ప్రశ్నలు కాకుండా వ్యాసం రాసేటట్టు ఉండాలి. అది కూడా కేవలం ఫాక్ట్స్ రాయకుండా, విశ్లేషణ, అవగాహన, రచనాపటిమ, అంశం గురించి వివరంగా రాయగలిగిన సామర్థ్యం పరీక్షించేటట్టు ఉండాలి. ఈ లక్షణాలు పరిశోధన ప్రారంభించే ముందు అభ్యర్థుల్లో ఉంటే, వారికి తమ పరిశోధనా గ్రంథరచన సులువు అవుతుంది. పర్యవేక్షకులకు కూడా వారిని గైడ్ చేయడం తేలికవుతుంది. ఆ పరిశోధన కూడా గుణాత్మకంగా ఉంటుంది. 3.వివిధ భాషల్లో సాహిత్యం మీద పరిశోధన చేసేవారికి వారివారి భాషల్లో నైపుణ్యాలు ఉన్నాయా అని పరీక్షించాలి. పీజీ స్థాయిదాకా నిర్ణీత సిలబస్‌లో మాత్రమే పరీక్షించటం జరుగుతుంది. అయితే పరిశోధనాస్థాయిలో భావనాశక్తి, తులనాత్మకశక్తి, విశ్లేషణా శక్తి, రచనాసామర్థ్యం ఉపయోగించి ఇంతవరకు ఎవరూ చెప్పని విషయాలను చెప్పాలి. వారి రంగానికి తమ సొంత కాంట్రిబ్యూషన్ చేస్తే నే ఆ పరిశోధనకు విలువ ఉంటుంది.

4.మూడేండ్లలో, అయిదేండ్లలో జరిగే పరిశోధనాక్రమం మీద కూడా విశ్వవిద్యాలయ నియంత్రణ ఉండాలి. నిర్ణీత సమయంలో ప్రీ పీహెచ్‌డీ పరీక్ష (ప్రోగ్రాం మొదలైన ఒక సంవత్సరాంతంలో) నిర్వహించి స్కాలర్స్ తమ పరిశోధన గ్రంథం మీద పని మొదలుపెట్టే వెసులుబాటు కల్పించాలి. ఆ నాలుగేండ్లు కూడా కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఉన్నట్టు ప్రతి ఆరు నెలలకు తమ పరిశోధనా ప్రగతిని రీసెర్చ్ కమిటీ ముందు అభ్యర్థులు ప్రజెంట్ చేయటం తప్పనిసరి చేయాలి. చివరి సంవత్సరంలో ఇప్పుడు కొన్ని విశ్వవిద్యాలయాల్లో పాటించినట్టు, వారి పరిశోధన మీద రెండు సెమినార్స్ అభ్యర్థులు ఇవ్వాలి. ఇది తప్పనిసరి చేస్తేనే పరిశోధన నిర్ణీత సమయంలో పూర్తవుతుంది.

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి విశ్వవిద్యాలయాల్లోని పరిశోధనారంగాన్ని ఇటువంటి విధానాలతో పటిష్టపరిస్తేనే ఆ రంగ స్థాయి పెరుగుతుంది. ఇంకొక ముఖ్యమైన అంశం. పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించి రిపోర్టు ఇచ్చే ఆచార్యుల పేర్లు ప్రస్తుతం అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ఆ విద్యార్థి రీసెర్చ్ గైడ్ ఇవ్వటం జరుగుతున్నది. ఈ పద్ధతి మారాలి. విశ్వవిద్యాలయాలే తమకు ఒక డేటాబేస్ తయారుచేసుకొని అందులోంచి ముగ్గురికి పరిశోధనా గ్రంథాన్ని పంపే విధానం మంచిది. అటు రీసెర్చ్ గైడ్‌కు, ఇటు విద్యార్థికి తెలియకుండా వారి పేర్లు కాన్ఫిడెన్షియల్‌గా ఉంచితేనే ఆ పరిశోధన అసలు విలువ తెలుస్తుంది. ఇది చాలా ముఖ్యం. ఈ విధంగా ఉన్నత విద్యామండలి తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా రంగాన్ని పటిష్ఠపరుస్తుందని ఆశిద్దాం!

పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించి రిపోర్టు ఇచ్చే ఆచార్యుల పేర్లు ప్రస్తుతం అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ఆ విద్యార్థి రీసెర్చ్ గైడ్ ఇవ్వటం జరుగుతున్నది. ఈ పద్ధతి మారాలి. విశ్వవిద్యాలయాలే తమకు ఒక డేటాబేస్ తయారుచేసుకొని అందులోంచి ముగ్గురికి పరిశోధనా గ్రంథాన్ని పంపే విధానం మంచిది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కోర్టు బయట పరిష్కరించుకోకుంటే అంతర్యుద్ధమే

■ అయోధ్య వివాదంపై శ్రీశ్రీ రవిశంకర్ ఆందోళన


ఇత్తెహాద్ ఎ మిల్లత్ నాయకుడు తౌకీర్ రజాతో రవిశంకర్

బెంగళూరు, మార్చి 6: అయోధ్యలో రామజన్మభూమి వివాదానికి కోర్టు బయట పరిష్కారమే మేలని.. ఈ వివాదంపై కోర్టు ద్వారా ముందుకెళ్తే తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని, దేశంలో అంతర్యుద్ధం చెలరేగే ప్రమాదం ఉందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవి శంకర్ హెచ్చరించారు. కోర్టు బయట పరిష్కరించుకునే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఇరుపక్షాలను కోరారు. ఈ మేరకు ఆయన అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్బీ) సభ్యులకు మంగళవారం ఒక బహిరంగ లేఖ రాశారు. అయోధ్య వివాదానికి కోర్టు ద్వారా గానీ, చట్టం ద్వారా గానీ ముగింపునిస్తే.. భారీస్థాయిలో మతఘర్షణలు జరిగి, అంతర్యుద్ధం చెలరేగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు బయట పరిష్కారమే ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. అయోధ్య వివాదంపై నాలుగు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయన్నారు. ముస్లింలకు గానీ, హిందువులకు గానీ కోర్టు వివాదాస్పద భూమిని పూర్తిగా కేటాయించడం, అలహాబాద్ హైకోర్టు తీర్పును ప్రవేశపెడుతూ మసీదు నిర్మాణం కోసం ముస్లింలకు ఎకరం, మిగతా 60 ఎకరాలు దేవాలయ నిర్మాణానికి కేటాయించటం, పార్లమెంట్ చట్టం ద్వారా దేవాలయ నిర్మాణాన్ని చేపట్టటం – కోర్టు ద్వారా లేదా చట్టం ద్వారా ఈ నాలుగు ప్రత్యామ్నాయాల్లో దేనిని అనుసరించినా దేశంలో విపత్కర పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కోర్టు బయట చర్చలతోనే ఈ వివాదాన్ని సానుకూలంగా పరిష్కరించుకోవటం సాధ్యపడుతుందని రవిశంకర్ సూచించారు.

పాతతరం బాలీవుడ్ నటి షమ్మీ ఆంటీ కన్నుమూత

- అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన నర్గిస్ రబాడీ
- 200కు పైగా సినిమాలు, పలు ప్రముఖ సీరియళ్లలో నటన



ముంబై, మార్చి 6: పాతతరం బాలీవుడ్ నటి, షమ్మీ ఆంటీగా పేరున్న నర్గిస్ రబాడీ (89) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ముంబై జుహూ సర్కిల్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. షమ్మీ ఆంటీ 200కు పైగా చిత్రాల్లో, పలు ప్రముఖ టెలివిజన్ సీరియళ్లలోనూ నటించారు. నటనలో తన హాస్యంతో ప్రేక్షకుల మదిలో చెరగని ముద్రవేశారు. పార్సీ కుటుంబానికి చెందిన ఆమె.. కూలీ నంబర్-1, ఉస్తాద్ పెడ్రో, భాయి-బహెన్, దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయి, హాఫ్ టికెట్, జబ్ జబ్ ఫూల్ ఖిలే, ఇత్తెఫాక్, ద బర్నింగ్ ట్రైన్, కుద్రత్, ఆవారా బాప్, స్వర్గ్ వంటి ప్రముఖ చిత్రాల్లో తన నటనతో ఆకట్టుకున్నారు. ఇదే సమయంలో దేఖ్ భాయి దేఖ్, జబాన్ సంభాల్ కే, శ్రీమాన్ శ్రీమతి, కభీ యే కభీ వో, ఫిల్మీ చక్కర్ వంటి పేరుపొందిన టీవీ సీరియళ్లలోనూ నటించారు. చాలా చిత్రాలు, సీరియళ్లలో ఆమె ఆంటీ, పెద్దమ్మ, అమ్మమ్మ, నాన్నమ్మ పాత్రలను పోషించారు. సినీ నిర్మాత, దర్శకుడు సుల్తాన్ అహ్మద్‌ను వివాహమాడిన షమ్మీ.. ఏడేండ్ల కిందట విడాకులు తీసుకున్నారు. ఆమె మృతిపై సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం తెలిపారు. బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ ఆమె మృతికి సంతాపం ప్రకటించారు. 'ఎన్నో చిత్రాల్లో నటించిన షమ్మీ ఆంటీ చిత్ర పరిశ్రమకు ఎంతోకాలం సహకారం అందించారు. పెద్ద వయసుతోపాటు దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మన ఫ్యామిలీ ఫ్రెండ్ కన్నుమూశారు. నెమ్మది నెమ్మదిగా వారంతా దూరమైపోతుండటం బాధాకరం' అంటూ అమితాబ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

సిరియాలో కూలిన రష్యా విమానం

■ 32 మంది మృతి ■ సాంకేతిక కారణాల వల్లే ప్రమాదం?


రష్యా రవాణా విమానం ఆంటోనోవ్-26(ఫైల్)

మాస్కో, మార్చి 6: రష్యాకు చెందిన రవాణా విమానం ఆంటోనోవ్-26 మంగళవారం కూలిపోయింది. విమానంలో ఉన్న 32 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన సిరియాలోని రష్యా వైమానిక స్థావరం 'హిమిమ్'లో జరిగింది. మృతుల్లో 26 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. సాంకేతిక కారణాల వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికార వర్గాలు తెలిపాయి. విమానం దిగుతున్న సమయంలో రన్‌వేకు 500 మీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నాయి. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టనున్నట్టు వివరించాయి. అంతర్యుద్ధం కొనసాగుతున్న సిరియాలో ప్రభుత్వానికి అనుకూలంగా రష్యా తిరుగుబాటుదారులపై 2015 నుంచి వైమానిక దాడులు చేపడుతున్నది. అయితే గతేడాది అక్టోబర్‌లో హిమిమ్ వైమానిక స్థావరం నుంచి రష్యాకు చెందిన సైనిక విమానం పైకి ఎగురుతుండగా కుప్పకూలి ఇద్దరు సిబ్బంది మరణించారు. గత నెలలో సిరియాలో రష్యా విమానం కూలి ఓ పైలట్ మృతిచెందారు. 2016లో రష్యా మిలటరీకి చెందిన సాంకేతికకారులున్న విమానంలో సిరియాకు తీసుకెళ్తుండగా నల్లసముద్రంలో కుప్పకూలడంతో 92 మంది మరణించారు. ఇలా తరుచుగా విమానాలు కూలిపోతుండటంతో రష్యా సైనికులు ఎక్కువ సంఖ్యలో మరణిస్తున్నారు.

త్రిపురలో కాషాయ హింసాకాండ



- సీపీఎం కార్యాలయాలు, నేతల ఇండ్లపై దాడులు.. గృహ దహనాలు
- కాషాయ చొక్కాలు ధరించిన ఆగంతకుల స్వైర విహారం
- విగ్రహాల కూల్చివేతకు ఇద్దరు కేంద్ర మంత్రుల మద్దతు
- గవర్నర్‌తో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ ఫోన్‌లో సంప్రదింపులు



లెనిన్, మార్క్స్ విగ్రహాల కూల్చివేత


బెలోనియా కాలేజీ స్క్వేర్ వద్ద లెనిన్ విగ్రహాన్ని బుల్డోజర్‌తో కూల్చివేస్తున్న బీజేపీ కార్యకర్తలు

అగర్తల/ న్యూఢిల్లీ/ కోల్‌కతా/ చెన్నై, మార్చి 6: త్రిపురలో లెఫ్ట్ ఫ్రంట్ ఓడిపోయిన 48 గంటల్లోపే వారి రాజకీయ ప్రత్యర్థులు చెలరేగిపోయారు. భారీగా హింసాకాండకు దిగి కారల్ మార్క్స్, లెనిన్ విగ్రహాలను కూల్చివేశారు. సీపీఎం కార్యాలయాలపై, ఆ పార్టీ కార్యకర్తల ఇండ్లపై దాడులు, దహనాలకు పాల్పడ్డారు. ఈ హింసలో ఇద్దరు మృతి చెందినట్టు తెలిసింది. బెలోనియా జిల్లా కేంద్రంలోని పబ్లిక్ స్క్వేర్‌లో ఉన్న ఐదడుగుల లెనిన్ విగ్రహాన్ని బుల్డోజర్‌తో సోమవారం కూల్చేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కాషాయ చొక్కాలు ధరించిన బీజేపీ కార్యకర్తలు 'భారత్ మాతా కీ జై' అని నినాదాలు చేస్తూ విగ్రహం కూల్చివేతలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నుంచి తమ పార్టీ కార్యాలయాలు, అనుబంధ సంఘాల కార్యాలయాలు, ప్రముఖ నేతల ఇండ్లపై బీజేపీ – ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్టీ) మద్దతు దారులు దాడులు చేసి భయోత్పాతం సృష్టించారని సీపీఎం ఆరోపించింది. కార్యాలయాలు, ఇండ్లలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారని సీపీఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి హరిపాద దాస్ ఆరోపించారు. ఇండ్లు, కార్యాలయాలకు నిప్పంటించారన్నారు. దీంతో పలు చోట్ల మంటలను ఆర్పివేసేందుకు అగ్నిమాపక దళాలు రంగంలోకి దిగాయి. రాష్ట్రంలోని సున్నిత ప్రదేశాల్లో నిషేధాజ్ఞలు విధించారు. ఈ నేపథ్యంలో త్రిపుర గవర్నర్ తథాగథ రాయ్‌తో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్‌లో మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, లెనిన్ విగ్రహం కూల్చివేతకు నిరసనగా దేశవ్యాప్త ప్రదర్శనలు జరుపాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. త్రిపురలో జరుగుతున్న రాజకీయ హింసకు బీజేపీ కారణమని ఆరోపించారు. మరోవైపు త్రిపురలో తమ పార్టీ కార్యకర్తలపై బీజేపీ దాడులను నివారించేందుకు జోక్యం చేసుకోవాలని ప్రధాని మోదీకి సీపీఎం ఎంపీ మహ్మద్ సలీం వినతిపత్రం సమర్పించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఐపీఎఫ్టీలతో కూడిన కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.


త్రిపురలోని మోహన్‌పూర్‌లో దగ్ధమవుతున్న సీపీఎం కార్యకర్త ఇల్లు

చలో పల్టాయి : రాం మాధవ్

విగ్రహాల కూల్చివేతపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ 'ప్రజలు లెనిన్ విగ్రహాన్ని తొలిగిస్తున్నారు.. ఇది రష్యాలో కాదు, త్రిపురలో. చలో పల్టాయి' అని ట్వీట్ చేశారు. తరువాత దానిని తొలిగించారు. తిపుర సీఎంగా ఎన్నికైన బిప్లబ్ దేవ్.. సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. ఎటువంటి హింసను సహించే ప్రసక్తి లేదని అన్నారు.

మమతాబెనర్జీ ఖండన

త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చివేతను పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ ఖండించారు. ఇటువంటి హింసాత్మక చర్యలను సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. 'సీపీఎం మాకు ప్రత్యర్థి కావచ్చు. లెనిన్ మా నేత కాదు. అంతమాత్రాన మార్క్స్, లెనిన్ విగ్రహాల కూల్చివేతను అనుమతిస్తాననుకోవద్దు' అని ఆమె హెచ్చరించారు.

లెఫ్ట్ బాధితుల పనేమో: కేంద్రమంత్రి



లెఫ్ట్ పార్టీల వల్ల అణచివేతకు గురైన వారే ప్రతీకారంగా ఈ చర్యకు పాల్పడి ఉంటారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ అనుమానం వ్యక్తం చేశారు. లెనిన్ విగ్రహం కూల్చివేతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వారంతా అయోధ్య, మథుర, వారణాసి (కాశీ)లతోపాటు పలు ప్రాంతాల్లో వేల దేవాలయాలను కూల్చివేస్తున్నా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ మాట్లాడుతూ భారత్‌లో విదేశీ నేతల విగ్రహాలకు చోటు లేదన్నారు. భారత్‌లో సిద్ధాంతకర్తలకు కొదవలేదన్నారు.

వెల్లూరులో పెరియార్ విగ్రహం ధ్వంసం

త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసినట్లే తమిళనాడులో కులవాది అయిన పెరియార్ విగ్రహాన్ని కూల్చివేస్తామని ఆ రాష్ట్ర బీజేపీ నాయకుడు హెచ్ రాజా పేర్కొన్న కొద్ది గంటల్లో బీజేపీ కార్యకర్తలు కార్యాచరణకు దిగారు. వెల్లూరులోని మున్సిపల్ కార్యాలయంలో గల పెరియార్ విగ్రహాన్ని రాత్రి 9 గంటల సమయంలో వారు ధ్వంసం చేశారు. 'లెనిన్‌కు భారత్‌తో ఏం సంబంధం? కమ్యూనిజానికి, భారత్‌కు సంబంధం ఏమిటి?' అని రాజా తన ఫేస్‌బుక్ ఖాతాలో ప్రశ్నించారు. త్రిపురలో లెనిన్ విగ్రహానికి పట్టిన గతే పెరియార్ విగ్రహాలకు పడుతుందని పేర్కొన్నారు. దీనిపై పెద్ద ఎత్తున నిరసన వెల్లువెత్తడంతో తర్వాత ఫేస్‌బుక్ పోస్ట్‌ను తొలిగించారు.


వంతెనపైనుంచి కిందపడిన లారీ

గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

■ వంతెనపై నుంచి కింద పడిన లారీ
■ 30 మంది మృతి.. పలువురి పరిస్థితి విషమం

భావనగర్: గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందంతో వెళ్తున్న లారీ వంతెనపై నుంచి కింద పడటంతో 30 మంది మరణించారు. పలువురు గాయపడిన ఘటన మంగళవారం ఉదయం భావ్‌నగర్ జిల్లా రంగోలా సమీపంలో చోటుచేసుకున్నది. ముందు వాహనాన్ని లారీ డ్రైవర్ ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉన్నదని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. మృతుల్లో నలుగురు చిన్నారులు, ఎనిమిది మంది మహిళలు ఉన్నారన్నారు. భావ్‌నగర్ ఇంచార్జి ఎస్పీ సయ్యద్ మాట్లాడుతూ బోటాద్ జిల్లాలోని తోటమ్ గ్రామంలో జరిగే పెండ్లికి హాజరయ్యేందుకు అనిదా గ్రామం నుంచి దాదాపు 60 మంది లారీలో బయలుదేరారని, ఇంతలోనే ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ఘటనా స్థలంలో 26 మంది మృతి చెందారని, దవాఖానలో చికిత్సపొందుతూ నలుగురు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. లారీ బోల్తా పడటంతో మృతుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్నామని, క్షతగాత్రులను దవాఖానకు తరలించామన్నారు. రోడ్డు ప్రమాదంలో 30 మంది మృతిచెందడంపై ప్రధాని మోదీ తీవ్ర సంతాపం తెలిపారు. గుజరాత్ సీఎం విజయ్ రూపానీ మృతుల కుటుంబాలకు రూ.4లక్షలు చొప్పున నష్టపరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రమాద ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

శ్రీలంకలో ఎమర్జెన్సీ

- క్యాండీలో బౌద్ధులు, ముస్లింల మధ్య మతఘర్షణలు
- ఇద్దరి మృతి.. భారీ స్థాయిలో ఆస్తి నష్టం
- ఘర్షణల నివారణకు పదిరోజులపాటు అత్యవసర పరిస్థితి

కొలంబో: శ్రీలంకలో మత ఘర్షణలు చోటుచేసుకోవడంతో పది రోజుల పాటు ఎమర్జెన్సీ ప్రకటించారు. క్యాండీ జిల్లాలో సింహళీయులు, ముస్లిం మైనారిటీల మధ్య చెలరేగిన అల్లర్లలో ఇద్దరు మృతి చెందగా భారీ స్థాయిలో ఆస్తులు ధ్వంసమయ్యాయి. గత వారం జరిగిన ఓ సింహళీయుని హత్యతో జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సైన్యాన్ని, పోలీసు బలగాలను అక్కడికి పంపింది. అల్లర్లు ఇతర చోట్లకు విస్తరించకుండా నివారించేందుకు దేశంలో అత్యవసర పరిస్థితిని విధించాలని అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన అధ్యక్షతన మంగళవారం సమావేశమైన మంత్రివర్గం నిర్ణయించింది. సింహళీయ బౌద్ధులు మైనారిటీలకు చెందిన 10 మసీదులు, 75 దుకాణాలు, 32 ఇండ్లు ధ్వంసం చేశారని ముస్లింలు ఆరోపించారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఓ భవనంలో పూర్తిగా కాలిపోయిన మరో వ్యక్తి మృతదేహం లభించిందని, దీంతో క్యాండీలో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా ఉన్నదని సామాజిక సాధికారత మంత్రి దిస్సనాయకె చెప్పారు. 2011 తరువాత శ్రీలంకలో ఎమర్జెన్సీ విధించడం ఇదే మొదటి సారి. మైనారిటీల పట్ల మెజారిటీ వర్గాల్లో నెలకొన్న అనుమానాలే ఈ అల్లర్లకు కారణమని తెలుస్తున్నది. ముగ్గురి మధ్య జరిగిన ప్రైవేట్ గొడవ రెండు మతాల వారి మధ్య అల్లర్లకు దారితీసింది. సైన్యాన్ని మోహరించడంతో అంపారా, డిగాలా, తెల్దెనియా జిల్లాల్లో పరిస్థితి సద్దుమణిగింది. క్యాండీ, కెగాల్లె జిల్లాల్లో మాత్రం పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగా ఉన్నది.


ముస్లింల దుకాణాలను దహనం చేసిన సింహళీయులు

సింహళీయుల్లో పెరుగుతున్న ముస్లిం వ్యతిరేకత

కొన్ని రోజులుగా శ్రీలంకలోని మధ్య, నైరుతి ప్రాంతంలో ముస్లిం వ్యతిరేక అల్లర్లు చెలరేగుతున్నాయి. ముస్లింల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఇందుకు సింహళీయ బౌద్ధులలో నెలకొన్న ముస్లిం వ్యతిరేకత ఒక కారణం కాగా, ప్రభుత్వం అల్లరిమూకలను అదుపు చేయలేకపోవడం మరో కారణం. బౌద్ధులను నపుంసకులుగా మార్చేందుకు ముస్లింలు తమ హోటళ్లలో ఒక రసాయనాన్ని వాడుతున్నారని గత వారం ఒక వదంతిని సృష్టించడంతో అంపారా జిల్లాలో ఆందోళనలు మొదలయ్యాయి. తమ జనాభా తగ్గిపోతుండగా, ముస్లింల జనాభా పెరిగిపోతున్నదన్న భావన సింహళీయులలో నెలకొంది. శ్రీలంకను ముస్లిం దేశంగా మార్చే కుట్ర జరుగుతున్నదన్న అనుమానం కూడా వారిలో మొదలైంది. శ్రీలంకలో సూఫి ఇస్లాం స్థానంలో ఇటీవల వహాబీ ఇస్లాం ప్రభావం పెరిగింది. మహిళలు తల నుండి పాదాల వరకు కప్పుకోవడం, పురుషులు గడ్డాలు పెంచడం, సౌదీ నుంచి వచ్చే డబ్బుతో మసీదులు ఆధునికతను సంతరించుకోవడం వంటి పరిణామాలు స్థానికులకు ముస్లింలకు మధ్య దూరం పెంచాయి. ఇదివరకు ముస్లిం వ్యాపారులు, కళాకారులు బౌద్ధుల ఉత్సవాలు, పండుగలలో ప్రత్యేక పాత్ర పోషించేవారు. వారి మధ్య సామరస్యం వెల్లివిరిసేది. కానీ వహాబీలవల్ల వారి మధ్య దూరం పెరుగడం మొదలైంది. అరబ్బు బాసుల వద్ద పనిచేసిన అనుభవం, వహాబీల ప్రభావం పెరుగడం, సౌదీ నుంచి డబ్బు ప్రవాహంలా రావడంతో సింహళీయులలో శ్రీలంక ముస్లింల పాలనలోకి వెళుతుందేమోనన్న ఆందోళన కలిగించినది. మైత్రిపాల ప్రభుత్వమూ మైనారిటీల పట్ల బుజ్జగింపు ధోరణిని అవలంబించడం వారి భయం రెట్టింపు చేసింది. ప్రభుత్వం ఆదిలోనే ముస్లింలకు వ్యతిరేకంగా మొదలైన వదంతులను అరికట్టి ఉంటే పరిస్థితి దిగజారేది కాదని పరిశీలకులంటున్నారు. అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించి, తక్షణమే చర్యలు తీసుకుంటే హింస చెలరేగేది కాదంటున్నారు. సోషల్ మీడియాలో వదంతులు నియంత్రించనందువల్లే అల్లర్లు విస్తరించాయంటున్నారు.

సీఎంగా కన్రాడ్ సంగ్మా ప్రమాణం

■ మేఘాలయలో 12 మందితో క్యాబినెట్ ఏర్పాటు


మేఘాలయ సీఎంగా ప్రమాణం చేస్తున్న కన్రాడ్

షిల్లాంగ్: మేఘాలయ 12వ సీఎంగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) అధినేత కన్రాడ్ సంగ్మా మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో సంగ్మాతో గవర్నర్ గంగాప్రసాద్ ప్రమాణం చేయించారు. సంగ్మాతోపాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, మణిపూర్ సీఎం ఎన్ బీరెన్ సింగ్ హాజరయ్యారు. ప్రమాణస్వీకారం తర్వాత సీఎం కన్రాడ్ సంగ్మా మీడియాతో మాట్లాడుతూ కొంతకాలంగా రాష్ట్రంలో గాడి తప్పిన పరిపాలనను సరిచేయడం చాలా ముఖ్యమన్నారు. సీఎంగా ప్రమాణం చేసిన కన్రాడ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. తన కొడుకు సీఎం కావాలన్న కలలు నిజమయ్యాయని కన్రాడ్ తల్లి సొరాదినీ కే సంగ్మా అన్నారు. తన కుమారుడిని ఈ స్థాయిలో చూడాలన్నది తన భర్త పీఏ సంగ్మా కల అని ఆమె చెప్పారు.

1990లలో రాజకీయజీవితం ప్రారంభం..

లోక్‌సభ మాజీ స్పీకర్ పూర్ణో ఏ సంగ్మా చిన్న కుమారుడు కన్రాడ్ సంగ్మా. న్యూఢిల్లీలోని సెయింట్ కొలంబస్ పాఠశాలలో చదువుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో బీబీఏ పూర్తి చేశారు. తండ్రి పీఏ సంగ్మాకు ప్రచార మేనేజర్‌గా 1990ల్లో కన్రాడ్ తన రాజకీయజీవితాన్ని ప్రారంభించారు. 2016లో తన తండ్రి మరణం తర్వాత ఎన్పీపీ పగ్గాలు చేపట్టారు. 2014లో మేఘాలయాలోని తురా నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.


9న త్రిపుర సీఎంగా బిప్లబ్ దేవ్ ప్రమాణం



అగర్తల, మార్చి 6: త్రిపుర నూతన సీఎంగా బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బిప్లబ్‌దేవ్ ఈ నెల తొమ్మిదో తేదీన ప్రమాణం చేస్తారు. నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గవర్నర్ ఆహ్వానించారని ఆయన చెప్పారు. తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరవుతారని చెప్పారు. అంతకుముందు బీజేపీఎల్పీ నేతగా బిప్లబ్‌దేవ్ ఎన్నికయ్యారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఎమ్మెల్యే జిష్ణు దేవ్‌వర్మ డిప్యూటీ సీఎంగా నియమితులవుతారని నితిన్ గడ్కరీ మీడియాకు తెలిపారు.

త్వరలో కొత్త రాజకీయ పార్టీ

■ కన్నడ నటుడు ఉపేంద్ర



బెంగళూరు: నాలుగు నెలల కిందట తాను స్థాపించిన ప్రజాకీయ రాజకీయ పార్టీ నుంచి వైదొలుగుతున్నానని కన్నడ నటుడు ఉపేంద్ర చెప్పారు. త్వరలో తాను కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీలో తనకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రను జీర్ణించుకోలేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. బీజేపీలో చేరేది లేదని స్పష్టం చేశారు. ఉపేంద్ర సన్నిహితులు మాట్లాడుతూ త్వరలో ఏర్పాటు చేయనున్న రాజకీయ పార్టీ పేరు 'ఓంకార' అని తెలిపారు.

కార్తీకి మరో మూడురోజుల కస్టడీ

■ సీబీఐ అభ్యర్థన మేరకు పొడిగించిన ఢిల్లీ హైకోర్టు
■ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు


సీబీఐ కోర్టు వద్ద కార్తీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి ఢిల్లీ హైకోర్టు మరో మూడు రోజుల సీబీఐ కస్టడీ విధించింది. ఐఎన్‌ఎక్స్ మీడియా ముడుపుల కేసులో ఐదురోజుల కస్టడీలో ఉన్న కార్తీని సీబీఐ అధికారులు మంగళవారం స్పెషల్ జడ్జి సునీల్ రాణా ముందు హాజరుపరిచారు. నాలుగు రోజుల విచారణలో కొత్త విషయాలు తెలిశాయని, కార్తీ నుంచి మరిన్ని నిజాలు రాబట్టడానికి కస్టడీ పొడిగించాలని సీబీఐ తరపు న్యాయవాది విన్నవించారు. కాగా, కార్తీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది. ఇదే అంశంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్న కార్తీ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

విధులు నిర్వర్తించని వారికి హక్కులు ఎందుకు?

■ అది రాజ్యాంగ విలువలకు విరుద్ధం: మోదీ

న్యూఢిల్లీ, మార్చి 6: ప్రజలు తమ విధులను నిర్వర్తించకుండా హక్కుల కోసం పోరాడటం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని ప్రధాని మోదీ తెలిపారు. ఈ విషయంలో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి కేంద్ర సమాచార కమిషన్(సీఈసీ) చొరవ తీసుకోవాలని సూచించారు. మంగళవారం ఆయన ఢిల్లీలో నూతనంగా నిర్మించిన సీఈసీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హక్కుల దుర్వినియోగానికి పాల్పడేవాళ్లు, స్వప్రయోజనాల కోసం హక్కులను కాలరాసేవాళ్లు ఆ పనిని మానుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి పారదర్శకత, జవాబుదారీతనం రెండు కండ్లలాంటివని, వాటిని పాటించడం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని చెప్పారు.

ప్రధాని జవాబు చెప్పాల్సిందే

■ బ్యాంకుల్లో మోసాలపై విపక్షాల ఆందోళన
■ తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్‌ఎస్ ఎంపీల డిమాండ్
■ వరుసగా రెండో రోజూ సాగని సభ


రాజ్యసభలో ప్రతిపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు చేపట్టిన ఆందోళనతో వరుసగా రెండో రోజు ఉభయ సభల్లోనూ ఎటువంటి కార్యకలాపాలు కొనసాగలేదు. దీంతో ఉభయసభలు బుధవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ మంగళవారం ఉదయం సమావేశం కాగానే వివి ధ విపక్ష పార్టీల సభ్యులు ప్లకార్డులతో స్పీకర్ వెల్‌లోకి దూసుకొచ్చారు. బ్యాంకింగ్ రంగంలో మోసాలపై ప్రధాని మోదీ సభకు సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్, తృణమూల్ సభ్యులు డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఆ రాష్ట్ర ఎంపీలు, కావేరీ జల నిర్వహణ బోర్డు ఏర్పాటు కోసం అన్నాడీఎంకే, మరాఠీ భాషకు ప్రాచీన హోదా ఇవ్వాలని శివసేన సభ్యులు డిమాండ్ చేశారు. తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్‌ఎస్ ఎంపీలు నినాదాలు చేశారు. ఈ గందరగోళం మధ్య పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ మాట్లాడుతూ, బ్యాంకింగ్ రంగంలో అవకతవకలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమన్నారు. జాతీయ బ్యాంకుల్లో రూ. వేల కోట్ల మోసాలతో ప్రజాధనం లూటీ అయిందని, నేరగాళ్లు దేశం విడిచి పోయేలా ప్రభుత్వం అనుమతించిందని, దీనిపై చర్చ జరుగాలని కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. సభలో గందరగోళం ఎంతకీ సద్దుమణగకపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను బుధవారానికి వాయిదా వేశారు. 'చోటా మోదీ కహా గయా? ప్రధాన్ మంత్రి జవాబ్ దో (చిన్న మోదీ ఎక్కడికెళ్లాడు? ప్రధాని జవాబు చెప్పాలి', 'నీరవ్ మోదీ వాపస్ లావో' అని కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. కాగా, లక్ష మందికి ఒక పోలీసు పని చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో తెలిపారు.

రాజ్యసభలోనూ అవే దృశ్యాలు


రాజ్యసభలో కూడాఎటువంటి కార్యకలాపాలు జరుగలేదు. బ్యాంకుల్లో మోసాలు, ఏపీకి ప్రత్యేక హోదా, కావేరీ బోర్డు అంశాలపై ఆయా పార్టీల సభ్యు ఆందోళనతో సభా సమయం తుడిచిపెట్టుకుపోయింది. చైర్మన్ వెంకయ్యనాయుడు, డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ పలుమార్లు సభ్యులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. చివరగా సాయంత్రం 3.30కు మరోసారి సమావేశమైనప్పుడూ సభ్యులు శాంతించకపోవడంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు పీజే కురియన్ ప్రకటించారు. అంతకుముందు సభ్యుల తీరుపై చైర్మన్ వెంకయ్యనాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

పార్లమెంట్ ఆవరణలో కొనసాగిన ఆందోళన

పార్లమెంట్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కూడా ఎంపీలు ఆందోళన చేశారు. పీఎన్బీలో జరిగిన మోసాలపై ప్రధాని సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో ఎంపీలు 'దేశ్ కా చౌకీదార్ కహా గయా? సోగయా సోగయా (భారతదేశ కాపలాదారుడు ఏమయ్యాడు? నిద్రపోతున్నాడు) అంటూ నినాదాలు చేశారు.

అధికారానికొస్తే ఏపీకి ప్రత్యేక హోదా

■ కాంగ్రెస్ కార్యకర్తల ధర్నాలో రాహుల్‌గాంధీ ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 6: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను మంజూరు చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించారు. తాము అధికారానికి వచ్చిన తరువాత చేసే మొట్టమొదటి పని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడమేనని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్ వద్ద మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షం ఐక్యంగా పోరాడితే ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నచ్చజెప్పవచ్చని, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దక్కాల్సింది ఇప్పించవచ్చని అన్నారు. ఆ తరువాత కూడా ట్విట్టర్‌లో రాహుల్ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'ఈ అంశంపై ప్రతిపక్షం ఐక్యంగా పోరాడితే ఆంధ్రా ప్రజలకు న్యాయం చేసేలా బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవచ్చు' అని పేర్కొన్నారు. ధర్నాలో పాల్గొన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే సోమ్‌నాథ్ భారతి మాట్లాడుతూ, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్‌కు మద్దతు తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయమై కాంగ్రెస్ ఎక్కడ, ఎటువంటి ఆందోళన చేపట్టినా ఆప్ మద్దతునిస్తుందని చెప్పారు. పార్లమెంట్ లోపలైనా, వెలుపలైనా తమ మద్దతు ఉంటుందని అన్నారు.

రాజధానిలో ఫ్లైఓవర్లకు సొబగులు!

రంగులు, వెలుగులు, పచ్చదనంతో నింపేందుకు సన్నాహాలు

నెలరోజుల్లో పనులు పూర్తిచేసేందుకు ఏర్పాట్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరంలోని ఫ్లైఓవర్లకు సొబగులు అద్దేందుకు జీహెచ్ఎంసీ సన్నాహాలు చేస్తున్నది. ఇందులో భాగంగా చిన్నాచితకా మరమ్మతులు ఉంటే వాటిని పూర్తిచేయడంతోపాటు రంగులు వేసి, లైటింగ్ ఏర్పాటు చేసి, పచ్చదనంతో నింపనున్నారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టి నెలరోజుల్లో పూర్తిచేయాలని నిర్ణయించారు. నగరంలో అవసరాలకు తగ్గట్టు దశలవారీగా పలు ఫ్లైఓవర్లను నిర్మించారు. వార్షిక నిర్వహణలో భాగంగా మరమ్మతులు చేయడంతప్ప ప్రత్యేకంగా వాటికి పెయింటింగ్ వేసి సరికొత్త అందాలతో తీర్చిదిద్దిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఫ్లైఓవర్లను సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఫ్లైఓవర్లకు సరికొత్త అందాలు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. మొదట నగరంలోని ప్రధాన ప్రాంతాల్లోగల ఎనిమిది నుంచి పది ఫ్లైఓవర్ల అభివృద్ధి పనులు చేపట్టాలని, తదుపరి మిగిలినవాటిని చేపట్టాలని నిర్ణయించారు. జోన్లవారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. హెచ్ఎండీఏ పరిధిలోని ఫ్లైఓవర్లను హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోనే అభివృద్ధి చేయాలని సంకల్పించారు. నెలరోజుల్లో పనులు పూర్తిచేయాలని నిర్ణయించినట్టు అధికారులు వెల్లడించారు.



పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే

ప్రాధాన్యతాక్రమంలో సుందరీకరించేవి..

తెలుగుతల్లి, పంజాగుట్ట, గ్రీన్‌లాండ్స్, సికింద్రాబాద్ సర్దార్‌పటేల్, వైఎంసీఏ, పారడైజ్, బేగంపేట, మాసాబ్‌ట్యాంక్, లాలాపేట, తార్నాక, లంగర్‌హౌస్, చాంద్రాయణగుట్ట, నారాయణగూడ, బషీర్‌బాగ్, కూకట్‌పల్లి, గచ్చిబౌలి, మౌలాలి, మూసాపేట్, హైటెక్‌సిటీ, నల్లగండ్ల, హఫీజ్‌పేట్, టోలీచౌకీ, సీతాఫల్‌మండి, ఖైరతాబాద్, ఆర్కేపురం, నల్లగొండ క్రాస్‌రోడ్స్, అల్వాల్, డబీర్‌పుర, జామై ఉస్మానియా, ఫతేనగర్, పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ఫ్లైఓవర్లు.

హుస్సేన్‌సాగర్ శుద్ధికి గ్లోబల్ టెండర్

వేసవిలో దుర్వాసన రాకుండా హెచ్ఎండీఏ చర్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హుస్సేన్‌సాగర్ నుంచి వెలువడే దుర్వాసనను అదుపు చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు తీసుకుంటున్నది. ప్రధానంగా వేసవిలో ఎండతీవ్రత, గణనీయంగా పెరిగే ఉష్ణోగ్రతలతో సాగర్‌లోని నీటి మట్టం క్రమంగా తగ్గుతుంది. ఈ సమయంలోనే కొద్ది నీటిలో ఉండే ఆక్సిజన్ శాతం ఇంకా తగ్గిపోతుంది. దీంతో ఈ నీటిలో ఎనరోబిక్ బ్యాక్టీరియా ఉత్పత్తి పెరిగి జీవ ఆక్సిజన్ (బీవోడీ) గణనీయంగా పడిపోతుంది. ఈ నేపథ్యంలోనే భరించలేని దుర్వాసనలు వెదజల్లుతాయి. దీంతో ఈసారి వేసవిలో సాగర్ నుంచి వెలువడే దుర్వాసనను అదుపు చేసేందుకు అంతర్జాతీయంగా అనుసరిస్తున్న రెమిడేషన్ పద్ధతికి హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే హుస్సేన్‌సాగర్‌ను శుద్ధి చేసేందుకు అంతర్జాతీయ బిడ్లను ఆహ్వానిస్తూ ఇంజినీరింగ్ విభాగం టెండర్ల ద్వారా దరఖాస్తులను కోరింది. డీవో, బీవోడీలను అదుపులోకి తీసుకొచ్చి వేసవిని గట్టెక్కించాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. రెమిడేషన్ విధానం నిర్వహణలో 10 ఏండ్ల అనుభవం, ఏడాదిలో కనీసం రూ.2 కోట్ల మేర పనులు చేసి ఉన్న ఏజెన్సీకి ఈ పనులు కేటాయించేలా నిబంధనలు విధించారు. ఈ శుద్ధి పనులకు ఆసక్తి గల ఏజెన్సీలు ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని అధికారులు టెండర్ నోటిఫికేషన్‌లో కోరారు. అర్హత కలిగిన ఏజెన్సీలను ఎంపిక చేసి పనులను అప్పగించనున్నామని, స్వచ్ఛ హుస్సేన్‌సాగర్ లక్ష్యంగా పనిచేస్తామని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.



5 కిలోల బంగారం దోపిడీ

- కత్తులతో బెదిరించి పట్టపగలు లూటీ
- చార్మినార్‌లోని ఆభరణాల తయారీ కేంద్రంలో ఘటన
- సీసీ కెమెరాలు ధ్వంసం.. డీవీఆర్ అపహరణ
- తెలిసినవారి పనేనని పోలీసుల అనుమానం

హైదరాబాద్ సిటీబ్యూరో/చార్మినార్, నమస్తే తెలంగాణ: ముఖాలకు మాస్కులు ధరించిన ఓ ముఠా.. బంగారు ఆభరణాల తయారీ సంస్థలోకి ప్రవేశించి.. కత్తులతో బెదిరించి దాదాపు 18 మంది సిబ్బందిని నిర్బంధించి ఐదు కిలోల బంగారాన్ని దోచుకెళ్లింది. చార్మినార్ ప్రాంతంలో మంగళవారం పట్టపగలు జరిగిన ఈ భారీ దోపిడీతో సిటీ పోలీసులు ఉలిక్కిపడ్డారు. వెంటనే ముమ్మర దర్యాప్తు చేపట్టిన సౌత్‌జోన్ పోలీసులు ముఠాకు సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించినట్టు చెప్పారు. అతి త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసాబౌలి ప్రాంతంలో జరిగిన ఈ దోపిడీకి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన నేతాయిదాస్ కుటుంబం కొన్నేండ్లుగా మూసాబౌలి ప్రాంతంలో నివాసం ఉంటున్నది. నేతాయిదాస్ తన కుమారుడు సాహెబ్‌దాస్‌తో కలిసి నగరంలోని బంగారు ఆభరణాల దుకాణాల నుంచి ఆర్డర్లు సేకరించి ఆభరణాలను తయారు చేసి ఇచ్చే వ్యాపారం చేస్తున్నారు. మూసాబౌలిలోని ఓ భవనంలో ఆభరణాల తయారీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో 20 మంది వరకు పనిచేస్తున్నారు.

చేతులు కట్టేసి.. నోటికి ప్లాస్టర్లు వేసి

మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముఖాలకు మాస్కులు ధరించిన 12 మంది దుండగులు ఆ భవనం వద్దకు చేరుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో బంగారు ఆభరణాలు తయారు చేస్తున్న గదికి చేరుకున్నారు. గదిలోకి ప్రవేశిస్తూనే కత్తులు చూపిస్తూ బెదిరించారు. అక్కడున్న దాదాపు 18 మంది కార్మికులను కట్టేసి, నోటికి ప్లాస్టర్లు అంటించి నిర్బంధించారు. బంగారాన్ని దాచిపెట్టిన లాకర్‌ను తెరిచేందుకు ప్రయత్నిస్తుండగా అందులో మేనేజర్‌గా పనిచేస్తున్న దీపాంకర్ వచ్చాడు. దుండగులు అతడిని అడ్డుకొని ఫోన్ గుంజుకొని మరో గదిలో బంధించారు. తర్వాత లాకర్‌ను తెరిచి అందులో ఉన్న ఐదు కిలోల బంగారాన్ని తీసుకొని పరారయ్యారు. దుండగులు అక్కడి నుంచి వెళ్లిన తర్వాత కార్మికులు తమ కట్లను విప్పుకొని విషయాన్ని యజమానులకు వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు చార్మినార్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



మూసాబౌలి ప్రాంతంలో దోపిడీ జరిగిన ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రంగంలోకి 12 బృందాలు

దుండగులు పరారయ్యే సమయంలో గదుల్లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. డీవీఆర్‌ను ఎత్తుకెళ్లి పోలీసులకు ఆధారాలు దొరకకుండా ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులు నేతాయిదాస్ దుకాణం వైపు వచ్చిపోయే మార్గంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నారు. 12 ప్రత్యేక, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపినట్టు డీసీపీ సత్యనారాయణ తెలిపారు. ఇప్పటికే కీలక ఆధారాలు లభించాయన్నారు. దుండగులు తెలుగు, ఉర్దూలో మాట్లాడటాన్ని బట్టి వారు నగరానికి చెందినవారేనని, దోపిడీ తీరును బట్టి తెలిసినవారి పనేనని అనుమానిస్తున్నామన్నారు.

పక్కాగా తెలిసినవారి పనే..

ఈ దోపిడీ పక్కాగా తెలిసినవారి పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. దోపిడీ జరిగిన భవనంలో బంగారు ఆభరణాలు తయారు చేస్తున్నారనే విషయం స్థానికులకే పెద్దగా తెలియదు. అలాంటిది దుండగులు నేరుగా భవనం వద్దకు చేరుకున్నారు. దీనిని బట్టి గతంలో ఇక్కడ పనిచేసి మానేసిన వారిలో దుకాణం గురించి పక్కాగా తెలిసిన వాళ్లు దోపిడీకి ప్లాన్ చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. నేతాయిదాస్ వద్ద పనిచేసేవాళ్లలో ఎక్కువగా పశ్చిమబెంగాల్‌కు చెందిన వారే ఉన్నారు. మరోవైపు దోపిడీ సమయంలో దాదాపు 18 మంది కార్మికులు ఉన్నా, వారిలో ఏ ఒక్కరూ దుండగులను అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. కనీసం ఇతరుల సహాయం కోరలేదు. పైగా ముఠా దాదాపు గంటసేపు ఆ భవనంలోనే ఉండి తీరిగ్గా దోపిడీ చేసింది. దీనిని బట్టి సిబ్బందిలో ఎవరైనా దుండగులకు సహాయం చేశారా అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. దోపిడీ సమయంలో అక్కడికి వచ్చిన మేనేజర్ గుర్తుతెలియని వ్యక్తులు తలుపుల వద్ద ఉంటే అప్రమత్తమయ్యేవాడు. కానీ అలాంటిదేదీ జరుగలేదు కాబట్టి కచ్చితంగా ఇది తెలిసినవాళ్ల పనేనని, గతంలో ఇక్కడ పనిచేసి మానేసిన బెంగాల్ వ్యక్తులు స్థానికుల సాయంతో దోపిడీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

15 కిలోల బంగారం పట్టివేత

ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొడుతూ ఇతర రాష్ర్టాలకు ఆభరణాల అక్రమ రవాణా

- హైదరాబాద్‌లో తయారీ.. కర్ణాటకలో విక్రయాలు
- ఇద్దరి అరెస్ట్.. రూ.5 కోట్ల సొమ్ము స్వాధీనం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులను ఎగ్గొడుతూ బంగారు ఆభరణాలను అక్రమంగా సరఫరా చేస్తున్న ఇద్దరిని సౌత్‌జోన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5 కోట్ల విలువైన 15 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో తయారు చేసిన బంగారు ఆభరణాలను నిందితులు బెంగళూరులోని జాయ్ అలుకాస్, మైసూర్‌లోని మలబార్ జాయ్ అలుకాస్‌లో అప్పగించేందుకు వెళ్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. కేసు వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు మంగళవారం తన కార్యాలయంలో వెల్లడించారు. యశస్వి అగర్వాల్ అనే వ్యక్తి చార్మినార్ ప్రాంతంలోని ఉర్దూ షరీఫ్ చార్‌కమాన్ సమీపంలో ఉన్న వీర హనుమాన్ కాంప్లెక్స్‌లో 'రాజారాం జ్యువెల్స్' పేరుతో ఆభరణాల తయారీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అతడి వద్ద వైష్ణవ్ మనోజ్‌కుమార్, ప్రదీప్ అగర్వాల్ పనిచేస్తున్నారు. 15.239 కిలోల వివిధ రకాల ఆభరణాలను బెంగళూరు, మైసూర్‌లోని దుకాణాల్లో అందించేందుకు మనోజ్, ప్రదీప్ సోమవారం సాయంత్రం ఆటోలో దుకాణం నుంచి బయలుదేరారు. ఆభరణాల బ్యాగ్‌తో ఆరాంఘర్ చౌరస్తా వరకు ఆటోలో వెళ్లి, అక్కడి నుంచి బెంగళూరుకు బస్సులో వెళ్లాలని ప్రణాళిక వేసుకున్నారు. వారు ఆటోలో ఆరాంఘర్ వైపు వస్తుండగా రాత్రి 9:30 గంటల ప్రాంతంలో అలియాబాద్‌లో షాలిబండ ఇన్‌స్పెక్టర్ లింగయ్య ఆధ్వర్యంలోని బృందాలు వాహనాల తనిఖీ చేపట్టాయి. ఈ సమయంలో ఆటో డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్లడంతో పోలీసులకు అనుమానం వచ్చి చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి ఆటోను వెంబడించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న సీపీ శ్రీనివాస్‌రావు

ఆదాయపన్నుశాఖకు అప్పగింత

చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి బృందం ఎంబీఎన్ఆర్ చౌరస్తా వద్ద ఆటోను ఆపి, అందులో ఉన్న వైష్ణవ్, ప్రదీప్‌ను, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆటోలో ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు ఉన్నట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. మనోజ్, ప్రదీప్‌ను విచారించగా తాము రాజారాం జ్యువెల్స్ ఉద్యోగులమని, బంగారాన్ని బెంగళూరు, మైసూర్‌లోని దుకాణాలకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఆభరణాలకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో దుకాణం యజమానితోపాటు పట్టుబడ్డ ఇద్దరిని ఆదాయపన్ను శాఖకు అప్పగిస్తున్నామని సీపీ తెలిపారు. జయ్ అలుకాస్ సంస్థకు చెందిన వారు బంగారాన్ని రాజారాం జ్యువెల్స్‌కు ఇచ్చి ఆభరణాలు తయారు చేయిస్తున్నారా? లేక రాజారాం జ్యువెల్స్ సొంతగా ఆభరణాలను తయారుచేసి జయ్ అలుకాస్ సంస్థలకు పంపిణీ చేస్తున్నదా? అనేది తేలాల్సి ఉన్నదన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి నిందితులు ఎటువంటి వివరాలు వెల్లడించలేదని, అవన్నీ ఆదాయపన్నుశాఖ చూసుకుంటుందన్నారు. ప్రభుత్వానికి పన్నులను ఎగ్గొట్టడమే కాకుండా, రూ.కోట్లు విలువైన బంగారాన్ని ఎలాంటి రక్షణ లేకుండా తరలిస్తూ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో డీసీపీ సత్యనారాయణ, ఫలక్‌నుమా ఏసీపీ సయ్యద్ ఫియాజ్ తదితరులు పాల్గొన్నారు.



గడియారం రామకృష్ణశర్మ శత జయంతిలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు రమణాచారి, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ తదితరులు

గడియారం రామకృష్ణశర్మ యువతకు స్ఫూర్తి

తెలుగు యూనివర్సిటీ: తెలంగాణ సారస్వత పరిషత్ వైభవానికి కృషిచేసిన వైతాళికుల గొప్పదనాన్ని వ్యాసాల రూపంలో భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి సూచించారు. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ కృషీవలుడు డాక్టర్ గడియారం రామకృష్ణశర్మ శత జయంతి వేడుకలు పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో జరిగాయి. ఈ వేడుకలకు రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. నేడు అలంపూర్ చారిత్రాత్మక క్షేత్రంగా, శక్తిపీఠంగా నిలిచిందంటే రామకృష్ణశర్మ చేసిన కృషే కారణమని గుర్తుచేశారు. సారస్వత పరిషత్‌కు మూల స్తంభంగా దేవులపల్లి రామానుజరావు, గడియారం రామకృష్ణశర్మ నిలిచి చేసిన కృషి నేటి యువతకు స్ఫూర్తినిస్తుందన్నారు. ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు చరిత్ర పరిశోధకుల్లో రామకృష్ణశర్మ స్థానం చాలా ఉన్నతమైనదన్నారు. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే చెన్నయ్య, ప్రముఖ సాహితీవేత్తలు గన్నమరాజు గిరిజ మనోహరబాబు, రామకృష్ణశర్మ కుమారుడు భార్గవశర్మ పాల్గొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయానికి నం.1 అవార్డు

శంషాబాద్ రూరల్: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 5 నుంచి 15 మిలియన్ ప్రయాణికుల సామర్థ్యంలో నంబర్ వన్ అవార్డు వచ్చినట్టు ఎయిర్‌పోర్టు సీఈవో కిషోర్ మంగళవారం వెల్లడించారు. అంతర్జాతీయ విమానాశ్రయ మండలి ఈ అవార్డును ప్రకటించిందన్నారు. నాలుగేండ్లుగా నంబర్‌వన్ అవార్డులు వస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శంషాబాద్‌కు ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. విమానాశ్రయ సామర్థ్యాన్ని మరింత పెంచడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు.

భవనంపైనుంచి పడి ఇద్దరు కూలీలు మృతి

13వ అంతస్తుకు సామగ్రి తరలిస్తుండగా ఘటన

మణికొండ: హైదరాబాద్ కోకాపేటలోని ఓ బహుళ అంతస్తుల భవనం పైనుంచి ప్రమాదవశాత్తు ఇద్దరు కూలీలు జారిపడి మృతి చెందారు. జీఏఆర్ సంస్థ కోకాపేటలో 13 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నది. మంగళవారం సాయంత్రం కూలీలు తపన్ బిశ్వాస్(45), రానా మండల్(21) నిర్మాణ సామగ్రిని తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న లిఫ్ట్‌లో పైకి తీసుకెళ్లారు. సామగ్రి బరువుకు లిఫ్ట్ ప్లాట్‌ఫాం ఒకవైపు ఒరుగడంతో తపన్ బిశ్వాస్, రానా మండల్ 12వ అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అదే సమయంలో కింద పని చేస్తున్న మరో కూలీ దీపక్‌పై వీరు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వీరంతా పశ్చిమ బెంగాల్‌కు చెందినవారే. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేసుకోండి

జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఈనెల 31వ తేదీలోపు ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేయించుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. లేనిపక్షంలో మే 1 నుంచి మే 31వ తేదీవరకు 25శాతం జరిమానా, అనంతరం 50శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికీ ట్రేడ్ లైసెన్సులు పొందనివారు ఆన్‌లైన్‌లోకానీ, ఈ-సేవా కేంద్రాలు, సిటిజన్ సర్వీస్ సెంటర్లు, జీహెచ్ఎంసీ కేంద్ర, సర్కిల్ కార్యాలయాల్లో కానీ పొందవచ్చని సూచించారు. ముగుస్తున్న 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.50 కోట్లు వసూలుచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు రూ.39 కోట్లు వసూలైనట్టు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్ లైసెన్సులు పొందేందుకు www.ghmc.gov.in వెబ్‌సైట్‌లో e-registrations - new trade license అంశంలోకి వెళ్లాలని సూచించారు. ఇందులో మొబైల్ నంబర్‌ను నమోదుచేస్తే దానికి ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్‌చేయగానే దరఖాస్తు ఫారం వస్తుంది. అనంతరం దరఖాస్తుతోపాటు కోరిన ధ్రువపత్రాలు అప్‌లోడ్‌చేస్తే మొబైల్ ఫోన్‌కు దరఖాస్తు నంబర్, అధికారి పేరు వస్తుంది. సదరు నంబర్‌పై సూచించిన ఫీజును సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లిస్తే సంబంధిత అధికారి విచారణ జరిపి ప్రధాన కార్యాలయంలోని సంబంధిత అధికారికి నివేదిక ఇస్తే వారు టిన్ నంబర్ జారీచేస్తారు. దీంతో ట్రేడ్ లైసెన్సు పొందే ప్రక్రియ పూర్తవుతుంది.

బండ్లగూడ ఆర్టీవోలో నలుగురి సస్పెన్షన్

- ఏవో, ఇద్దరు సీనియర్, ఒక జూనియర్ అసిస్టెంట్‌పై వేటు
- ఆర్టీవో పురుషోత్తం కేంద్ర కార్యాలయానికి అటాచ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ బండ్లగూడలోని ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కార్యాలయంలో వెలుగుచూసిన 'లైఫ్‌ట్యాక్స్' అవినీతిలో నలుగురు సిబ్బందిపై ప్రభుత్వం వేటు వేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అక్రమాల్లో పాలుపంచుకున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించిన కార్యాలయ ఏవో విక్టర్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు గిరిబాబు, ఫణికుమార్, జూనియర్ అసిస్టెంట్ వాసుదేవరావును సస్పెండ్ చేసింది. అదేవిధంగా ఆర్టీవో పురుషోత్తంను ఖైరతాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఉప్పల్ ఆర్టీవో వెంకటేశంకు బండ్లగూడ ఆర్టీవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ ఆదేశాలు జారీచేశారు. బండ్లగూడ ఆర్టీవోలోని కొందరు సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కై ఇతర రాష్ర్టాల నుంచి సెకండ్ సేల్‌పై కొనుగోలు చేసే వాహనాల వయస్సును పెంచి వాటి లైఫ్‌ట్యాక్స్‌ను తగ్గిస్తున్నట్టు తేలిన సంగతి తెలిసిందే. ఈ అవినీతితో ప్రభుత్వానికి రూ.1.20 కోట్లు నష్టం కలిగినట్టు ఆరోపణలున్నాయి. సమూలంగా విచారణ జరిపి నష్టపోయిన డబ్బును వసూలుచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న కాలేద్.. నిందితుడు ఖయ్యూం

కొడుకు చెయ్యి నరికిన తండ్రి రిమాండ్

పహాడీషరీఫ్: కొడుకు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చెయ్యి నరికిన ఘటనలో తండ్రిని పహాడీషరీఫ్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ముత్యంరెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ బాలాపూర్ మండలం వాదేహి ముస్తఫాకాలనీకి చెందిన మహ్మద్ కాలేద్ ఖురేషి ఎర్రకుంటలోని కేబుల్‌టీవీలో పనిచేసేవాడు. కొన్నాళ్లుగా చెడు వ్యసనాల బారినపడ్డాడు. ఫోన్‌లో, టీవీలో నీలి చిత్రాలు, సినిమాలు చూసేవాడు. తండ్రి మహ్మద్ ఖయ్యూం ఖురేషి(45) మందలించినా వినలేదు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవలు కూడా జరిగాయి. గతంలో ఒకటి రెండుసార్లు తండ్రి మీద చేయి చేసుకున్నాడు. ఈ నెల 5న తండ్రీకొడుకుల మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన ఖయ్యూం ఖురేషి మధ్యాహ్నం సమయంలో కాలేద్ ఖురేషి ఇంట్లో పడుకున్న సమయంలో మటన్ కొట్టే కత్తితో మణికట్టు వద్ద నరికాడు. వెంటనే కుటుంబ సభ్యులు కాలేద్‌ను దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఖయ్యూంను అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. అయితే కాలేద్ ఖురేషికి ఎటువంటి చెడు వ్యసనాలు లేవని, తండ్రి ఖయ్యూం ఖురేషి కొన్నాళ్లుగా మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు చెప్తున్నారని సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో మరింత లోతుగా విచారణ జరుపుతున్నామన్నారు.

400 కిలోల అల్ప్రాజోలం ముడిసరుకు స్వాధీనం

కల్తీ కల్లు తయారీదారులకు విక్రయించే యత్నం

సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు

తయారు చేసి అమ్మితే రూ.3 కోట్లు ఆదాయం!

హైదరాబాద్ సిటీబ్యూరో/పేట్ బషీరాబాద్, నమస్తే తెలంగాణ: కల్తీ కల్లు తయారీలో వినియోగించే మత్తు పదార్థమైన అల్ప్రాజోలంను తయారు చేసేందుకు ముడిసరుకును నిల్వ చేసిన యువకుడిని మంగళవారం సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 400 కిలోల ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముడిపదార్థంతో తయారుచేసిన అల్ప్రాజోలంకు మార్కెట్‌లో రూ.3కోట్ల విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం గండిగూడెంకు చెందిన నిజాం(25) అల్ప్రాజోలం తయారు చేసి కల్తీ కల్లు తయారీదారులకు అమ్మాలని ప్రణాళిక రూపొందించాడు. బంధువులైన యూనుస్, షకీల్ నుంచి అల్ప్రాజోలం తయారీ విధానం, ఈ పదార్థాన్ని కొనుగోలు చేసేవారి వివరాలు తెలుసుకున్నాడు. తర్వాత ఓ ఫార్మా కంపెనీకి చెందిన ఫార్మసిస్టును సంప్రదించి అతడికి రూ.30 వేలు ఇచ్చి అల్ప్రాజోలం తయారీకి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ ఫార్మసిస్టు ఆదేశాల మేరకు అల్ప్రాజోలం తయారీకి అవసరమయ్యే ముడిపదార్థాలైన పాస్ఫరస్ పెంటాక్సాయిడ్, బెంజీన్ సైనైడ్‌ను తార్నాకలో ఓ వ్యక్తి నుంచి 400 కిలోలు సేకరించాడు. ఈ సరుకును దశలవారీగా బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ ఇంటికి తరలిస్తున్నాడు. ఈ రెండు రసాయనాలను కలిపి రెండు మూడు దశల్లో శుద్ధి చేసి అల్ప్రాజోలంను తయారు చేసేందుకు పథకం పన్నాడు. ఈ ముడిసరుకు రవాణా గురించి సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం బాచుపల్లికి చేరుకున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న కారును తనిఖీ చేయగా బెంజీన్ సైనైడ్‌ను తరలిస్తూ నిజాం పట్టుబడ్డాడు. విచారణలో అతడు చెప్పిన వివరాల మేరకు బొల్లారంలోని ఇంటిలో నిల్వ చేసిన సరుకును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని బాచుపల్లి పోలీసులకు అప్పగించారు. నిజాం బంధువులైన షకీల్, యూనుస్ అల్ప్రాజోలం సరఫరా చేస్తూ పట్టుబడి ప్రస్తుతం సంగారెడ్డి జైలులో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిజాం తీసుకొచ్చిన ముడి సరుకుతో తయారయ్యే అల్ప్రాజోలం విలువ కల్తీకల్లు మార్కెట్‌లో రూ.3 కోట్ల వరకు పలుకుతుందని చెప్పారు. ఫార్మాసిస్టుతోపాటు ముడి పదార్థాలు సరఫరా వ్యక్తులు పరారీలో ఉన్నారు.

భారీగా పెరిగిన డిమాండ్

మత్తు ఎక్కించే అల్ప్రాజోలంను ఎక్కువగా కల్తీకల్లు తయారీలో వినియోగిస్తుంటారు. ఇటీవల ఎక్సైజ్ అధికారులు, పోలీసులు అల్ప్రాజోలం సరఫరాపై గట్టి నిఘా పెట్టడంతో డిమాండ్ భారీగా పెరిగింది. గతంలో దీని కిలో ధర రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఉండగా, ఇప్పుడు రూ.1.5 లక్షల నుంచి రూ.1.8 లక్షలకు పెరిగింది. ధర పెరుగడం, మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో అల్ప్రాజోలంను తయారు చేసి రాత్రికి రాత్రే లక్షాధికారులు కావాలనే ఆశతో చాలా మంది దీని తయారీపై దృష్టి పెట్టారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బెంజీన్ సైనైడ్, (ఇన్‌సెట్‌లో) నిందితుడు నిజాం

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
బుధవారం 7 మార్చి 2018

WWW. NTNEWS.COM

యత్ర నార్యస్తు పూజ్యంతే..

యత్ర నార్యస్తు పూజ్యంతే.. రమంతే తత్ర దేవతా.. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడుతారో.. అక్కడ దేవతలు కొలువై ఉంటారంటారు. అవును.. స్త్రీలను గౌరవించుకోవడం మన సంప్రాదాయం. గౌరమ్మను గంగలో పూజించే బతుకమ్మ సాక్షిగా.. దుర్గమ్మను నైవేద్యంతో పూజించే బోనం సాక్షిగా.. మహిళను గౌరవించుకోవడం, ఆమెను సత్కరించుకోవడం మన వారసత్వం! ఆమె ఉద్యమంలో పాటయ్యింది. మాటయ్యింది. ఆటలో మేటీ అయ్యింది. అక్షరం దిద్దింది. చేదోడు వాదోడయ్యింది. అన్నింటా ఆమె. ఆమెను గౌరవించుకోవడం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఒక సందర్భం మాత్రమే. 70 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక పురస్కారాలను మహిళా దినోత్సవం సందర్భంగా అందజేస్తున్నది. భాషా సంస్కృతిక శాఖ, మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ సంయుక్తంగా తమ వంతు బాధ్యతగా, సరికొత్త సంప్రదాయంగా మూడేండ్లుగా ఈ అవార్డులను అందిస్తున్నది. ఈ ఏడాదికి గాను 17 కేటగిరీల్లో 20 మంది ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఆ ప్రతిభావంత మహిళల్లో పది మందిని ఈ రోజు పరిచయం చేస్తున్నాం.

సాయం చేయడంలోనే ఆనందం



నా దగ్గరికి సాయం కోరి వచ్చే మహిళలకు నా వంతు సహకారం అందిస్తున్నాను. సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను. 1996, 2006లో రెండుసార్లు జెడ్పీటీసీగా పనిచేశాను. కేవలం ప్రభుత్వ పథకాలే కాకుండా ఆపద అని వచ్చిన ప్రతీ మహిళకు సాయం చేశాను. 2 వేలకు పైగా మహిళా సహకార సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేయడంతో పాటు దీపం పథకం అందరికీ అందేలా చర్యలు తీసుకున్నాను. మహిళలకు నేను చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం సంతోషం. ప్రస్తుతం పదవి లేకపోయినా సాయం కోసం వచ్చేవారికి నా వంతు సహాయం చేస్తూనే ఉన్నాను. నేను చేస్తున్న సేవల వెనుక నా కుటుంబ సహకారం గ్రామస్తుల సహకారం ఎంతో ఉంది. నలుగురికి సాయం చేయడం, అందులోనూ మహిళలకు సేవ చేయడంలో ఎంతో ఆనందం ఉంది.

గండ్రరమాదేవి, రాయికల్, జగిత్యాల జిల్లా (సామాజిక సేవకుగాను ఆవార్డు)

మహిళా దర్శకులకు ప్రోత్సాహం



మన ప్రభుత్వం నుంచి అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ ప్రోత్సాహం చాలామందికి స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను. మరింత మంది మహిళలు దర్శకత్వం వైపు రావడానికి నాకు వచ్చిన అవార్డు వారిలో ప్రోత్సాహం నింపుతుందని భావిస్తున్నాను. మహిళలు ఈ రంగంలో రాలేరు అనే అపోహ కొంతవరకైనా తొలగిపోతుందని, భవిష్యత్తులో ఈ రంగంలోనూ మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నాను. నా కృషికి గుర్తించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

బి.వి. నందిని రెడ్డి,
సినిమా దర్శకురాలు, హైదరాబాద్
(సినీ పరిశ్రమలో దర్శకత్వ రంగంలో రాణిస్తుందుకు గాను అవార్డుకు ఎంపిక)

అవార్డు రావడం గొప్ప వరం



చిన్నతనం నుంచే ఉద్యమ పాటలు పాడిన అనుభవం ఉంది. ప్రజా ఉద్యమాల్లో భాగస్వామిగా అనేక వేదికలపై విప్లవ గీతాలను ఆలపించాను. ఆ తర్వాత మలి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు ఉద్యమ గీతాలు ఆలపించే అవకాశం వచ్చింది. ఉద్యమం వల్లే ఉద్యమ గాయనిగా పేరొచ్చింది. అనేక ఒడిదొడుగులు, కష్టనష్టాలను భరిస్తూ ఈ స్థాయికి రావడం ఆనందంగా ఉంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన కళలకు, కళాకారులకు నిజమైన గుర్తింపు వచ్చిందని భావిస్తున్నాను. తెలంగాణ వచ్చాకే సాంస్కృతిక సారథిలో ఉద్యోగం రావడం ఒక అదృష్టమైతే, ఇప్పుడు అవార్డు రావడం గొప్ప వరంగా భావిస్తున్నాను. నన్ను ఉద్యమ గాయనిగా గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, సాంస్కృతిక సారథి రసమయి, కన్వీనర్ దయానర్సింగ్‌లకు రుణపడి ఉంటాను.

ఈదునూరి పద్మ, రామగుండం, పెద్దపల్లి జిల్లా. (ఉద్యమ గాయనిగా అవార్డు)

ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తా



జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో తొలి కాంస్య పతకం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఆ సందర్భంగా ప్రభుత్వం నన్ను సత్కరించడంతో పాటు మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడారంగంలో నాకు అవార్డు ప్రకటించడం ఇంకా సంతోషంగా ఉంది. కుటుంబసభ్యుల సహకారంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ పతకం సాధించాను. నా కెరీర్‌లో లభించిన అతి పెద్ద విజయంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. భవిష్యత్‌లో స్వర్ణపతకంతో దేశానికి, మన రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువస్తాను. భవిష్యత్‌లో జిమ్నాస్టిక్స్‌కు మరింత ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నా. 2020 ఒలింపిక్స్‌లో జిమ్నాస్టిక్స్‌లో మన దేశానికి పతకం తీసుకురావడానికి ప్రయత్నిస్తా. అవార్డుకు ఎంపిక చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

బుడ్డా అరుణారెడ్డి, జిమ్నాస్టిక్స్ కాంస్యపతాక విజేత.

పాటకు గుర్తింపు



చిన్నతనం నుంచి పాటలు పాడుతున్నా. మలిదశ ఉద్యమం ప్రారంభమైన తర్వాత 2001 నుండి కూడా అనేక వేదికల మీదా నా గానం వినిపించే అవకాశం కలిగింది. జానపద, ఉద్యమ గీతాలెన్నింటినో పాడాను. జై బోలో తెలంగాణ, పోరు తెలంగాణ చిత్రాల్లో నటించే అవకాశం కల్గింది. 80కి పైగా ఆల్బమ్‌లలో పాడాను. నా భర్త ఆరెల్లి దేవేందర్ ప్రోత్సాహంతో పాటు, నగారే కళా బృందం, సాంస్కృతిక సారథి ప్రోత్సాహమే ఈ రోజు నాకు అవార్డు రావడానికి కారణమని భావిస్తున్నా. అవార్డు రావడం వల్ల నాకు, నా పాటకు గుర్తింపు పెరుగుతుందన్న ఆశ ఉంది. నన్ను అవార్డుకు ఎంపికయ్యేలా ప్రోత్సహించిన సారథి చైర్మన్, మా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని పాటలు పాడే అవకాశం రావాలని కోరుకుంటున్నా.

అంతడుపుల ఝాన్సీ, గాయని, మానకొండూరు (జానపద సంగీతంలో రాణిస్తున్నందుకు గాను అవార్డు)

గ్రామాభివృద్ధే లక్ష్యం



గ్రామాభివృద్ధికి కృషి చేసినందుకు గాను మహిళా దినోత్సవం సందర్భంగా నన్ను అవార్డుకు ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉంది. గ్రామ ప్రజలు, నా భర్త మాజీ సర్పంచ్ జితెందర్‌రెడ్డి సహకారం, ప్రోత్సాహం మూలంగానే నన్ను ప్రభుత్వం గుర్తించింది. భవిష్యత్తులో గ్రామాభివృద్ధిలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేస్తా. అవార్డు ప్రకటించిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు.

ఇనుకొండ శైలజ, కొత్తపల్లి సర్పంచ్ (తిమ్మాపూర్ మండలం, కరీంనగర్ జిల్లా) (గ్రామాభివృద్ధికి గాను అవార్డు)

ప్రపంచ వ్యాప్తంగా శిష్యులున్నారు!



చాలా సంతోషంగా ఉంది. అసలు అవార్డు వస్తుందని నేను ఊహించలేదు. నేను పనిచేసిన నా డిపార్ట్‌మెంట్ పట్ల కృతజ్ఞతగా ఉన్నా. నేను భరతనాట్యం, కూచిపూడి కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేశా. ఐదు సంవత్సరాల నుంచి ఫీల్డ్‌లో ఉన్నాను. చిన్నప్పటి నుంచి నాకు డాన్స్ అంటే మక్కువ. దాంతో 40 సంవత్సరాల నుంచి కథక్, భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు నేర్చుకున్నా. రామ్‌కోఠి మ్యూజిక్ కాలేజ్ స్టూడెంట్‌ని. పెద్ద పెద్ద గురువుల దగ్గర డాన్స్ నేర్చుకున్నా. ఈ సందర్భంగా వారందరికీ నా పాదాభివందనం. నేను చదివిన కాలేజ్‌లోనే నేను డాన్స్ పాఠాలు బోధించా. మా ఆయన శ్రీనివాస్ గారు డాన్స్ డైరెక్టర్. ఆయన ప్రోత్సాహంతో డాన్స్ టీచింగ్‌లోకి వచ్చా. ఆయన స్థాపించిన అకాడమీలో నేను ఇప్పుడు డాన్స్ పాఠాలు చెబుతున్నా. ఆయన ప్రస్తుతం ఈలోకంలో లేకున్నా ఆయన ఆశయాన్ని ముందుకు నడిపించే దిశగా అడుగులు వేస్తున్నా. నా దగ్గర ఇప్పటి వరకు కొన్ని వందల మంది డాన్స్ నేర్చుకున్నారు. వాళ్లంతా ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలిస్తున్నారు. వాళ్లు కూడా అకాడమీలు స్థాపించుకున్నారు. ఆన్‌లైన్‌లో కూడా పాఠాలు చెబుతున్నారు. ఒక గురువుకి శిష్యుడు అభివృద్ధి చెందితేనే కదా ఆనందం. ఈ అవార్డు దక్కడం పట్ల నా బాధ్యత మరింత పెరిగిందనుకుంటున్నా. నాకు సపోర్ట్ చేసిన అందరికీ కృతజ్ఞతలు. తెలంగాణ ప్రభుత్వానికి నా ప్రత్యేక అభివందనాలు.

- మంజుల శ్రీనివాస్, క్లాసికల్ డాన్సర్

ప్రభుత్వానికి ధన్యవాదాలు



ప్రభుత్వం ప్రకటించిన అవార్డుతో నా బాధ్యత మరింత పెరిగిందని భావిస్తున్నాను. నాకు అవార్డు వస్తుందని అసలు ఊహించలేదు. చాలా ఆనందంగా ఉంది. నేను నా మూడేళ్ల వయస్సు నుండే పాటలు పాడడం, వివిధ పోటీల్లో పాల్గొనడం చేసేదాన్ని. కర్నాటక సంగీతం కూడా నేర్చుకున్నాను. నా తొలి గురువు అమ్మ రామాలక్ష్మి రంగచార్య. ఇప్పటి వరకు 1500లకు పైగా భక్తి పాటలు, 150 వరకు సినిమా పాటలు పాడాను. మహిళా దినోత్సవం సందర్భంగా మ్యూజిక్ విభాగంలో క్లాసిక్ మ్యూజిక్‌లో గాయనిగా గుర్తించి నన్ను అవార్డుకు ఎంపిక చేయడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

నిత్యసంతోషిని, గాయకురాలు, హైదరాబాద్

పెయింటర్ ఫ్యామిలీ!



ముఖ్యమంత్రి గారికి ముందుగా నేను కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నా. ఈ ప్రభుత్వం మహిళలను గుర్తించి అవార్డులు ఇస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. అందులో ఈ సంవత్సరం నా పేరు ఉండడం వల్ల మరింత సంతోషంగా అనిపిస్తున్నది. మాది పెయింటర్స్ ఫ్యామిలీ. అలాంటి కుటుంబంలో పుట్టినందుకు, ఈరోజు అవార్డును అందుకుబోతున్నదని తెలిసినందుకు నేను చాలా గర్వపడుతున్నా. అలాగే నాకు నేర్పించిన గురువులకు నా అభివాదాలు. వాళ్లే లేకపోతే నేనీ స్థాయిలో ఉండకపోయేదాన్ని. 14 సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు నేను పెయింటింగ్స్ వేయడం మొదలుపెట్టాను. జేఎన్టీయూలో 34 సంవత్సరాలుగా ఫైన్ ఆర్ట్స్ ఆర్కిటెక్చర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశా. నా బొమ్మల్లో తెలంగాణ గ్రామీణ నేపథ్యం కనిపిస్తుంది. ప్రత్యేకంగా ఇక్కడి వాళ్లు ధరించే నగలు, వారి అలంకరణ ప్రత్యేకంగా ఉంటుంది. పల్లె ప్రతిబింబించేలా నా పెయింటింగ్స్ ఉంటాయి. ఎక్కువ పనిచేసేవాళ్ల లైఫ్ స్టైల్ నా పెయింటింగ్స్‌లో చూడొచ్చు. నేను సిటీలో పుట్టి, పెరిగినా కూడా నాకు పల్లె వాతావరణం అంటే చాలా ఇష్టం. ఆ మక్కువతోనే ఈ పెయింటింగ్స్ వేస్తున్నా.

- కవితా దేవాస్కర్, ఆర్ట్

చాలెంజింగ్‌గా చేశా..



తెలంగాణ గవర్నమెంట్‌కి, మామిడి హరికృష్ణ, కవిత గారికి నా కృతజ్ఞతలు. అలాగే నా కుటుంబం మొత్తానికి నేను రుణపడి ఉన్నా. నా భర్త కూడా జర్నలిజం ఫీల్డ్‌లోనే ఉన్నారు. కానీ ఏ రోజు.. ఏ స్టోరీ గురించి ఆయన నాకు సహాయం అందించలేదు. పైగా నేను అందించను అని చెప్పేవారు. దాంతో చాలెంజింగ్‌గా తీసుకునేదాన్ని. పట్టుదలగా స్టోరీలు చేసేదాన్ని. ప్రజలకు సేవ చేయాలని అనుకొని సోషల్ వర్క్‌లోకి వచ్చాను. కానీ మాటలతో కాకుండా రాతలతో ఈ సమాజాన్ని మరింత మార్చవచ్చు అనుకున్నా. అందుకే ఈ ప్రొఫెషన్‌ని ఎంచుకున్నా. ఎవరు తప్పు చేస్తున్నారో వాళ్లని ఎత్తి చూపే అవకాశం వస్తుంది. ఈ వృత్తిలో ఎన్నో అటుపోట్లు ఎదుర్కొన్నా. ఎన్నో బెదిరింపులు వచ్చాయి. అన్నిటినీ తట్టుకొని ఈ రోజు నిలబడ్డాను.. కాబట్టే ఈ విజయం అందిందని అనుకుంటున్నా. నా వల్ల ఎవరూ బాధపడొద్దు.. కానీ బాగుపడాలని నిర్ణయించుకున్నా. అందుకే ఈ రంగంలో ఇంకా కొనసాగుతున్నా. ఎన్నో స్టోరీలు అందించా. ఒకరితో మాట్లాడినా, సినిమాకెళ్లినా, పార్కుకి వెళ్లినా.. ఏదో ఒక స్టోరీ దొరుకుతుందేమోననే వెతికేదాన్ని. అది చూసి చాలా మంది అసూయపడేవాళ్లు. ఎక్కడికి వెళ్లినా పని మీద ధ్యాస ఉంటుందని. కానీ ఈ రోజు వాళ్లందరూ నన్ను అభినందిస్తున్నారంటే.. నా శ్రమకు దక్కిన ఫలితమే కదా!

- లతాజైన్, జర్నలిస్ట్

రెహమాన్ కంటే ముందే ఆస్కార్!



తాజాగా ప్రకటించిన ఆస్కార్ అవార్డుల్లో మన దేశ చిత్రాలకు ఈ సారి కూడా నిరాశే ఎదురైంది. అయితే గతంలో రెహమాన్, గుల్జార్ కంటే ముందే.. కాస్ట్యూమ్ డిజైనింగ్‌లో మన దేశానికి చెందిన ఓ మహిళ ఆస్కార్ గెలుచుకున్నారు తెలుసా?

భాను అథైయా 1983లో విడుదలైన గాంధీ చిత్రానికి బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా ఆస్కార్ అందుకున్నారు. 2009లో వచ్చిన స్లమ్‌డాగ్ మిలీనియర్స్ సినిమాకు 26 ఏండ్ల ముందే ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆస్కార్‌ను భాను అథైయా గెలుకున్నారు. 1929 ఏప్రిల్ 28న జన్మించినది భానుమతి అన్నాసాహెబ్. వీరిది మహరాష్ట్రలోని కొల్హాపూర్. తండ్రి అన్నాసాహెబ్.. మంచి చిత్రకారుడు. తన తండ్రి నుంచి చిత్రలేఖనాన్ని వారసత్వంగా పొందారు భానుమతి. స్కూల్‌లో చిత్రకారిణిగా పేరు పొందిన భానుమతి.. ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశారు. అప్పుడే గోల్డ్‌మెడల్ కూడా సాధించారు. తర్వాత ఫ్రీలాన్స్ ఫ్యాషన్ ఇల్లస్ట్రేటర్‌గా పలు మ్యాగజైన్లకు పనిచేశారు. తండ్రి సూచనల మేరకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా మారి పలు బాలీవుడ్ సినిమాలకు పనిచేశారు. ఈ ప్రయాణంలో ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. సత్యేంద్ర అథైయాను పెండ్లి చేసుకున్నది. వీరికి ఓ కుమార్తె ఉన్నది.

ఈ మెడ నొప్పి ఎందుకు?

నా వయసు 28 సంవత్సరాలు. వారం రోజుల క్రితం నిద్రనుంచి మేల్కొనే సరికి మెడ నొప్పి ప్రారంభమైంది. అంతకు ముందు రోజు నిద్ర పోయే సమయం వరకు కూడా నాకు ఎలాంటి నొప్పి లేదు. అకస్మాత్తుగా మెడనొప్పితో నిద్ర మేల్కొన్నాను. నిద్రలో మెడ పట్టేసిందని, అదే తగ్గిపోతుందని మా అమ్మ అంటున్నది. తల కింద దిండు తీసేసి పడుకుంటున్నా ఏ ఫలితం కనిపించడం లేదు. కానీ నాకు ఈ నొప్పి భరించలేనంత ఎక్కువగా ఉంది. తల కొండంత బరువున్న భావన కలుగుతున్నది. ఏ పని చెయ్యలేకపోతున్నాను. నొప్పి భరించలేకపోతున్నాను. పడుకున్నా, కూర్చున్నా, నడుస్తున్నా నొప్పి మాత్రం యథా విధిగా ఉంటున్నది. అసలు ఇలాంటి మెడ నొప్పి ఎందుకు వస్తుంది? నా సమస్యకు మంచి పరిష్కారం చూపించగలరు.

సంతోష్, సంగారెడ్డి

అడుగండి చెబుతా



సాధారణంగా మెడ నొప్పి రావడానికి డిస్క్ ప్రొలాప్స్ కారణం అవుతుంది. ఇలా డిస్క్ ప్రొలాప్స్ అయినపుడు నొప్పి మెడ నుంచి భుజానికి లేదా చెతి చివరి వరకు పాకుతున్నట్టుగా ఉంటుంది. కానీ ఇది అకస్మాత్తుగా రాదు. కొద్దికొద్దిగా ఎక్కువవుతుంది. ఒక్కోసారి మెడ దగ్గరి డిస్క్‌లో చిన్న చిరుగు లాంటిది ఏర్పడినా కూడా మెడలో తీవ్రమైన నొప్పి వస్తుంది. ఇవేవీ కాకుండా కేవలం మెడ దగ్గర ఉన్న కండరాల్లో వచ్చే నొప్పి కూడా చాలా ఎక్కువగా ఉండి తల బరువంతా మెడ మోస్తున్న భావన కలుగుతుంది. బహుశా మీకు వచ్చిన మెడనొప్పి అలాంటిదే కావచ్చు. కొంత మంది సెలూన్‌లలో మసాజ్ చేయించుకుంటారు. ఇలా చెయ్యడం వల్ల ఒక్కోసారి కండరాల్లో నొప్పి మొదలవుతుంది. ఎత్తుగా ఉండే దిండు వాడడం వల్ల ఇలాంటి సమస్య వస్తుందని చాలా మంది అనుకుంటారు. కానీ నొప్పికి దిండు సైజ్‌కి ఎలాంటి సంబంధం లేదు. కాబట్టి మీరు దిండు తీసేసి పడుకున్నా, కింద పడకున్నా ఎలాంటి ఫలితం కనిపించదు. మెడనొప్పి రెండు రోజుల్లో తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. 3-5 రోజల పాటు మందులు వాడుతూ, 48-72 గంటల పాటు కాలర్ వాడాల్సి రావచ్చు. పెద్దగా కంగారు పడాల్సిన పని లేదు.



డాక్టర్ జి.పి.వి. సుబ్బయ్య
సీనియర్ స్పైన్ సర్జన్
స్టార్ హాస్పిటల్స్
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
సంకేత
[హైదరాబాద్]
బుధవారం 7 మార్చి 2018
టెక్నాలజీ 2.0

నయామాల్



మొబైల్ రంగంలో అతి తక్కువ కాలంలోనే మంచి ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకున్నది అసస్ కంపెనీ. ఆ తర్వాత లాప్‌టాప్‌లతో కస్టమర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. ఆ కోవలోనే మరో కొత్త లాప్‌టాప్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దానిలో ఫీచర్లు ఇవిగో..

అసస్ జెన్‌బుక్ ఫ్లిప్ 14

360 డిగ్రీల కోణంలో ఎటువైపైనా ఫ్లిప్ చేసుకోగల సౌకర్యం ఈ లాప్‌టాప్‌కి ఉంది. ఈ లాప్‌టాప్ మీద రాసుకునేందుకు వీలుగా టచబుల్ పెన్ కూడా ఇచ్చారు. ఎనిమిదవతరం ఇంటెల్ కోర్ అప్‌డేటెడ్ వెర్షన్‌తో ఐ7 క్వాడ్ కోర్ ప్రాసెసర్, నివిడా జీఫోర్స్, ఎంఎక్స్ 15 గ్రాఫిక్స్, జెన్‌బుక్ ఫ్లిప్ 14పేరుతో ఈ లాప్‌టాప్ మార్కెట్లోకి విడుదల చేశారు. వేగంగా స్పందించే టెక్నాలజీతో ఈ లాప్‌టాప్ రూపొందించారు. ఎలా కావాలంటే అలా ముడుచుకొని పనిచేసుకోవచ్చు. స్ట్రెస్ బస్టింగ్ రిలాక్సేషన్ మోడ్ ఈ లాప్‌టాప్ ప్రత్యేకత. 13.9 మిల్లీమీటర్ మందం, 1.4 కేజీల బరువుతో మెటల్ డిజైన్ చేశారు. 360 డిగ్రీల కోణంలో ఎటువైపైనా తిప్పుకోగల స్పెషాలిటీ ఉన్న ఈ లాప్‌టాప్ దాదాపు 20వేల సార్లు టెస్ట్ చేసి నిర్ధారించారు. 16 జీబీ ర్యామ్, 512 జీబీ ఇంటర్నల్ మెమొరీ ఉన్నాయి. మైక్రోఎస్డీ కార్డు, యూఎస్‌బీ పోర్టు, హెచ్‌డీఎంఐ, సీ టైప్ యూఎస్‌బీలను కనెక్ట్ చేసుకోవచ్చు. దీని ధర రూ. 84,428గా నిర్ణయించారు.



జూక్.. మ్యూజిక్!

ఒకప్పుడు పాటలు వినాలంటే టేప్‌రికార్డర్లుండేవి. ఆ తర్వాత సీడీ, డీవీడీ ప్లేయర్లు. కాస్త అప్‌డేట్ అయిన తర్వాత మొబైల్స్, వాటికి హెడ్‌ఫోన్లు వచ్చాయి. ఆ తర్వాత వైర్లు లేకుండానే బ్లూటూత్‌తో మ్యూజిక్ ఎంజాయ్ చేసే సదుపాయం వచ్చింది. ఇప్పుడు సౌరశక్తితో మ్యూజిక్ ఎంజాయ్ చేసే రోజులొచ్చేశాయ్!

సోలార్ విద్యుత్ వినియోగం పెరిగిన తర్వాత ఇంటికి వెలుగులు మాత్రమే కాదు.. అనేక రకాలుగా సౌరశక్తిని ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు తాజాగా ఓ మ్యూజిక్ స్పీకర్‌ని కూడా తయారుచేశారు. జూక్ అనే కంపెనీ సోలార్ చార్జింగ్‌తో పనిచేసే మ్యూజికల్ స్పీకర్‌ని రూపొందించింది. జూక్ రాకర్ ఆర్మర్ ఎక్స్‌ఎల్, జూక్ జెడ్‌బీ జాజ్ బ్లాస్టర్ బ్లూటూత్ పేర్లతో రెండు సోలార్ మ్యూజిక్ స్పీకర్లను మార్కెట్లోకి విడుదల చేసింది. కేవలం మ్యూజిక్ మాత్రమే కాదు.. ఇందులో చిన్న టార్చిలైటు కూడా ఉంది. స్పీకర్‌కి పైభాగంలో ఉండే సోలార్ ప్యానెల్‌కి ఎండ తగిలేలా పది నిమిషాలు పెడితే 30 నిమిషాల వరకు మ్యూజిక్ ఎంజాయ్ చేయొచ్చు. ఒక్కసారి ఈ సోలార్ స్పీకర్ల బ్యాటరీ ఫుల్ చేస్తే.. దాదాపు 30 గంటల వరకు సంగీతాన్ని ఆస్వాదించవచ్చు. కేవలం సోలార్‌తో మాత్రమే కాదు.. కరెంటుతో కూడా కేబుల్ సాయంతో ఈ స్పీకర్లను చార్జ్ చేయవచ్చు. ఈ రెండు స్పీకర్లూ వాటర్‌ప్రూఫ్‌తో రూపొందించనవే కావడం విశేషం. ప్రస్తుతం మార్కెట్లో ఈ స్పీకర్ల ధర రూ. 4,999 వరకు ఉంది. బ్లూటూత్ ఆన్‌చేసి మాత్రమే కాకుండా.. ఆక్స్ కేబుల్ ద్వారా కూడా పాటలు వినొచ్చు.

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గత ప్రభుత్వాలు ప్రతీ పనిని కంప్యూటరైజ్ చేశాయి. అంతవరకూ బాగానే ఉన్నా.. ప్రతి పనికీ ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగాల్సి వచ్చేది. ఈ క్రమంలో పౌరులకు సమయం, ధనం వృథా అయ్యేది. అయితే తెలంగాణలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ–గవర్నెన్స్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పాలనను ప్రజలకు చాలా దగ్గర చేసింది. పౌరులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా.. యాప్‌ల రూపంలో అన్ని సేవలనూ అరచేతిలోకి తెచ్చిపెట్టింది. ఇక తాజాగా ఆవిష్కరించిన 'టీ యాప్ ఫోలియో'తో 150 రకాల సేవలను పొందవచ్చు..

ఒక్కటి కాదు వందకాదు.. ఒక్క యాప్‌తో దాదాపు 150 సేవలను సులభంగా పొందవచ్చు. ప్రజలకు విశిష్ట సేవలందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పాలనలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. టెక్నాలజీని ఆధారం చేసుకొని ఈ–గవర్నెన్స్‌కు కొత్త అర్థాన్ని చూపెట్టింది. ఇటీవల ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆవిష్కరించిన ఈ 'టీ–యాప్ ఫోలియో'తో ఇంట్లో కూర్చొనే 150 రకాల ప్రభుత్వ సేవలను పొందవచ్చు. 'టెక్నాలజీ ఎన్ని కొత్త పుంతలు తొక్కినా సామాన్యులకు ఉపయోగపడకపోతే లాభముండదని' సీఎం కేసీఆర్ చెప్పారని మంత్రి గుర్తు చేశారు. 'అందుకే సాంకేతికతను ప్రజలకు చేరువ చేసి.. మెరుగైన సేవలను అందిస్తున్నాం' అని యాప్ ఆవిష్కరణ సందర్భంగా పేర్కొన్నారు. పాలన ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించింది ప్రభుత్వం.. అతి త్వరలోనే ఈ యాప్ ద్వారా 600 వరకూ సేవలను అందివ్వనున్నది. మరింకెందుకు ఆలస్యం చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్న తెలంగాణ పౌరులు దీనిని ఇన్‌స్టాల్ చేసుకొని ప్రభుత్వ సేవలను ఉచితంగా పొందండి.



ఒక్క యాప్... 150 సేవలు

డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ చాలా సులువు..

'టీ యాప్ ఫోలియో' ఆండ్రాయిడ్ వెర్షన్‌లో లభిస్తున్నది. దీనిని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆండ్రాయిడ్ 4.0 ఆ పైన వెర్షన్ కలిగిన ఓఎస్ డివైస్‌ల్లో మాత్రమే ఈ యాప్ ఇన్‌స్టాల్ అవుతుంది. దీని సైజ్ కూడా తక్కువే. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత.. ఓపెన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలి. మొబైల్ నెంబర్, ఈ–మెయిల్ ఐడీ లేదా ఫేస్‌బుక్, జీమెయిల్ నుంచి కూడా రిజిస్టర్ కావొచ్చు. ఆప్షన్స్ నింపిన తర్వాత యూజర్ ఫోన్‌కు ఓ ఎంపిన్ ఓటీపీ రూపంలో వస్తుంది. దాన్ని ఎంటర్ చేసి లాగిన్ అవ్వాలి. ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ఏదైనా ఒకటి ఎంపిక చేసుకోవాలి. తర్వాత మీకు ఏ సేవలు అవసరమో యాప్ నుంచి తెలుసుకొని, ఆయా సేవలను ఇంట్లో కూర్చొనే పొందవచ్చు.

బిల్లుల చెల్లింపులు



పోస్ట్‌పెయిడ్–ప్రీపెయిడ్ మొబైల్ రీచార్జ్‌కు సంబంధించి అన్ని టెలికాం నెట్‌వర్క్‌లు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్ ద్వారా మొబైల్ రీచార్జ్ ఈజీగా చేసుకోవచ్చు. ల్యాండ్‌లైన్‌కు సంబంధించి ఎయిర్‌టెల్, టాటా, బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌ల బిల్లులు కూడా చెల్లించుకోవచ్చు. వీటితో పాటుగా ఇంటర్‌నెట్ బిల్లులు, డీటీహెచ్, డేటాకార్డ్ రీచార్జ్‌లు చేసుకోవచ్చు.

వాతావరణం

ఈ విభాగంలో ప్రస్తుతం మీరు ఎక్కడ ఉన్నారో.. ఆ లొకేషన్ ఆధారంగా అక్కడి వాతావరణం, ఉష్ణోగ్రత, గాలి, తేమ వంటి వివరాలు తెలుసుకోవచ్చు.



దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలు



రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు సంబంధించి అడంగల్ / పహాణీ, ఆర్వోఆర్–1బీ, మ్యుటేషన్/ ఈ–పట్టాదారు పాసుపుస్తకం, ఎఫ్‌ఎంబీ పత్రం దరఖాస్తు, తాకట్టు భార ధ్రువపత్రం, ఇనాం భూముల స్వాధీనత హక్కు ధ్రువీకరణ, రిజిస్ట్రేషన్ దస్తావేజు పత్రాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు అందించే పలు రకాల ఆదాయ, కుల, నివాస, ఓబీసీ, ఇబీసీ, కుటుంబ సభ్యుని ధ్రువీకరణ, జనన, మరణ సర్టిఫికెట్లను ఈ యాప్ ద్వారా పొందచ్చు. ఇంకా పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలకు సంబంధించిన ఎన్‌ఓసీ సర్టిఫికెట్ కూడా ఈ యాప్ ద్వారా పొందవచ్చు.



సమాచార సేవలు

ఇందులో చాలా విభాగాలకు సంబంధించిన సేవలను పొందుపర్చారు. తెలంగాణ రాష్ట్రపోర్టల్, జీహెచ్‌ఎంసీ, పర్యాటకం వెబ్‌సైట్‌లను ఇక్కడి నుంచే ఓపెన్ చేసుకోవచ్చు. మెట్రోరైల్‌కు సంబంధించి రైళ్ల సమయసూచిక, మార్గం వివరాలు, చార్జీలు వంటివి తెలుసుకోవచ్చు. మీ సమీప ప్రాంతంలోని మీసేవా కేంద్రాలు, వైఫై కేంద్రాలు, చౌక ధరల దుకాణాల వివరాలు తెలుసుకోవచ్చు. మరీ ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఎక్కువ సమాచారం అందించే దిశగా.. వ్యవసాయ యాంత్రీకరణ మార్గ దర్శకాలు, యంత్రాల సబ్సిడీ నమూనా, యంత్రీకరణ ధరల వివరాలు ఇందులో పొందుపర్చారు.

రవికుమార్ తోటపల్లి





రోడ్డు రవాణా

రవాణాశాఖ పరిధిలోని కొత్త లైసెన్స్ స్లాట్ బుకింగ్, డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ ఫీజు, లైసెన్స్ పునరుద్ధరణ, డూప్లికేట్ లైసెన్స్, బ్యాడ్జి వంటి సేవలు పొందవచ్చు. కొత్త లెర్నర్ లైసెన్స్ పరీక్ష స్లాట్ బుకింగ్, లెర్నర్ లైసెన్స్ ఫీజు, రీ–టెస్ట్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటుగా లైఫ్ ట్యాక్స్, ట్రాఫిక్ చలాన్ కూడా చెల్లించవచ్చు. రోడ్డు, ట్రాఫిక్ విభాగానికి సంబంధించి సులభతరమైన సేవల కోసం 'ఆర్‌టీఏ ఎం వాలెట్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొనే వెలుసుబాటు కల్పించింది.



టీ-వాలెట్

డిజిటల్ చెల్లింపులకు పునాది అయిన రక్షిత 'టీ–వాలెట్' యాప్‌ను ఇక్కడ నుంచే డౌన్‌లోడ్ చేసుకొనే వెసులుబాటు కల్పించారు. దీని ద్వారా రాష్ట్రంలో ఎవరైనా, ఎక్కడినుంచైనా నగదును చాలా సులువుగా అవతలి వ్యక్తులకు పంపవచ్చు. ఈ యాప్ వల్ల బ్యాంకులు, ఏటీఎంల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం ఉండదు. ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకొని లక్ష రూపాయల వరకూ బదిలీ చేసుకోవచ్చు.

మరికొన్ని సేవలు

పైన యాప్ పేరు పక్కనే ఉన్న సెట్టింగ్స్‌లోకి వెళ్లి మీ ప్రొఫైల్ మార్చుకోవచ్చు, మీరు ఎన్ని లావాదేవీలు నిర్వహించారో తెలుసుకోవచ్చు, మీ దరఖాస్తుకు సంబంధించిన ప్రస్తుత స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు. సెట్టింగ్స్‌లోకి వెళ్లి మీ ఎంపిన్, కొత్త ఎంపిన్, భాషను మార్చుకోవచ్చు. అత్యవసర సేవలకు సంబంధించిన ఆయా నెంబర్లను సంప్రదించి సేవలను పొందవచ్చు. నిబంధనలు, షరతులు, రహస్య విధానం, రీఫండ్ పాలసీ, యాప్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు.

ఇతర సేవలు

ఈ విభాగంలో బస్సురూట్లు, ట్రాఫిక్ చలాన్, విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన 'టాస్క్', ఐసీఐసీఐ బ్యాంక్ సేవలు, కొత్త ఖాతా తెరిచే విధానం, పొదుపు ఖాతా, రుణాలు, క్రెడిట్ కార్డుల వంటి సేవలను పొందవచ్చు.



బుకింగ్స్

ఈ విభాగం దైవదర్శనానికి సంబంధించినది. మన రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలైన భద్రాచలం సీతారామచంద్ర స్వామి, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయాల సేవలు, వసతి బుకింగ్ సౌకర్యం దీని ద్వారా పొందొచ్చు. బుకింగ్స్ విభాగం క్లిక్ చేయగానే ఆయా ఆలయాలకు సంబంధించిన సేవ బుకింగ్, రూమ్స్ బుకింగ్ చేసుకోవచ్చు.

పన్నులు

ఈ విభాగంలో ప్రస్తుతం జీహెచ్‌ఎంసీకి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లించే ఆప్షన్ మాత్రమే ఉన్నది. హైదరాబాద్ మహానగరంలో నివసించే పౌరులు ఇంటి పన్నును చెల్లించాలంటే పన్నుల విభాగంలోకి వచ్చి మీ సర్కిల్‌ను ఎంపిక చేసుకొని అసైన్‌మెంట్ సంఖ్య ఎంటర్ చేసి.. ఆస్తి పన్నును చెల్లించాల్సి ఉంటుంది. దీని ద్వారా గంటల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం నగర పౌరులకు తప్పింది. అయితే అతి త్వరలో ఈ విభాగంలో రాష్ట్రస్థాయి సేవలను కూడా కలుపనున్నారు.



స్మార్ట్‌ఫోన్ ఇలా వాడండి..

స్మార్ట్‌ఫోన్ వాడేవారు చాలామంది ఉంటారు కానీ స్మార్ట్‌గా వాడడం తెలిసిన వారు తక్కువగా ఉంటారు. మీరూ స్మార్ట్‌ఫోన్ వాడకందారులేనా ? అయితే మీకే ఈ స్మార్ట్‌టిప్స్.

1. ఎప్పుడూ మీ స్మార్ట్‌ఫోన్ చేతిలోనే పట్టుకొని ఉండకండి. ఫ్యామిలీతో, ఫ్రెండ్స్‌తో బయటకు వెళ్లినప్పుడు సైలెంట్‌లో పెట్టి జేబులో పెట్టేసుకోండి.
2. రోడ్ల మీద నడుస్తున్నప్పుడూ, జర్నీలో ఉన్నప్పుడు వీలైనంత వరకూ ఫోన్ మాట్లాడడం తగ్గించుకోండి.
3. ఆఫీస్‌లో, మీటింగ్ టైంలో ఫోన్ సైలెంట్ మోడ్‌లో పెట్టండి. వీలయితే స్విచ్ఛాఫ్ చేయండి.
4. చాలారోజుల తర్వాత ఫోన్ చేసే మీ బంధువుల ఫోన్ తప్పకుండా ఆన్సర్ చేయండి. ఒకవేళ కుదురకపోతే మీరు ఫ్రీ అయ్యాక వెంటనే తిరిగి కాల్ చేయండి. పని కంటే బంధం ముఖ్యం కదా !
5. విశ్రాంతి సమయంలో ఫోన్ అవసరమా ? అందుకే... విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు మీ ఫోన్ స్విచ్ఛాఫ్ చేయండి. లేదా ఫ్లైట్ మోడ్‌లో పెట్టేయండి.
6. మీ రింగ్‌టోన్ మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. అందుకే మంచి రింగ్‌టోన్ సెట్ చేసుకోండి. ఎక్కువ సౌండ్ వచ్చేవి పెట్టుకోకపోవడమే మంచిది.
7. క్యూలైన్‌లో ఉన్నప్పుడు, వెయిటింగ్ చేస్తున్నప్పుడు గేమ్స్ ఆడితే గేమ్‌సౌండ్ ఆఫ్‌లో ఉంచి ఆడండి. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ఉంటుంది.


అలా చేస్తే క్యాన్సర్ రావొచ్చు!?

స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలా మంది అదే లోకంగా దానితోనే గడుపుతుంటారు. ఎక్కడికెళ్లినా ఫోన్ వదులరు. ఆఖరికి పడుకునేటప్పుడు కూడా ఫోన్ పక్కన ఉండాల్సిందే. అలాంటి వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



- స్మార్ట్‌ఫోన్ నుంచి విడుదలయ్యే రేడియో తరంగాలకు వీలైనంత దూరంగా ఉండాలి.
- చార్జింగ్ పెట్టుకొని ఫోన్ మాట్లాడడం వల్ల అధికస్థాయిలో రేడియేషన్ విడుదలవుతుంది. అప్పుడు పొగలు రావడం, ఫోన్ పేలి పోవడం జరుగుతుంది.
- అధిక రేడియేషన్ వల్ల తీవ్రమైన అనారోగ్యాలు వస్తాయని హెచ్చరిస్తున్నారు.
- మొబైల్ రేడియేషన్ వల్ల వచ్చే అతి పెద్ద ప్రమాదాల్లో ఒకటి క్యాన్సర్.
- ఇప్పటికే చాలామంది స్మార్ట్‌ఫోన్ వాడకందారులు క్యాన్సర్ బారినపడినట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి.
- దీంతో పలు మొబైల్ కంపెనీలు మొబైల్ డివైజ్‌లతో పాటు ఇచ్చే సెట్‌లో హెచ్చరిస్తున్నారు. మనం అవేం చదువం కాబట్టి తెలియదు.
- ఫోన్ ఎక్కువగా మాట్లాడడం వల్ల వినికిడి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి.
- సాధ్యమైనంత వరకూ స్మార్ట్‌ఫోన్ వాడకానికి చాలా దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

నమస్తే తెలంగాణ
యువ
[హైదరాబాద్]
బుధవారం 7 మార్చి 2018

బంటీ విరాట్.. బబ్లీ అనుష్క!

'కజ్‌రారే కజ్‌రారే తేరె కారే కారే నైనా' ఈ సాంగ్ ఎంత ఫేమసో తెలుసు కదా? ఎప్పుడు విన్నా.. చూసినా ముచ్చటగొలిపే పాట ఇది. అమితాబ్ బచ్చన్.. అభిషేక్ బచ్చన్.. ఐశ్వర్యారాయ్ బచ్చన్ కలిసి ఆడిపాడి ఉర్రూతలూగించిన సాంగ్ ఇది. ఈ పాట మళ్లీ ఇప్పుడు వైరల్ అవుతున్నది.

బంటీ ఔర్ బబ్లూ సినిమాలోని ఈ వీడియో సాంగ్ ఇప్పుడెందుకు వైరల్ అవుతుందో తెలుసా? విరాట్ కోహ్లీ వల్ల. సౌతాఫ్రికా టూర్లో ఉన్న విరాట్ కోహ్లీ తన భార్య అనుష్క శర్మను తీసుకొని వెళ్లారు. అయితే వెళ్తూ వెళ్తూ ఓ స్నేహితుడి వివాహానికి హాజరైన కోహ్లీ అక్కడి బారాత్‌లో ఎంజాయ్ చేశాడట. అనుష్కను పట్టుకొని డ్యాన్స్‌ల మీద డ్యాన్స్‌లు చేశాడట. బంటీ ఔర్ బబ్లూ సినిమాలో బచ్చన్స్ చేసినట్టుగా కాలు పైకి లేపి 'కజ్‌రారే కజ్‌రారే' అంటూ డ్యాన్స్ చేయడంతో ఇప్పుడు అది యూట్యూబ్‌లో వైరల్‌గా మారింది. ఎప్పుడూ క్రికెట్ బ్యాట్‌తో.. వికెట్ల మధ్య పరుగులు తీసే కోహ్లీ ఇలా ఆటవిడుపుగా అన్నీ మర్చిపోయి హాయిగా చిందులేయడం అభిమానులకు నచ్చేసింది. దీనిని ఒకరెనక ఒకరు షేర్లు చేస్తుండటంతో సోషల్‌మీడియా మొత్తం విరాట్ కజ్‌రారే సాంగే వినిపిస్తుందట!



తాత.. తండ్రి ఆర్మీలో పనిచేశారు.
తానూ ఆర్మీలో చేరుదామని ఓ యువకుడు కలగన్నాడు!
కానీ విధి వంచించి..
తాత.. తండ్రి అకాల మరణం చెందారు!
అతని కల కలగానే మిగిలిపోయింది!
చెల్లికి.. అతనికి పూటకింత తిండి సంపాదించేందుకు
హైదరాబాద్ గల్లీల్లో పూల బొకేలు అమ్మాడు!
సైకిల్‌పై తిరుగుతూ గిఫ్ట్స్ మార్కెటింగ్ చేశాడు.
బాడీ బిల్డింగ్‌పై దృష్టి సారించి చాంపియన్‌గా నిలిచాడు.
తర్వాత ఆర్మీలో పనిచేసేవారికి
ఫిట్‌నెస్ పాఠాలు బోధించే స్థాయికి ఎదిగాడు!



చాంపియన్ నా కల

బాడీ బిల్డింగ్‌లో నెంబర్ వన్‌గా నిలవాలన్నది నా కల. చిన్నప్పట్నుంచి దీని కోసం ఎంతో కష్టపడ్డా. ఎన్ని అడ్డంకులొచ్చినా పడి లేస్తూ ఉన్నా లక్ష్యం మాత్రం గురి తప్పలేదు. ఇకపై నా ప్రతిభకు మరింత సానపెట్టి చాంపియన్‌గా నిలుస్తా. దానికి అందరి సహకారమూ కావాలి.
షఫీ సమీ

బొకేలు అమ్మిన యువకుడు.. ఆర్మీ ఫిట్‌నెస్ ట్రైనర్!

అతని పేరు మహ్మద్ షఫీ సమీ. హైదరాబాద్‌లో ఉన్న ప్రముఖ ఫిట్‌నెస్ ట్రైనర్లలో అతడూ ఒకడు. అట్టడుగు స్థాయి నుంచి ఎదిగి అందరికీ సుపరిచితుడు. 15 ఏళ్ల వయసులో దిక్కుతోచనిస్థితిలో కార్వాన్ గల్లీల్లో తిరిగిన ఆ యువకుడు స్వయంగా ఎదిగి బాడీ బిల్డింగ్‌లో రాణిస్తున్నాడు. టాలెంట్‌కు పేదరికం.. వనరుల లేమి వంటివేవీ అడ్డురావని నిరూపిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఆర్మీ నేపథ్యం..
షఫీ వాళ్ల నాన్న.. తాత ఇండియన్ ఆర్మీకి సేవలందించారు. వాళ్లది రెజ్లింగ్ బ్యాక్‌గ్రౌండ్. తాతల తండ్రుల కాలం నుంచి రెజ్లర్లుగా రాణిస్తున్నారు. బాడీ బిల్డింగ్‌లో కూడా వాళ్లది పేరున్న కుటుంబమే. వెనుకటి రోజుల్లో వ్యాయామశాలలు మనుగడలో ఉండి మల్లయుద్ధాలకు ప్రాధాన్యత ఉన్న సమయాల్లో ఆ రంగంలో షఫీ పూర్వీకులది ప్రముఖ స్థానం ఉండేది. ఆ క్రమంలోనే ఫిట్‌నెస్‌పై దృష్టిసారించిన షఫీ వాళ్ల తాత ఆర్మీలో చేరాడు. తండ్రిబాటలోనే షఫీవాళ్ల నాన్న కూడా నడిచి ఆర్మీలో చేరారు.

చిన్నతనంలోనే బాధ్యత..
తాను ఆర్మీలో చేస్తున్నప్పటికీ పిల్లల్ని ఆదర్శభావాలతో ఉండేలా ప్రోత్సహించాలని వాళ్ల తండ్రి షఫీని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించారు. పదో తరగతి వరకు కార్వాన్ పరిసరాల్లోనే సాగింది. షఫీ అమ్మానాన్నలు అతనికి 15 ఏండ్లున్నప్పుడే చనిపోయారు. షఫీ.. అతని చెల్లెలు. ఇద్దర్నీ గ్రాండ్ పేరెంట్స్ చేరదీశారు. కానీ ఆ తర్వాత కొంత కాలానికి గ్రాండ్ పేరెంట్స్ కూడా అకాల మరణం చెందడంతో షఫీ భవిష్యత్ సంక్షోభంలో పడింది. తండ్రిలాగా ఆర్మీలో చేరి దేశ సేవందిద్దామనుకున్న అతడికి చిన్నప్పుడే బాధ్యతలు మీద పడటంతో ఆశయలు అడియాసలయ్యాయి.

గల్లీల్లో బొకేలమ్ముతూ..
బాధ్యతలు మీదపడటంతో షఫీకి భవిష్యత్ అంతా శూన్యంగా కనిపించింది. ఏం చేయాలి? చదువెలా? చెల్లెలి భవిష్యత్ ఏంటి? అని ఆలోచించడం మొదలుపెట్టాడట. అలా ఉపాధికోసం వెతుకుతున్న సమయంలో గిఫ్ట్ మార్కెటింగ్ తారసపడింది. పూట గడవడం కోసం సైకిల్‌పై తిరుగుతూ గిఫ్ట్ ఆర్టికల్స్ అమ్మేవాడు. అలా చేయగా రోజుకు ఇరవై రూపాయలు వచ్చేవి. ఇంతటితోనే ఆగిపోదామా? అని దీర్ఘంగా ఆలోచించి బాడీ బిల్డింగ్‌పై మళ్లీ మనసు పడ్డాడు. కష్టాలు అందరికీ ఉంటాయి. వాటిని అధిగమిస్తూ ఒక్కో మెట్టు ఎక్కుతూ పోవాలి తప్ప.. వాటిని చూస్తూ కృంగిపోవద్దని ఆత్మస్థైర్యం తెచ్చుకున్నాడు. బాడీ బిల్డింగ్‌లో రాణించాలి అనేది అతని కల. ఇంకోటి తన ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కూడా అంతా బాడీ బిల్డర్సే కావడంతో ఎలాగైనా ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలని కలగన్నాడు. ఒకవైపు కుటుంబపోషన కోసం గల్లీ గల్లీ తిరుగుతూ బొకేలు సప్లయ్ చేస్తూనే బాడీ బిల్డింగ్‌పై దృష్టిసారించాడు. అప్పుడు అతని వయసు15 సంవత్సరాలు. మజిల్‌పవర్ జిమ్‌లో ప్రాక్టీస్ చేసేవాడు. పగలు పనిచేస్తూ సాయంత్రం జిమ్‌కు వెళ్లేవాడు. బాడీ బిల్డింగ్ అంటే ఏంటి? బాడీని ఎలా బిల్డప్ చేసుకోవాలి? ఏ ఆహారం తీసుకోవాలి? వంటి విషయాలు తెలుసుకునేందుకు బాడీ బిల్డింగ్ మ్యాగజైన్స్ చదివేవాడట.



చాంపియన్ కావాలని..
షఫీ కష్టం చూసిన ట్రైనర్ భాస్కర్‌రెడ్డి చాలా సహకారం అందించారు. షఫీకి గురువుగా మారి లక్ష్యం దిశగా అతన్ని ప్రేరేపించారు. బాడీ బిల్డింగ్ అనేది సరైన గైడెన్స్ లేకపోతే సాధ్యం కాదు కాబట్టి భాస్కర్‌రెడ్డి శిష్యుడిని నిరంతరం మోటివేట్ చేసేవారు. సరైన దిశలో గైడ్ చేసేవారు. ఆయన ప్రోత్సాహంతోనే మొదటగా స్థానిక పోటీల్లో పాల్గొని సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. విజయం సాధిస్తే కలిగే సంతోషం.. పొందే సంతృప్తి షఫీని మరింత ముందుకు నడిపించింది. బాడీ బిల్డింగ్‌లో గెలుపొందిన షఫీని ప్రజలు విపరీతంగా అభిమానించడం.. ఫొటోలు తీసుకోవడం చూసి బాడీ బిల్డింగ్‌లో చాంపియన్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. షఫీకి ఆశ.. ఆశయం రెండూ ఉండటంతో ఎలాగైనా అతడికి మంచి మార్గం చూపించాలని భాస్కర్‌రెడ్డి నిశ్చయించుకున్నాడట. అందుకోసమే షఫీ లక్ష్యాన్ని తన లక్ష్యంగా భావించి బాడీ బిల్డింగ్‌లో అతడిని మరింత రాటుదేలేలా చేయగలిగారు.



ట్రైనర్‌గా తొలి అవకాశం
షఫీ ప్రతిభను గుర్తించి మొదటగా హైటెక్ జిమ్‌లో ట్రైనర్‌గా తీసుకున్నారు. ట్రైనర్‌గా ఇదే మొదటి అవకాశం. రోజూ వందల మందికి గైడెన్స్ ఇచ్చేవాడు. 2005లో తొలిసారి రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. మిస్టర్ ఆంధ్రప్రదేశ్ పోటీల్లో పాల్గొన్నాడు. 2006లో మిస్టర్ సౌత్ ఇండియాలో పాల్గొని 75కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో మూడవ స్థానం దక్కించుకున్నాడు. బాడీ బిల్డింగ్‌పై ఆశలు పెట్టుకున్న షఫీని ఈ విజయం మరింత ముందుకు తీసుకెళ్లిందని చెప్పొచ్చు. అతని జీవితంలో ఇది మర్చిపోలేని విజయంగా షఫీ అంటున్నాడు. తర్వాత మిస్టర్ తెలంగాణ, మిస్టర్ హైదరాబాద్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. కెరీర్ మంచి గ్రాఫ్‌లో ఉన్నప్పుడు అమెరికాలో ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేసేందుకు అవకాశం వచ్చింది. ఆ సమయంలో షఫీని ఇంటర్వ్యూ చేసిన ఆర్మీ బాడీ బిల్డర్ రంజన్‌రెడ్డి ద్వారా పరిచయం ఏర్పడింది. అతడు ఈ రంగంలో పేరుమోసిన వ్యక్తి. షఫీకి అనేక మెలకువలు నేర్పాడు.

ఆర్మీ ఫిట్‌నెస్ ట్రైనర్‌గా..
రంజన్‌రెడ్డి పరిచయం షఫీ మార్గాన్ని మలుపు తిప్పింది. డబ్బుల కోసమే కాకుండా నలుగురూ చెప్పుకోవడానికి తనకంటూ ప్రత్యేకత ఏంటి? అనే ఆలోచన అప్పుడే మొదలైంది షఫీకి. తనకు ఎలాగూ ఆర్మీలో చేరాలనే ఆశ ఉంది కాబట్టి వాళ్లకు సేవచేసే అవకాశమేదైనా ఉందా అని అన్వేషించసాగాడు. తన తండ్రి.. తాత కూడా ఆర్మీలో సర్వీస్ చేశారు కాబట్టి షఫీకి ఆర్మీ అంటే చాలా ఇష్టం. తాను కూడా ఆర్మీలో చేరి దేశసేవ చేయాలన్నది చిన్నప్పట్నుంచే ఆశయంగా ఏర్పరచుకున్న షఫీకి ఫయాజ్ అనే స్నేహితుడి సహకారం వల్ల ఇండియన్ ఆర్మీలో కొంతమందికి ఫిట్‌నెస్ పాఠాలు బోధించే అవకాశం లభించింది. దేశానికి హీరోలైన ఆర్మీ వారికి ఫిట్‌నెస్ సూత్రాలు చెప్పడం అదృష్టంగా భావించాడు. ఆర్మీ మేజర్.. కల్నల్‌తో సహా యూనిట్ మొత్తానికి 14 నెలల పాటు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేశాడు షఫీ.



సెలబ్రిటీలకు కూడా..
ఆర్మీ ఫిట్‌నెస్ ట్రైనర్‌గా చేస్తున్న సమయంలో కొన్ని ఆర్థిక సమస్యలొచ్చాయి. వాటిని చక్కదిద్దుకునేందుకు పూర్తిస్థాయిగా కాకుండా ఫ్రీలాన్స్ ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఆర్మీకి పనిచేస్తున్నాడు. సెలబ్రిటీలకు ఫిట్‌నెస్ ట్రైనర్‌గా చేయాలనే ఆలోచనతో ముంబై వెళ్లాడు. బిషు అధికారి, అభిజిత్ వంటి బాలీవుడ నటులకు ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేశాడు. ఒకవైపు ఫ్రీలాన్స్ ట్రైనర్‌గా చేసుకుంటూనే మరోవైపు ఆధునిక హంగులతో కొత్త జిమ్ ప్రారంభించాడు. తర్వాత కొన్ని ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో కొంతకాలం డిస్టర్బ్ అయినప్పటికీ మళ్లీ పునరుత్తేజంతో 'ఎరా ఆఫ్ 24 A/7 A ఫిట్‌నెస్ యూనిసెక్స్ జిమ్ ఏర్పాటుచేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.

నల్లపూసల ట్రెండ్!

ఫ్యాషన్ ప్రపంచంలో రోజుకో ట్రెండ్ మారుతూ ఉంటుంది. నిన్న మొన్నటి వరకు ఒక ట్రెండ్ ఉంటే.. అది రేపు ఉండకపోవచ్చు. ఇక మహిళల ఫ్యాషన్ ట్రెండ్స్ అయితే పాతవి కూడా మళ్లీ నయా ట్రెండ్‌గా మారుతాయి. అలాంటివాటిలో నల్లపూసలు ఒకటి!



ఈ నల్లపూసల ట్రెడిషనల్ జ్యువెలరీ ఎప్పటికీ ఫ్రెష్‌గానే ఉంటుంది. వేసుకోవడానికి బోలెడన్ని నగలున్నా ఆడవాళ్లు మాత్రం నల్లపూసల హారానికే ప్రాధాన్యత ఇస్తుంటారు. ట్రెండ్ ఫాలో అవుతున్నవారైతే మంగళసూత్రానికి బదులుగా నల్లపూసలు వేసుకుంటున్నారు. గతంలో ఏ పేరంటానికి వెళ్లినా హెవీ పట్టుచీరలు.. వాటిపైన లాంగ్ చైన్.. చంద్రహారం.. కాసుల పేరు.. రవ్వల నెక్లెస్‌తో స్వర్ణకాంతులతో మెరిసిపోయేవాళ్లు. ఇప్పటికీ ఆ ట్రెండ్ నడుస్తున్నప్పటికీ సింప్లిసిటీని కోరుకునేవాళ్లు మాత్రం నల్లపూసలనే సూపర్ ట్రెండ్‌గా సెట్ చేస్తూ ఫాలో అవుతున్నారు. సంప్రదాయానికి కాస్త కలరింగ్ ఇచ్చి బ్లాక్ బీడ్స్ చెయిన్స్ వేసుకుంటున్నారు. మహిళల నుంచి వస్తున్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని మార్కెట్‌లో రకరకాల నల్లపూసల డిజైన్లు అందుబాటులోకి తెస్తున్నారు. పచ్చలు.. కెంపులు.. కలర్ బీడ్స్.. ముత్యాలు.. రత్నాలు.. పగడాలు.. సీజేడ్స్ వంటి వెరైటీలు జతచేసి బ్లాక్‌బీడ్స్ చెయిన్స్ రూపొందిస్తున్నారు. ఫంక్షన్ కోసమే కాదు.. ఉద్యోగాలకు వెళ్లే అతివలకు నచ్చే విధంగా క్లోస్డ్ నెక్ బ్లాక్ బీడ్స్.. రో బీడ్స్.. గసగసాల నల్లపూసలు.. స్నేక్ స్కిన్ బ్లాక్ బీడ్స్ రకాలు అందుబాటులో ఉంటున్నాయి. మైక్రో గోల్డ్ ప్లేటెడ్ బ్లాక్ బీడ్స్ చెయిన్ అయితే ఎక్కువ కాలం రంగు మారకుండా ఉంటాయి.

చేతిలో చెయ్యేసి చెప్పు!

యువతలో ఆందోళన ఎక్కువ. ఒత్తిడి కూడా ఎక్కువే. కంగారు పడకుండా కాస్త ప్రశాంతంగా ఆలోచించి ఏదైనా చేస్తే మనసు కుదుటగా ఉంటుందట. మనసులో ఎలాంటి బాధ ఉన్నా తొలగిపోతుందట. అది ఎలా అనుకుంటున్నారా?



భార్యాభర్తలుగానీ.. ప్రేమికులుగానీ.. స్నేహితులుగానీ ఆందోళన పడుతున్నప్పుడు చేతిలో చెయ్యేస్తే సరి అది ఎలాంటి ఆందోళన అయినా తొలగిపోతుందని చెప్తున్నారు నిపుణులు. యూనివర్సిటీ ఆఫ్ కోలరాడోకు చెందిన పరిశోధకులు తాజాగా వ్యక్తుల మానసిక ఆందోళనకు సంబంధించిన అంశంపై అధ్యయనం చేశారు. 23-32 సంవత్సరాల వయసు గల యువతీ యువకులపై ఈ అధ్యయనం చేశారు. ఒంటరిగా ఫీలవుతున్న వారికి చేతిలో చెయ్యేస్తే వారి ఒత్తిడి అమాంతం తగ్గిపోతుందట. ఇది కౌగిలింత కంటే కూడా బలంగా పనిచేస్తుందనీ.. చెయ్యి కలపడమనేది ఒక భరోసాగా పనిచేస్తుందని వారు చెప్పారు. చేతికి.. మానసిక ఆందోళనకు సంబంధమేంటి? అనే ప్రశ్నలకు కూడా పరిశోధకులు సమాధానం ఇచ్చారు. చేతితో పొందే సున్నితమైన స్పర్శ ద్వారా సంకేతాలు మనసుకు చేరి అది భరోసాతో ఉంటుందని వివరించారు. ఎవరైనా ఒత్తిడితోగానీ.. ఒంటరిగాగానీ ఉన్నామంటే వారి చేతిలో చెయ్యేసి చూడాలని సూచిస్తున్నారు!

ఫ్లాట్ టమ్మీ ఫిట్‌నెస్ సూత్రాలు!

ఆడవాళ్లు కూడా ఎదుర్కొంటున్న సమస్య పొట్ట సమస్య. పొట్ట నాజూగ్గా ఉండాలని ఎవరికి ఉండదు? స్లిమ్ టమ్మీ పొందాలంటే సరైన వ్యాయామాలు చేయాల్సిందే. అలా అని ఫ్లాట్ టమ్మీ కోసం పెద్దగా ఇబ్బందులుపడాల్సిన అవసరం లేదు. మూడు సింపుల్ ఎక్సర్‌సైజ్‌లు పాటిస్తే పొట్టను ఈజీగా తగ్గించుకోవచ్చు.



బైస్కిల్ క్రంచ్

ముందుగా ఫ్లోర్‌పై వెల్లకిలా పడుకోవాలి. తర్వాత చేతులను రెండింటినీ తలకింద పెట్టాలి. కాళ్లను మడుస్తూ 45 డిగ్రీల కోణంలోకి చాచాలి. మోకాళ్లు పైకి లేపి కుడి కాలిని నిటారుగా సైకిల్ తొక్కినట్లుగా చాచాలి. అదే సమయంలో ఎడమ మోకాలు చాతికి తగిలేలా ఉంచాలి. అలా రెండు కాళ్లతో చేస్తూ ఉండాలి. ఒక కాలును నిటారుగా చాచినప్పుడుమరో కాలు దగ్గరకు మడుస్తూ ఉండాలి. అదే సమయంలో చేతులను ఆసరా చేసుకొని బాడీని కుడి ఎడమవైపు తిప్పాలి. కుడికాలితో వర్కువుట్ చేస్తుంటే బాడీని కుడివైపు తిప్పడం.. ఎడమకాలితో చేస్తుంటే ఎడమవైపు తిప్పడం చేయాలి.



ప్లాంక్ ఎక్సర్‌సైజ్

ముందుగా నేలపై బోర్ల పడుకొని మోచేతులను.. కాలి వేళ్లను ఆధారంగా చేసుకొని శరీరంపైకి లేపాలి. బాడీని చేతులు.. కాలి వేళ్ల ఆసరా తీసుకొని మాత్రమే పైకి లేపాలి. అరచేయి నుంచి మోచేయి వరకు ఫ్లోర్ ఆనుకొని ఉండేలా చూడాలి. కాళ్ల వేళ్లు ఫ్లోర్‌కు తాకేలా చూడాలి. అలా బాడీని పూర్తిగా పైకి లేపాలి. వీలైనంత వరకు అలా చేతులు.. కాళ్ల వేలి సాయంతో బాడీని ఉంచాలి. మూడుసార్లు అలాగే చేయడం వల్ల పొట్ట భాగంలో పేరుకుపోయిన కొవ్వు కరిగిపోతుంది. ఈ ఎక్సర్‌సైజ్ వల్ల కొవ్వు కరుగటంతో పాటు కండరాలు కూడా పటిష్టంగా అవుతాయి. ఫ్లాట్ టమ్మీని పొందవచ్చు.

బోట్

ముందుగా ఫ్లోర్‌పై కూర్చోవాలి. తర్వాత కాళ్లను మడవాలి. ఇప్పుడు పాదాలు ఫ్లోర్‌ను తాకుతాయి. ఇక కాళ్లను అసలు ఫ్లోర్‌కు తగులకుండా అలాగే నిటారుగా పైకి లేపాలి. చేతులను నిటారుగా చాచాలి. ఇప్పుడు బాడీలో కేవలం పిరుదులు మాత్రమే ఫ్లోర్‌కు టచ్ అవుతాయి. ఇలా కొద్దిసేపు రిలాక్స్ అవ్వాలి.



సుడోకు

డైలీ సుడోకు 146 సమాధానం

1	5	2	8	4	3	9	7	6
8	9	4	7	6	5	1	2	3
7	6	3	1	2	9	8	4	5
4	2	5	6	7	8	3	1	9
9	8	6	2	3	1	7	5	4
3	7	1	9	5	4	2	6	8
2	4	8	5	9	7	6	3	1
5	1	7	3	8	6	4	9	2
6	3	9	4	1	2	5	8	7

డైలీ సుడోకు -147

6				1	8		7	
		7	9			6		3
			7	6		8		
7			2					
		1				3		
					9			2
		2		9	1			
1		5			7	2		
	4		3	2				6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



ఈ చిన్నపిల్ల ఎంతో ధైర్యంగా అందరినీ దాటుకుంటూ నా దగ్గరికి చేరింది. ఈ ఆదివారం రోజు వచ్చి ఇలా చెయ్యి ఊపింది. ఎంత క్యూట్‌గా ఉంది కదా!



అమితాబ్ బచ్చన్
@SrBachchan

అమితాబ్ బచ్చన్‌ని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
33,414,257

కామన్‌మ్యాన్ వాయిస్

బీజేపీలో ఎవరి బాగోతం బయటపడ్డా లీడర్లంతా కలిసి వాళ్లను వెనుకేసుకొస్తారు. కాంగ్రెసులో మాత్రం ఆ ఒక్క ఫ్యామిలీ జోలికి వస్తేనే ఇతరులు స్పందిస్తారు. ఆ రెండు పార్టీలకు ఉన్న తేడా అదే!
– Venu Bekkam

మీరు అత్యంత నిరుపేద ముఖ్యమంత్రి..
మీకు సొంత ఇల్లు లేదు.. సొంత బైక్ లేదు.. రిక్షాలో పోతారు. మంచిదే.. ఇంతేనా? రాష్ట్రానికి ఏం చేశారో చెప్పుకోవడానికి ఏం లేదా? అందుకే ఇలా!
– Murali Buddha

నీ దగ్గర డబ్బు లేదన్న నిజాన్ని నీ నీడకు కూడా తెలియనివ్వకు.. ఎందుకంటే.. డబ్బులేని రోజున మండే ఎండలో అండగా ఉండాల్సిన నీ నీడ కూడా ఆలోచనలో పడుతుంది.
– Soumya Veerabathini


వైరల్ వీడియో



దిల్‌రాజు ప్రొడక్షన్‌లో శ్రీనివాస కళ్యాణం సినిమా షూటింగ్ మొదలైంది. దీనికి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు యూట్యూబ్‌లో ట్రెండింగ్ లిస్ట్‌లో ఉంది.

Srinivasa Kalyanam – Shoot Begins | Nithiin, Raashi Khanna
Total views : 831,189+
Published on Mar 3, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
బుధవారం 7 మార్చి 2018


మహేష్‌బాబు

భరత్ విజన్ ఇదే..!

'విజన్ ఆఫ్ భరత్' పేరుతో 'భరత్ అనే నేను' చిత్ర బృందం తొలి టీజర్‌ను విడుదల చేసింది. 'చిన్నప్పుడు మా అమ్మ నాకో మాటచెప్పింది. ఒకసారి ప్రామిస్ చేసి ఆ మాట తప్పితే 'యు ఆర్ నాట్ ఏ గోల్డ్ మ్యాన్' అని ఎప్పటికీ ఆ మాట తప్పలేదు...మర్చిపోలేదు. నా జీవితంలోనే అతి పెద్ద ప్రామిస్ చేయాల్సిన రోజు ఒకటి వచ్చింది. పెద్దదే కాదు...కష్టమైంది కూడా.. కానీ ఎంత కష్టమైనా ఆ మాట కూడా తప్పలేదు. 'బికాజ్ అయామ్ ఏ మ్యాన్. వీ ఆర్ లివింగ్ ఇన్ సొసైటీ.. ప్రతీ ఒక్కలకి భయం బాధ్యత వుండాలి ప్రామిస్...' అంటూ మహేష్‌బాబు చెబుతున్న డైలాగ్‌లు సినిమాపై అంచనాల్ని పెంచేస్తున్నాయి. 'శ్రీమంతుడు' చిత్రం ద్వారా ఉన్న ఊరిని అభివృద్ధి పథాన నడిపించాలనే అంశాన్ని బలంగా వినిపించిన దర్శకుడు కొరటాల శివ తాజాగా తెరకెక్కిస్తున్న 'భరత్ అనే నేను' సినిమాను సమకాలీన రాజకీయాంశాల నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



శర్వానంద్ తాజా చిత్రానికి 'పడి పడి లేచే మనసు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. హను రాఘవపూడి దర్శకుడు. సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ నిర్మాతలు. సాయిపల్లవి కథానాయిక. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ కోల్‌కతాలో జరుగుతున్నది. మంగళవారం శర్వానంద్. సెట్‌లో యూనిట్ సభ్యుల మధ్య తన జన్మదినోత్స వేడుకల్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు యూనిట్ సభ్యులు శుభాకాంక్షలందజేశారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను హీరో శర్వానంద్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం చిత్ర బందం విడుదల చేసింది.

పెళ్లికి ముహూర్తం?

రణవీర్‌సింగ్, దీపికాపదుకునే ప్రేమాయణం గురించి అందరికి తెలిసిందే. 'రామ్‌లీలా' చిత్రం నుంచి మొదలైన ఈ జంట ప్రణయగాథ నిరాటంకంగా కొనసాగుతున్నది. 'రణవీర్ పక్కనుంటే నేను ప్రపంచాన్నే మరచిపోతాను. అతడొక అద్భుతం' అని దీపికాపదుకునే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. గతంలో తన ప్రేమ వ్యవహారం గురించి మాట్లాడటానికి ఏమాత్రం ఇష్టపడని దీపికా ఒక్కసారిగా తన మనసులోని భావాల్ని వ్యక్తం చేయడంతో వీరిద్దరి ప్రేమకథ కొత్త మలుపు తీసుకోబోతుందనే గుసగుసలు వినిపించాయి. అందరూ అనుకుంటున్నట్లుగానే ప్రేమజంట ఈ ఏడాది పెళ్లిపీటలెక్కబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. విశ్వసనీయ కథనాల ప్రకారం ఈ ప్రేమికులిద్దరూ మరో మూడు నెలల్లో పెళ్లికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇటీవలే దీపికాపదుకునే తల్లిదండ్రులు బెంగళూరు నంచి ముంబయికి వచ్చి రణవీర్‌సింగ్ కుటుంబ సభ్యులతో పెళ్లి గురించి చర్చలు జరిపారట. పెళ్లి ఎక్కడ చేయాలనే విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయట. అయితే రణవీర్, దీపికా మిత్ర బృందమంతా ముంబయిలోనే వుండటంతో అక్కడే వివాహం జరుపుదామనే నిర్ణయానికొచ్చారని తెలిసింది. తొలుత విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌కు సన్నాహాలు చేసుకున్నారని, అయితే ఆ ప్రయత్నానికి దీపికాపదుకునే తల్లిదండ్రులు సమ్మతించలేదని చెబుతున్నారు. దక్షిణ భారతీయ సంప్రదాయ పద్ధతుల్లో వివాహం జరపడానికి రణవీర్‌సింగ్ కుటుంబ సభ్యులు అంగీకరించారని సమాచారం. ఇప్పటికే పెళ్లి తాలూకు ఏర్పాట్లలో దీపికా, రణవీర్ బిజీగా వున్నారని, జూన్‌లో ఈ జంట వివాహబంధంతో ఒక్కటవ్వడం ఖాయమని వారి సన్నిహితులు అంటున్నారు.


దీపికాపదుకునే

అనుబంధానికి దర్పణం

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'కణం'. ఎ.ఎల్.విజయ్ దర్శకుడు. ఎన్.వి.ఆర్ సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్ సి.ఎస్ సంగీతం అందించిన ఈ చిత్ర గీతాల్ని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ విడుదల చేశారు. తొలి ప్రతిని చిత్ర కథానాయిక సాయిపల్లవి స్వీకరించారు. అనంతరం నిర్మాత ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ 'మంచి ఉద్దేశంతో దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించారు. అది తప్పకుండా నెరవేరాలని కోరుకుంటున్నాను. చిత్రాన్ని కేవలం 37 రోజుల్లో పూర్తి చేయడం మామూలు విషయం కాదు. సాంకేతికంగా గొప్ప సినిమా అవుతుంది' అన్నారు. సాయిపల్లవి మాట్లాడుతూ 'తల్లికి, బిడ్డకు మధ్య వున్న అనుబంధమే ఈ సినిమా. ఎమోషనల్‌గా కనెక్ట్ అయి చేసిన చిత్రమిది. ' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మంచి చిత్రాల్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. తమిళంలో రూపొందించిన 'కరు' చిత్రాన్ని తెలుగులో 'కణం' పేరుతో విడుదల చేస్తున్నాం. రెండు భాషల్లో తెరకెక్కించిన చిత్రమిది. 2013లో వచ్చిన ఆలోచనకు తెర రూపమే ఈ సినిమా. మంచి సమయం కోసం ఎదురుచూసి ఇప్పుడు తెరకెక్కించాను' అన్నారు. ఈ కార్యక్రమంలో కెమెరామెన్ నీరవ్‌షా, జెమిని కిరణ్, శానం నాగ అశోక్‌కుమార్. బేబీ వెరోనికా, కృష్ణ మాదినేని, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.


ఎన్.వి.ప్రసాద్, సాయిపల్లవి, వెరోనికా, ఎ.ఎల్.విజయ్


ట్రాఫిక్ రద్దీ వల్ల ప్రీరిలీజ్ వేడుకకు బైక్‌పై వస్తున్న సాయిపల్లవి

పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లొచ్చాను!

'ఒకే రకమైన మూస పాత్రల్లో కనిపిస్తే ప్రేక్షకులు బోర్‌గా ఫీలవుతారు. అందుకే పాత్రలపరంగా ప్రతి సినిమాలో వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నిస్తున్నాను' అన్నారు యువహీరో నిఖిల్. ఏదో ఒక ఇమేజ్‌కు పరిమితమై పోకుండా భిన్న పార్శ్వాల్లో నటుడిగా ఆవిష్కరించుకోవాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ''కిరాక్ పార్టీ'. కన్నడ చిత్రం 'కిరిక్ పార్టీ'కిది రీమేక్. శరన్ దర్శకుడు. ఈ నెల 16న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిఖిల్ హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...


నిఖిల్

'కిరాక్' పార్టీ'లో ఎలాంటి హంగామా చేయబోతున్నారు?

• నా 15న సినిమా ఇది. కొన్ని సినిమాలు ఎన్నో మధురజ్ఞాపకాల్ని మిగుల్చుతాయి. అందులో 'కిరాక్ పార్టీ' ఒకటి. దాదాపు 11ఏళ్ల విరామం తర్వాత ఈ సినిమాలో కాలేజీ విద్యార్థిగా నటించాను. ఇందులో నా హంగామాకు ఆకాశమే హద్దుగా వుంటుంది.

ఇంతకి కథేమిటి...?

• 'హ్యాపీడేస్' తర్వాత నేను చేస్తున్న పూర్తిస్థాయి విద్యార్థి పాత్ర ఇది. ఈ సినిమాలో నేను విద్యార్థి నాయకుడిగా కనిపిస్తాను. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరిన అతను చివరి సంవత్సరం వచ్చే సరికి శక్తివంతుడైన స్టూడెంట్ లీడర్‌గా ఎలా ఎదిగాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది.

కాలేజీ నేపథ్యంలో చాలా చిత్రాలొస్తున్నాయి కదా..కథలో మిమ్మల్ని బాగా ఆకట్టుకున్న అంశాలేమిటి?

• ఒకప్పుడు ఇంజనీరింగ్ విద్య అందరికి అందుబాటులో వుండేది కాదు. ఇప్పుడు సాధారణం అయిపోయింది. సిటీల్లోనే కాకుండా మారుమూల పల్లెల్లో కూడా ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఒక టౌన్‌కు దగ్గరలో వున్న ఇంజనీరింగ్ కాలేజీలో నడిచే కథ ఇది. అక్కడి విద్యార్థుల స్నేహం, ప్రేమ, బ్రేకప్‌లు..కాలేజీ గొడవలు..ఈ నేపథ్యంలో తలెత్తే భావ సంఘర్షణకు అద్దంపట్టేలా వుంటుంది. ప్రతి ఒక్కరి కాలేజీ జీవితాన్ని కళ్లముందుంచుతుంది.

మీరు ఇంజనీరింగ్ చదివారు కదా..మీ కాలేజీ రోజులు ఏమైనా గుర్తొచ్చాయా?

మా కాలేజీ రోజుల్లో సీనియర్-జూనియర్స్ మధ్య ఘర్షణలు, ఇగో సమస్యలతో గొడవలు జరుగుతుండేవి. ఓసారి కాలేజీ గొడవలో నేను పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లొచ్చాను. ఏదో కుర్రాళ్ల వ్యవహారం అని చెప్పి పోలీసులు వదిలేశారు.

కన్నడ మాతృకలో ఏమైనా మార్పులు చేశారా?

• పెద్ద మార్పులేమి చేయలేదు. కన్నడ వెర్షన్ మూడు గంటల నిడివి వుంటుంది. కానీ తెలుగులో దానిని తగ్గించాం. రెండుగంటల 25నిమిషాల రన్‌టైమ్ వుంటుంది. మాతృకలోని కొన్ని అనవసరమైన కామెడీ సన్నివేశాల్ని తొలగించాం.

సినిమాలో సోషల్ మెసేజ్ కూడా వుంటుందంటున్నారు...?

• సందేశం కాదు కానీ..చిన్న చిన్న విషయాలు జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే అంశాన్ని చూపించాం. ఒక అమ్మాయి గురించి చెడుగా మాట్లాడితే ఆ మాటలు ఆమె జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే విషయాన్ని సందేశాత్మకంగా, మానవీయ కోణంలో చూపించాం.

ఈ చిత్రానికి చందు మొండేటి మాటలు, సుధీర్‌వర్మ స్క్రీన్ ప్లే అందించారు కదా?

• సుధీర్, చందు, దర్శకుడు శరన్.. మేం ముగ్గురం మంచి మిత్రులం. సుధీర్, చందు వారికి సంబంధించిన సినిమా పనుల్లో బిజీగా వుంటూనే మా సినిమాకు ఎంతగానో సహకారమందించారు. సుధీర్ స్క్రీన్‌ప్లే, చందు సంభాషణలు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి.

మీ కెరీర్‌లో ''కిరాక్‌పార్టీ' చిత్రానికున్న ప్రత్యేక ఏమిటనుకుంటున్నారు?

• ఈ సినిమాతో ఎన్నో జ్ఞాపకాలు పెనవేసుకొన వున్నాయి. షూటింగ్ చేస్తున్నప్పుడు నా కాలేజీ రోజులు గుర్తుకువచ్చాయి. సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరు తమ కాలేజీ రోజుల్లోకి వెళ్లిపోతారు. ఏ సినిమాలో నాకు ఈ స్థాయి నటనను కనబరిచే అవకాశం దక్కలేదు.

మాస్ హీరోగా నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లుంది?

• కథాంశాలపరగా నటుడిగా నన్ను నేను తీర్చిదిద్దుకుంటున్నాను. 'కిరాక్‌పార్టీ' కోసం బరువు పెరిగాను. షూటింగ్ టైమ్‌లో 85కిలోలు వుండేవాడిని. ఇప్పుడు తగ్గాను. సినిమాలో వినూత్న కేశాలంకరణతో స్టైలిష్‌గా కనిపించాను. క్లాస్, మాస్ అని తేడా లేకుండా ఏ సినిమా చేసినా దానికి వందశాతం న్యాయం చేయాలన్నదే నా లక్ష్యం.

'ఇతర వ్యాపారాలు ఎన్ని వున్నా సినిమారంగాన్ని నేను అమితంగా ప్రేమిస్తాను. ప్రతిభావంతులై ఔత్సాహికుల్ని ప్రోత్సహిస్తూ సృజనాత్మక కథాంశాల్ని ప్రేక్షకులకు అందివ్వాలన్నదే నా లక్ష్యం' అన్నారు మల్కాపురం శివకుమార్. 'భద్రాద్రి' 'సూర్య వర్సెస్ సూర్య' 'సింగం-3' వంటి చిత్రాలతో అగ్ర నిర్మాతగా తెలుగు చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మల్కాపురం శివకుమార్ సమర్పిస్తున్న చిత్రం 'ఏ మంత్రం వేసావె'. విజయ్‌దేవరకొండ కథానాయకుడు. శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందించారు. ఈ నెల 9న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో మల్కాపురం శివకుమార్ పాత్రికేయులతో ముచ్చటించారు.

ప్రతిభావంతుల్ని ప్రోత్సహిస్తా!


మల్కాపురం శివకుమార్

నేటి యువతరం మనోభావాల్ని ప్రతిబింబించే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఏ మంత్రం వేసావె'. థ్రిల్లర్ అంశాల కలబోతగా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతి యువకుడికి ఏదో ఒక బలహీనత ఉంటుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కంప్యూటర్ గేమ్స్ అంటే చాలా ఇష్టం. అవే సర్వస్వంగా గడుపుతుంటాడు. ఒక అమ్మాయి పరిచయం అతడి జీవిత గమనాన్ని ఎలా మార్చివేసింది? అతడు ఎలా ప్రయోజకుడయ్యాడు? అన్నదే చిత్ర ఇతివృత్తం.

1000థియేటర్లలో..

'పెళ్లిచూపులు' 'అర్జున్‌రెడ్డి' చిత్రాలతో విజయ్ దేవరకొండ తనకంటూ ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్నారు. అనతికాలంలోనే ఎంతోమంది అభిమానుల్ని సంపాదించకున్నాడు. ఈ సినిమాలో విజయ్ పాత్ర చిత్రణ నవ్య పంథాలో వుంటుంది. నేటి యువత అందరూ అతని పాత్రతో కనెక్ట్ అవుతారు. కథాంశంలోని కొత్తదనం ప్రతి ఒక్కరిని మెప్పిస్తుంది. ట్రైలర్స్, పాటలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1000థియేటర్లలో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం.

'అర్జున్‌రెడ్డి'తో పోల్చుకోవద్దు...

'అర్జున్‌రెడ్డి' వంటి ఓ సంచలన విజయం తర్వాత విజయ్ దేవరకొండ నుంచి వస్తున్న సినిమా కాబట్టి ప్రేక్షకుల్లో అంచనాలు వుండటం సహజం. 'బాహుబలి' తర్వాత ప్రభాస్‌ను తిరిగి అదే స్థాయి పాత్రలో ఊహించుకోవడం సాధ్యమేనా? 'అర్జున్‌రెడ్డి'తో విజయ్ దేవరకొండ యువతలో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్నాడు. ఆ సినిమా స్థాయిలో అంచనాలు పెట్టుకోవడం భావ్యం కాదనుకుంటున్నాను.

ఏకకాలంలో మూడుచిత్రాలు..

ప్రస్తుతం మా సంస్థలో మూడు చిత్రాలు పూర్వ నిర్మాణదశలో ఉన్నాయి. ఏప్రిల్ నుంచి షూటింగ్ మొదలుపెడతాం. 'ద్రోణ' చిత్రాన్ని రూపొందించిన కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాను. రవిచంద్ర దర్శకత్వంలో ఓ వినూత్న కథా చిత్రాన్ని తెరకెక్కించే సన్నాహాల్లో వున్నాం. వీటితో పాటు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఓ కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాన్ని తీయబోతున్నాం. దీనికి కన్నడంలో మంచిపేరున్న రఘురాజ్ దర్శకత్వం వహిస్తారు. ఏకకాలంలో ఈ మూడు చిత్రాల నిర్మాణాల్ని చేపడుతాం. ఈ చిత్రాలకు హీరోలు కూడా దాదాపు ఖరారయ్యారు. ప్రతిభావంతుల్ని ప్రోత్సహించాలన్నదే నా లక్ష్యం. ఈ సంవత్సరాంతంలో అగ్ర హీరోలతో కూడా సినిమాలు తెరకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నాం. 'సూర్య వర్సెస్ సూర్య' చిత్రాన్ని హిందీలో రీమేక్ చేసే సన్నాహాల్లో వున్నాను.

కేసీఆర్‌గారి అడుగుజాడల్లో...

కేసీఆర్‌గారు అత్యంత సమర్థుడైన నాయకుడు. థర్డ్ ఫ్రంట్ గురించి ఆయన సన్నాహాలు చేస్తున్నారు. కేసీఆర్ గారి అడుగుజాడల్లో మేమంతా పయనిస్తాం. ఆయన ఏదైనా సంకల్పిస్తే దానిని సాధించేవరకు విశ్రమించరు. కేసీఆర్‌గారికి దేశవ్యాప్తంగా ప్రజల దీవెనలు లభించాలని ఆకాంక్షిస్తున్నాను.

ఎన్టీఆర్‌తో జోడీగా..

తెలుగులో పూజా హెగ్డే జోరు కొనసాగుతున్నది. వరుసగా అగ్ర కథానాయకుల చిత్రాల్లో నటించే అవకాశాల్ని సొంతం చేసుకుంటూ కెరీర్‌లో దూసుకుపోతున్నది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఎన్టీఆర్‌తో జోడీకట్టనుంది. వివరాల్లోకి వెళితే...ఎన్టీఆర్ కథానాయకుడిగా హారిక, హాసిని క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. త్రివిక్రమ్ దర్శకుడు. ఎస్. రాధాకృష్ణ(చినబాబు)నిర్మాత. ఈ సినిమాలో ఎన్టీఆర్‌కు జోడీగా పూజా హెగ్డే కథానాయికగా ఖరారైనట్లు చిత్రబృందం ప్రకటించింది. 'ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలయికలో తొలిసారి రూపొందుతున్న చిత్రమిది. ఆ అంచనాలకు తగినట్లుగానే శక్తివంతమైన కథ, కథనాలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబోతున్నాం. ఏప్రిల్‌లో చిత్రీకరణ ప్రారంభిస్తాం. ఈ ఏడాది ద్వితీయార్థంలో సినిమాను విడుదలచేస్తాం' అని నిర్మాత తెలిపారు. కాగా ఈ సినిమాకు పూజా హెగ్డే కోటి 25లక్షల పారితోషికాన్ని అందుకుంటున్నదని సమాచారం.ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: పి.ఎస్. వినోద్.


పూజా హెగ్డే

సస్పెన్స్ థ్రిల్లర్!


కార్తిక్, నిరంజన

తమిళంలో రూపొందిన '465' అనే సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాన్ని అదే పేరుతో తెలుగులోకి అనువదిస్తున్నారు నిర్మాతలు అడ్డాల వెంకట్రావ్, ఎ.టి.కృష్ణన్. ఇటీవల తెలుగు అనువాద సెన్సార్‌ను పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు చిత్ర విషయాలు తెలియజేస్తూ 'తమిళంలో విజయం సాధించిన చిత్రమిది. పిశాచి, పిజ్జా చిత్రాల్లాగా ఆద్యంతం ఆకట్టుకునే అంశాలు పుష్కలంగా వున్నాయి. హారర్, సస్పెన్స్ అంశాలతో సాగుతుంది. ఈ చిత్రంలో కార్తిక్, నిరంజన హీరో హీరోయిన్లుగా నటించారు. శశాంక్ వెన్నెలకంటి అందించిన అనువాద సంభాషణలు చిత్రానికి హైలైట్‌గా వుంటాయి' అని తెలిపారు. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్.కె.రఫీ, దర్శకత్వం: సాయిసత్యం

ప్రతిఘటన, నేటిభారతం తరహాలో...


మేఘన, అనిల్

తారానీలు కార్పొరేషన్ పతాకంపై అనురాగ్ (ఎమ్.ఎస్.బాబు) స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది.. అనిల్ నెమలి హీరోగా పరిచయమవుతున్నారు. మేఘన కథానాయిక. నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి శ్రీరామ్ క్లాప్‌నివ్వగా, భూపతి రాజా కెమెరా స్విఛాన్ చేశారు. నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. ప్రారంభోత్సవ వేడుకకు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత ఎమ్.ఎస్ బాబు మాట్లాడుతూ 'ప్రతిఘటన, నేటిభారతం తరహాలో విప్లవభావాలతో సాగే చిత్రమిది. నలుగురు కుర్రాళ్లు సమాజంలో ఏ విధంగా మార్పు తీసుకొచ్చారనేది ఆసక్తిని పంచుతుంది. మతకల్లోలాలు జరగకుండా సంఘవిద్రోహుల పన్నాగాన్ని ఎలా అడ్డుకున్నారనేది చిత్ర ఇతివృత్తం. కథ కోసం చరిత్రను అన్వేషించాను. చాలా పరిశోధన చేసి సినిమా రూపంలో ఆవిష్కరిస్తున్నాం. రాజులంతా రైతుల శ్రేయస్సు కోసం కాంక్షిస్తే నేటి పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలా పలు అంశాలను ఈ సినిమాలో ఆవిష్కరిస్తున్నాం. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తిచేస్తాం' తెలిపారు. ఎమ్.ఎస్. బాబుతో తనకు 15 ఏళ్లుగా పరిచయముందని, మంచి కథతో ఆయన చేస్తున్న చిత్రమిదని నెమలి సురేష్ చెప్పారు. అలీ, పోసాని కృష్ణమురళి, బ్రహ్మానందం, ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామకృష్ణ, ఎడిటర్: ఉపేంద్ర, డ్యాన్స్: జానీ మాస్టర్, పాల్ మాస్టర్, ఫైట్స్: విజయ్ మాస్టర్, ఆర్ట్: బాబు, కో డైరెక్టర్: వేణు, అసోసియేట్ డైరెక్టర్: జాన్ చాట్ల, కథ, మాటలు, సంగీతం, నిర్మాత, దర్శకత్వం: అనురాగ్(ఎమ్.ఎస్. బాబు)

లైఫ్‌సైన్సెస్ రంగ అభివృద్ధికి విజన్ 2030

- తెలంగాణ లైఫ్‌సైన్సెస్ అడ్వయిజరీ కమిటీతో మంత్రి కేటీఆర్ భేటీ
- పరిశోధనలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ఫండ్
- జీనోమ్ వ్యాలీలో లైఫ్‌సైన్సెస్ కోసం ఇంక్యుబేటర్
- ఫార్మారంగంలో పెట్టుబడుల సాధనకు 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బాడీ'

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో లైఫ్ సెన్సెస్ రంగం అభివృద్ధికి విజన్ 2030 పేరుతో ప్రణాళికను రూపొందిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఫార్మారంగంలో పెట్టుబడుల సాధనకు 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బాడీ'ని ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ఈ రంగంలో నూతన పరిశ్రమలను తెలంగాణకు రప్పించడంతోపాటు ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. త్వరలో ఆయా కంపెనీలతో సమావేశం ఏర్పాటుచేసి, పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయాలు తీసుకొంటామన్నారు. మంగళవారం ఆయన 'తెలంగాణ లైఫ్ సైన్సెస్ అడ్వయిజరీకమిటీ'తో హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలపై కమిటీ సభ్యులు మంత్రికి వివరాలు అందించారు. అంతర్జాతీయస్థాయిలో ఉన్న ఇక్కడి మౌలిక వసతులు పరిశ్రమకు మరింత వృద్ధిని అందిస్తాయన్నారు. పరిశ్రమ కోసం ఉండాల్సిన విజన్‌పై మంత్రితో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మారంగాన్ని ఒక ప్రాధాన్య రంగంగా ఎంచుకొని, పరిశ్రమ అభివృద్ధికి అనేక ప్రణాళికలు రచిస్తున్నదని మంత్రి కేటీఆర్ వారికి తెలిపారు. ముఖ్యంగా ఈ అంశంలో హైదరాబాద్ ఫార్మాసిటీ మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇటీవల నిర్వహించిన బయోఏషియా సదస్సులో రాష్ట్రంలో లైఫ్‌సైన్సెస్ రంగాన్ని ఎలా అభివృద్ధి పరచాలనే అంశంపై జరిగిన చర్చలో వచ్చిన సలహాల మేరకు ఈ సమావేశం ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. తెలంగాణ లైఫ్‌సైన్సెస్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతోపాటు అంతర్జాతీయకంపెనీలు ఇక్కడికి వచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. టీహబ్ లాంటి ఒక ఇంక్యుబేటర్‌ను జీనోమ్ వ్యాలీలో ఏర్పాటుచేస్తామన్నారు. ఫార్మా కంపెనీలు, విద్యాసంస్థలు, సీసీఎంబీ వంటి సంస్థల మధ్య సమన్వయం పెంచేందుకు రిచ్ ప్రయత్నిస్తుందని చెప్పారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగంలో పరిశోధనలు చేసే స్టార్టప్స్, హైరిస్క్ రీసెర్చ్‌ను ప్రోత్సహించేందుకు ఫండ్ ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్టు కేటీఆర్ తెలిపారు.



మంగళ వారం నోవాటెల్ హోటల్‌లో లైఫ్‌సైన్సెస్ అడ్వయిజరీ కమిటీతో సమావేశమైన మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా ఉన్నారు

చివరిదశలో పాస్ పుస్తకాల టెండర్ ప్రక్రియ

- బిడ్డింగ్‌లో పాల్గొన్న 8సంస్థలు..ఈ వారంలో టెండర్ అగ్రిమెంట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పట్టాదార్ పాస్ పుస్తకాల టెండర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నది. ఈ వారాంతానికి టెండర్లు పూర్తయ్యే అవకాశం ఉంది. టెండర్ దక్కించుకున్న సంస్థ అగ్రిమెంట్ పూర్తయిన 21 రోజుల్లో పట్టాదార్ పాస్ పుస్తకాలు ముద్రణ పూర్తిచేస్తుంది. ఆ తరువాత ఏడు రోజుల్లో పాస్ పుస్తకాలను గ్రామాలకు సరఫరా చేయనున్నారు. పట్టాదార్ పాస్‌పుస్తకాల ముద్రణ కోసం ప్రభుత్వం స్వల్పకాలిక టెండర్లకు బిడ్లను ఆహ్వానించింది. ఇందుకోసం 8 మంది ప్రింటర్లు ముందుకొచ్చారు. సాంకేతిక అర్హతలు, ముద్రణ సామర్థ్యం ఉన్నవారిని గుర్తించి, చివరగా తక్కువ ధరకు కోట్ చేసిన వారిని ఎంపికచేస్తారు. అలాగే సాంకేతిక, ఆర్థిక అర్హత ఉన్నవారు కూడా నిర్ణయించిన టెండర్ ప్రకారం ముద్రించడానికి ముందుకొస్తే వారికి సగం పుస్తకాలు ముద్రించే అవకాశం ఇస్తారు. వాస్తవంగా ప్రభుత్వం పట్టాదార్ పాస్‌పుస్తకాలను ముద్రించి రైతులందరికీ మార్చి 11న ఒక్కరోజులోనే పంపిణీ చేయాలని ప్రభుత్వం ముందుగానే షెడ్యూల్ తయారుచేసింది. ముద్రణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు అప్పగించింది. కానీ ముందుగా అగ్రిమెంట్ చేసుకున్న ధర ప్రకారం కాకుండా అదనంగా ఒక్కో పాస్‌పుస్తకానికి రూ. 50లు చెల్లించాలని పేచీ పెట్టడంతో ఆ ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకుంది. ఇదే సమయంలో భూముల ఆక్రమణలను అరికట్టేందుకు వీలుగా ఆధార్ నంబర్‌ను కూడా జతచేయాలని ప్రభుత్వం నిర్ణయించడం కూడా జాప్యానికి కారణమైంది. ఏప్రిల్‌లో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

పట్టాదార్ పాస్ పుస్తకాల్లోకి వ్యవసాయేతర భూములు

వ్యవసాయేతర భూములను కూడా పట్టాదార్ పాస్‌పుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాస్ పుస్తకాల ముద్రణ జాబితాలో వీటిని కూడా చేర్చాలని ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. మొదట కేవలం వ్యవసాయభూములను మాత్రమే పట్టాదార్ పాస్‌పుస్తకాల్లో నమోదు చేయాలని నిర్ణయించారు. తాజాగా రాష్ట్రంలో ఉన్న 11.96 లక్షల వ్యవసాయేతర పట్టా భూములను కూడా పాస్ పుస్తకాల్లో నమోదు చేయనున్నారు.

'మోడల్ స్కూళ్ల'కు 1.12 లక్షల దరఖాస్తులు

- ఏప్రిల్ 15న ప్రవేశ పరీక్ష.. గతంలో కంటే పెరిగిన పోటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 194 మోడల్‌స్కూళ్లలో (ఇంగ్లిష్ మీడియం) 2018-19 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం 1,12,127 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏప్రిల్ 15న నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష కోసం గత విద్యా సంవత్సరం కంటే దరఖాస్తులు పెరిగాయని మోడల్ స్కూల్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 55,281 దరఖాస్తులు రాగా, 7వ తరగతికి 21,331, 8వ తరగతికి 18,112, 9వ తరగతికి 13,220, పదోతరగతి ప్రవేశాల కోసం 4,183 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. మోడల్ స్కూల్ ప్రవేశాలకు తీవ్రమైన పోటీ నెలకొన్నదని, రాష్ట్రవ్యాప్తంగా 6వ తరగతిలో 19,400 సీట్లు ఉండగా 55 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 11వ తేదీ నుంచి మోడల్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొనేందుకు అవకాశం ఉంటుంది. మే 11న ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉన్నది.

విద్యాహక్కు చట్టాన్ని ఎందుకు అమలు చేయడం లేదు?

- వివరణ ఇవ్వాలని తెలంగాణ, ఏపీప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయకపోవడంపై వివరణ ఇవ్వాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం ఉచితవిద్యనందించకపోవడంపై వివరణ ఇవ్వాలని పేర్కొంది. 2010లో విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో చట్టం అమలవుతున్న దాఖలు లేవంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. చట్టం అమలుచేయకపోవడానికి కారణాలు తెలుపాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను మూడువారాలకు వాయిదా వేసింది.







1) మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి తదితరులు. 2) విద్యుత్తు కార్పొరేషన్ కార్యాలయంలో వేడుకలను ప్రారంభిస్తున్న సీఎండీ రఘుమారెడ్డి. 3) ఆర్టీసీ కల్యాణమండపంలో జరిగిన వేడుకల్లో టీఎస్‌ఆర్టీసీ ఎండీ రమణారావును సన్మానిస్తున్న మహిళా ఉద్యోగులు.చిత్రంలో టీఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ నేతృత్వంలో మహిళలకు పెద్దపీట

- మార్కెట్ కమిటీల్లో సైతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- టీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి
- తెలంగాణ భవన్‌లో మహిళా దినోత్సవాలు

హైదరాబాద్ సిటీబ్యూరో/ ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రం లో మహిళలకు పెద్దపీట వేస్తున్నారని టీఆర్‌ఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుండు సుధారాణి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న మహిళలందరికీ సముచిత న్యాయం జరుగుతుందని చెప్పారు. తెలంగాణభవన్‌లో మంగళవారం టీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణభవన్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ గతంలో ఆడపిల్ల పుట్టిందంటేనే భారంగా పరిగణించే పరిస్థితిని సీఎం కేసీఆర్ ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి అనేవిధంగా మార్చారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, అమ్మఒడి, కేసీఆర్ కిట్లతో మహిళలకు ఇబ్బందులు లేకుండాచేశారని తెలిపారు. మహిళల విద్యకు నిధులు కేటాయించారని.. బాలికలకోసం గురుకులాలు ఏర్పాటుచేశారని వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒంటరి మహిళలకు పింఛన్లు ఇస్తున్నారని వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు మహిళల పేరుతోనే కేటాయిస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు తెలంగాణ మహిళాలోకం అండగా నిలుస్తుందన్నారు. కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ మార్కెట్ కమిటీల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన మహిళలను ఘనంగా సన్మానించారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి: రఘుమారెడ్డి

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి అన్నా రు. మంగళవారం మింట్ కాంపౌండ్‌లోని విద్యుత్తు కార్పొరేషన్ కార్యాలయంలో టీఎస్‌ఎస్పీడీసీఎల్ వుమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వేడుకలను నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రఘుమారెడ్డి మాట్లాడుతూ మనదేశంలో పురుషులకంటే మహిళలే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలోఅసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం తులసీనాగరాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ మంగమ్మ, సహాయ కార్యదర్శి పవిత్ర, ఫైనాన్స్ కార్యదర్శి లత, వీణాకుమారి, ప్రీతి, ఉమ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల పురోగతి: ఆర్టీసీ ఎండీ రమణారావు

మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తూ అభివృద్ధిపథంలో దూసుకెళ్తున్నారని టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావు అభిప్రాయపడ్డారు. టీఎంయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ కల్యాణ మండపంలో మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. టీఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి కార్మికుల సమస్యలను ఎండీ దృష్టికి తీసుకువచ్చారు.కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు తిరుపతి, రాష్ట్ర అధ్యక్షుడు థామస్‌రెడ్డి టీఎంయూ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉషాకిరణ్, పద్మలతారెడ్డి, నాయకులు మారయ్య పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్ నెట్ - 2018

- ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పరిశోధనలకు జేఆర్‌ఎఫ్
- అసిస్టెంట్ ప్రొఫెసర్/డిగ్రీ లెక్చరర్ పోస్టుల కోసం లెక్చరర్‌షిప్
- దేశవ్యాప్తంగా 2018, జూన్ 17న పరీక్ష
- దరఖాస్తులకు చివరితేదీ: మార్చి 26

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) - యూజీసీ సంయుక్తంగా దేశంలోని యూనివర్సిటీ లేదా కాలేజీల్లో పరిశోధన లేదా లెక్చరర్లుగా పనిచేయడానికి ప్రతి యేటా నిర్వహించే సీఎస్ఐఆర్ -నెట్ జూన్ 2018 నోటిఫికేషన్ విడుదలైంది.



దేశంలోని వివిధ యూనివర్సిటీల్లో, అనుబంధ కాలేజీల్లో లెక్చరర్లుగా చేరేందుకు, పరిశోధనలు చేసేందుకు ఈ ప్రవేశ పరీక్ష అర్హత కల్పిస్తున్నది. సీఎస్ఐఆర్ - యూజీసీ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ -నెట్ ఏడాదికి రెండుసార్లు ఉంటుంది.

వివరాలు:

- **సబ్జెక్టులు:** మొత్తం ఐదు సబ్జెక్టుల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. కెమికల్ సైన్సెస్, ఎర్త్ అండ్ అట్మాస్ఫియరిక్ & ఓషియన్ అండ్ ప్లానిటరీ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్
- **అర్హతలు:** ఎమ్మెస్సీ లేదా తత్సమాన డిగ్రీలో ఉత్తీర్ణత లేదా ఇంటిగ్రేటెడ్ బీఎస్/ఎంఎస్ లేదా నాలుగేండ్ల బీఈ/బీటెక్ లేదా బీఫార్మా, ఎంబీబీఎస్‌లో జనరల్, ఓబీసీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు పై అర్హత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
- బ్యాచిలర్ డిగ్రీ ఉన్న అభ్యర్థులు లెక్చరర్‌షిప్ చేయడానికి అర్హులుకారు. ఎమ్మెస్సీ అభ్యర్థులు (10+2+3 విధానంలో)/ప్రస్తుతం ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ రాస్తున్నవారు, బీఎస్సీ (ఆనర్స్)తోపాటు ఇంటిగ్రేటెడ్ ఎంఎస్- పీహెచ్‌డీలో ఎన్‌రోల్ చేసుకున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **గమనిక:** బ్యాచిలర్ డిగ్రీ ఉన్న అభ్యర్థులు లెక్చరర్‌షిప్ పొందడానికి అర్హులుకారు. కేవలం జేఆర్ఎఫ్‌కు మాత్రమే అర్హులు.
- **వయస్సు:** జేఆర్‌ఎఫ్(నెట్) దరఖాస్తు చేసే అభ్యర్థులకు 2018 జనవరి 1 నాటికి 28 ఏండ్లు మించరాదు. ఓబీసీలకు మూడేండ్లు, ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు ఐదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- లెక్చరర్‌షిప్ (నెట్) పరీక్ష రాసేవారికి ఎటువంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ. 1,000/-, ఓబీసీ (ఎన్‌సీఎల్) - రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ - రూ. 250/-

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో సర్టిఫికెట్స్, ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి,
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 26
- **ఎగ్జామినేషన్ కేంద్రం సవరణకు చివరితేదీ:** ఏప్రిల్ 19
- **ఈ ఆడ్మిట్‌కార్డ్ డౌన్‌లోడింగ్:** జూన్ మొదటివారం
- **సీఎస్ఐఆర్ నెట్ పరీక్షతేదీ:** జూన్ 17
- **పరీక్ష ఫలితాల విడుదల:** సెప్టెంబర్/ అక్టోబర్
- **వెబ్‌సైట్:** www.csirhrdg.res.in

- **పరీక్ష కేంద్రాలు:** దేశవ్యాప్తంగా మొత్తం 27 పరీక్ష కేంద్రాల్లో సీఎస్ఐఆర్ నెట్‌ను నిర్వహిస్తారు. హైదరాబాద్, గుంటూరు, బెంగళూరు, భావ్‌నగర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, కొచ్చిన్, ఢిల్లీ, గువాహటి, ఇంఫాల్, జమ్ము, జంషెడ్‌పూర్, జోర్హట్, కరైకుడి, కోల్‌కతా, లక్నో, నాగపూర్, పిలానీ, పుణె, రాయ్‌పూర్, రూర్కీ, శ్రీనగర్, తిరువనంతపురం, ఉదయ్‌పూర్, వారణాసి.
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా

పరీక్ష విధానం:

- బహుళైచ్ఛిక ప్రశ్నలతో కూడిన పరీక్ష జూన్ 17న నిర్వహిస్తారు.
- సీఎస్ఐఆర్ నిర్వహించే ఐదు సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టు నుంచి మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- సీఎస్ఐఆర్ నెట్ పరీక్ష కాలవ్యవధి మూడు గంటలు
- మొత్తం పేపర్‌లో పార్ట్ ఏ విభాగంలో జనరల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్, పజిల్స్ తదితర అంశాలు, పార్ట్ బీ విభాగంలో సంబంధిత సబ్జెక్టు నుంచి సాధారణ ప్రశ్నలు, పార్ట్ సీ విభాగంలో సంబంధిత సబ్జెక్టు నుంచి కఠినస్థాయి ప్రశ్నలు ఇస్తారు.
- పరీక్షను ఉదయం 9 నుంచి 12 గంటల వరకు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.
- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. అయితే సబ్జెక్టుల వారీగా విధానం మారుతుంది.
- జేఆర్‌ఎఫ్ నెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఫెలోషిప్ పొందడానికి 2019 జనవరి 1 నుంచి రెండేండ్ల వరకు వ్యాలిడిటీ ఉంటుంది.

పోర్టు ట్రస్ట్‌లో మేనేజర్లు

విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌లో మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ అండ్ ట్రేడ్ ఫెసిలిటేషన్ విభాగంలో..

- చీఫ్/సీనియర్ మేనేజర్ , మేనేజర్ -3 ఖాళీలు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో...
- చీఫ్/సీనియర్ మేనేజర్ -2 ఖాళీలు కార్పొరేట్ రిలేషన్స్ & కమ్యూనికేషన్స్ విభాగంలో...
- మేనేజర్ - 1 ఖాళీ ఎన్విరాన్‌మెంట్ అండ్ సేఫ్టీ విభాగంలో..
- చీఫ్ /సీనియర్ మేనేజర్ - 2 ఖాళీలు బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ ట్రేడ్ ప్రమోషన్ విభాగంలో..
- సీనియర్ మేనేజర్ - 1, మేనేజర్ - 1 ఖాళీ
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** మార్చి 16
- **వెబ్‌సైట్:** WWW.VIZAGPORT.COM

Vizag Port Trust

సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ ట్రెయినీలు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)లో సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

ఐఐఎస్సీలోని సూపర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ సెంటర్‌లో ప్రస్తుత ఖాళీలు ఉన్నాయి.

- **పోస్టు:** సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ ట్రెయినీ
- మొత్తం ఖాళీల సంఖ్య - 14 (జనరల్- 5, ఓబీసీ -6, ఎస్సీ - 2, ఎస్టీ - 1)
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **శిక్షణ కాలవ్యవధి:** ఏడాది
- **అర్హతలు:** ఎంసీఏ/ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) లేదా బీఈ/బీటెక్‌లలో సీఎస్ఈ/ఇన్ఫర్మేషన్ సైన్స్ లేదా ఐటీ/ఈసీఈ లేదా తత్సమాన సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత. సీ ప్రోగ్రామింగ్, యూనిక్స్ పరిజ్ఞానం ఉండాలి.
- **స్టయిఫండ్:** నెలకు రూ. 15,000/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **రాతపరీక్ష. ఇంటర్వ్యూ:** ఏప్రిల్‌లో ఉంటాయి.

ఈఎస్ఎస్ఓ- ఎన్‌సీఏఓఆర్‌లో

ఈఎస్ఎస్ఓ - నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ & ఓషియన్ రిసెర్చ్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ & ఓషియన్ రిసెర్చ్ ఒక స్వతంత్ర సంస్థ. ఇది మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ పరిధిలోనిది. పోలార్ ప్రోగ్రామింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలను ఈ సంస్థ చేపడుతుంది.

- ఇంజినీర్ (ఎలక్ట్రికల్)- 1, ఇంజినీర్ (సివిల్) - 1, ప్రాజెక్టు టెక్నికల్ అసిస్టెంట్ - 1, షిప్‌బోర్డు అసిస్టెంట్ -1, ప్రాజెక్టు అకౌంటెంట్ - 1 ఖాళీ ఉన్నాయి.
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు.



- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 26
- అర్హతలు, వయస్సు, జీతభత్యాలు, ఇంటర్వ్యూ వేదిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** http://www.ncaor.gov.in

ఎన్ఐటీఐఈలో పీజీ డిప్లొమా

ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ (ఎన్ఐటీఐఈ)లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

- పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు:
- ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్
- మ్యానుఫ్యాక్చరింగ్ మేనేజ్‌మెంట్
- ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
- పై మూడు రెండేండ్ల కాలపరిమితిగల కోర్సులు.
- **అర్హతలు:** 2018, జూన్ 15 నాటికి కింది అర్హతలను కలిగి ఉండాలి.
- వ్యాలిడ్ గేట్ స్కోర్‌తోపాటు ఇంజినీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- రిజర్వ్‌డ్ వర్గాలకు మార్కుల శాతంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సడలింపు ఉంటుంది.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్స్ ఇస్తారు.

ప్రవేశాలు:

- గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, గేట్/జీఆర్ఈ స్కోర్ ఆధారంగా
- టీచింగ్ అసిస్టెంట్‌షిప్: గేట్‌లో అర్హత సాధించినవారికి నెలకు రూ. 12,400/- ఇస్తారు. వీటితోపాటు నిబంధనల ప్రకారం కాంటిజెన్సీ ఖర్చులను ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1,000/-
- **చివరితేదీ:** మార్చి 28
- గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలు: ఏప్రిల్ 23, 24, 25
- **కోర్సు ప్రారంభం:** జూన్ 2018
- **వెబ్‌సైట్:** www.nitie.edu

ఐసీఏఆర్-ఎన్ఆర్‌సీబీ

తిరుచిరాపల్లిలోని నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఫర్ బనానా (ఎన్ఆర్‌సీబీ) ఖాళీగా ఉన్న యంగ్ ప్రొఫెషనల్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్ఆర్‌సీబీ అనేది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసీఏఆర్) పరిధిలో పనిచేస్తున్న సంస్థ

- మొత్తం ఖాళీల సంఖ్య-2 (గ్రేడ్1యంగ్ ప్రొఫెషనల్-1, టెక్నికల్ అసిస్టెంట్-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్/ఐటీలో బీఈ/బీటెక్, బీఎస్సీ/ఎమ్మెస్సీలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 15,000/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో దరఖాస్తుతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పర్సనల్ అధికారివద్ద హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 12
- **వెబ్‌సైట్:** http://nrcb.res.in

తెలంగాణకు 24.467.. ఏపీకి 9.3 టీఎంసీలు



- ఎట్టకేలకు నీటి విడుదల ఉత్తర్వులను జారీచేసిన కృష్ణాబోర్డు
- ఈ నెలాఖరు వరకు నాగార్జునసాగర్‌లో 515 అడుగుల నీటిమట్టం నిర్వహించాలి
- తదనుగుణంగా శ్రీశైలం నుంచి నీటిని విడుదలచేయాలి
- తప్పుడు ప్రచారాన్ని పటాపంచలు చేసిన తెలంగాణ నీటిపారుదలశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి నీటి విడుదలకు కృష్ణానది యాజమాన్య బోర్డు ఎట్టకేలకు ఉత్తర్వులు జారీచేసింది. త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకొన్న నిర్ణయాలకు అనుగుణంగా రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన వాడుకునేందుకు అర్హత ఉన్న వాటా మేరకు తెలంగాణకు 24.467 టీఎంసీలు, ఏపీకి 9.3 టీఎంసీల నీటివిడుదలకు ఆదేశిస్తూ బోర్డు సభ్య కార్యదర్శి ఏ పరమేశం మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 20 వరకు నాగార్జునసాగర్‌లో 520 అడుగులు, నెలాఖరు వరకు 515 అడుగుల నీటిమట్టం కచ్చితంగా నిర్వహించాలని స్పష్టంచేశారు. అయితే, సాగర్ నుంచి రెండు రాష్ట్రాల అవసరాలకు నీటిని విడుదల చేయాల్సి ఉన్నందున శ్రీశైలం నుంచి కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా నీటిని విడుదల చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది.ఒకవేళ జెన్‌కో తమకు విద్యుత్ అవసరంలేదని స్పష్టం చేసినట్టయితే.. రివర్ స్లూయిజ్‌ల ద్వారా నీటిని విడుదల చేయాలని కూడా పేర్కొన్నది. సాగర్ ఎడమకాల్వ కింద తెలంగాణ, ఏపీ ఒకేసారి నీటిని వినియోగించుకోవడం వల్ల సరఫరా, ఆవిరి నష్టాలు తగ్గించవచ్చని సూచించింది. గతంలో పలుమార్లు ఢిల్లీలో జరిగిన ఒప్పందాల మేరకు బోర్డు తాజాగా జారీచేసిన నీటి విడుదల ఉత్తర్వులను రెండురాష్ట్రాలు అమలు చేయాలని బోర్డు సభ్య కార్యదర్శి అందులో తెలిపారు.

అప్రమత్తంగా వ్యవహరించిన తెలంగాణ నీటిపారుదలశాఖ

ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం, సాగర్ జలాశయాల నుంచి తన వాటా కంటే ఎక్కువ వాడుకొని, తిరిగి మరిన్ని టీఎంసీలను మళ్లించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నది. చివరకు బోర్డు త్రిసభ్య కమిటీలో చేసిన నిర్ణయాలను కూడా తప్పుడు ప్రచారంచేస్తూ ఎక్కువ నీటిని దక్కించుకొనేందుకు నానా మార్గాలు అనుసరిస్తున్నది. అతినుంచి అప్రమత్తంగా ఉన్న తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్లు ఎప్పటికప్పుడు బోర్డు అధికారులను సంప్రదిస్తూ ఏపీ ప్రయత్నాలను భగ్నంచేస్తున్నారు. ఈనెల 2న జరిగిన బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో కేవలం జలాశయాల్లోని ఎండీడీఎల్ ఎగువన నీటి నిల్వలనే వాడుకోవాలని డిమాండ్ పెట్టిన తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులు దానిని సాధించడంలో సఫలీకృతులయ్యారు. గత నెల 28న రెండుజలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన 33.770 టీఎంసీల్లో తెలంగాణకు 24.467 టీఎంసీలు, ఏపీకి 9.3 టీఎంసీలు మేర వాటా ఉందని బోర్డు తేల్చింది. అయితే సమావేశంలో అందుకు అంగీకరించిన ఏపీ అధికారులు.. ఆ తర్వాత ప్లేటు ఫిరాయించేందుకు ప్రయత్నించారు. గతంలో సమర్పించిన ఇండెంట్ల ప్రకారం తెలంగాణకు 19 టీఎంసీలు, ఏపీకి 26.38 టీఎంసీల నీటి విడుదలకు అంగీకారం జరిగిందంటూ ఒక పత్రికలో తప్పుడు ప్రచారాన్ని కూడా చేయించారు. గత రెండురోజులుగా ఇదేరీతిన నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేయించేందుకు బోర్డులోని ఏపీ ఇంజినీర్లు తీవ్ర ప్రయత్నాలు చేశారు. దీంతో బోర్డు చైర్మన్‌ను కలిసిన తెలంగాణ ఇంజినీర్లు త్రిసభ్య కమిటీ సమావేశంలో జరిగిన నిర్ణయాలను వివరించారు. వాస్తవానికి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేయించడంలో సఫలీకృతులయ్యారు.

మళ్లీ అదే వంకర!

- చర్చను నిర్ణయంగా మార్చిన బోర్డు మినిట్స్
- అడ్డూ అదుపులేకుండా ఏపీ ఇంజినీర్ల మాయాజాలం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ల మాయాజాలానికి అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. చివరకు నిష్పక్షపాతంగా ఉండాల్సిన కృష్ణా బోర్డులోనూ ఆ రాష్ట్రం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఇంజినీర్లు తరచూ తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ బోర్డును ఇరకాటంలో పడేస్తున్నారనే విమర్శలున్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి వాటా మేరకు కృష్ణాజలాలను వాడుకోవడంపై రెండు రాష్ట్రాల మధ్య ఈ నెల 2న త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. అయితే దీనికి సంబంధించిన మినిట్స్ (సమావేశంలో చర్చ, నిర్ణయాల నివేదిక)ను మంగళవారం బోర్డు రెండురాష్ట్రాలకు పంపింది. ఇందులో ప్రధానంగా పలు అంశాలపై జరిగిన చర్చలను సమావేశంలో తీసుకొన్న నిర్ణయంగా పేర్కొనడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆనాటి చర్చలో భాగంగా.. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన నీటిని వాడుకొందామని, తదుపరి తాగునీటి అవసరాల కోసం ఎండీడీఎల్ దిగువన వెళ్లేందుకు అభ్యంతరం లేదని తెలంగాణ చెప్పింది. ఆంధ్రప్రదేశ్ తనకు మార్చిలోనే 26 టీఎంసీలు కావాలని కోరగా ప్రస్తుతానికి ఎండీడీఎల్ ఎగువన వాడేందుకు నిర్ణయం జరిగిందని ఈనెల 20వ తేదీ తర్వాత మరోసారి భేటీ అయి ఎండీడీఎల్ దిగువన నీటివాడకంపై చర్చిద్దామని బోర్డు స్పష్టం చేసింది. కానీ, మినిట్స్‌లో మాత్రం శ్రీశైలం జలాశయంలో 800 అడుగులు (ఎండీడీఎల్ 834 అడుగులు),సాగర్‌లో 500 అడుగులు (ఎండీడీఎల్ 510 అడుగులు) వరకు వెళ్లి నీటిని వాడుకొనేందుకు నిర్ణయించినట్టుగా రాసుకొచ్చారు. చర్చను నిర్ణయాలుగా పేర్కొంటూ మినిట్స్‌లో పొందుపరిచినందున తమ తరపున స్పష్టతనివ్వాలని తెలంగాణ నీటిపారుదలశాఖ నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి బుధ, గురువారాల్లో బోర్డుకు లేఖ రాసే అవకాశం ఉంది.

నేడు వీసీలతో డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని యూనివర్సిటీలు సాధించిన పురోగతి, అధ్యాపకుల పోస్టుల భర్తీ, అకడమిక్ సంబంధఅంశాలపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి బుధవారం వైస్ చాన్స్‌లర్లతో భేటీ కానున్నారు. వర్సిటీల అభివృద్ధి, నిధుల వినియోగంపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకోనున్నారు.

యూరియా ధరలపై అవగాహన కల్పించండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యూరియా క్రయవిక్రయాలు, బస్తా బరువు తగ్గింపు, సవరించిన ధరలపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయాధికారులను ఆదేశిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి మంగళవారం లేఖలు రాశారు. ఇటీవల కేంద్రం యూరియా బస్తా బరువును 50కిలోల నుంచి 45 కిలోలకు తగ్గించిన విషయంపై అవగాహన కల్పించాలని లేఖలో పేర్కొన్నారు. జిల్లాల్లోని ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశాలు నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారులు ఎరువుల నిల్వలపై దృష్టిపెట్టాలన్నారు. అనుమతిలేని హైబ్రీడ్ పత్తివిత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి హెచ్చరించారు. ఈ మేరకు తగినచర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల్లోని వ్యవసాయాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి అనుమతిలేని పత్తివిత్తనాల విక్రయాలు, తయారీ, ప్యాకింగ్‌పై దృష్టిపెట్టాలని సూచించారు. అలాంటి విత్తనాలు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

యూసీవో పరీక్షల్లో నారాయణ ప్రతిభ

హైదరాబాద్: జాతీయస్థాయిలో యూనిఫైడ్ కౌన్సిల్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్ (యూసీవో) పరీక్ష 2018లో తమ స్కూళ్ల విద్యార్థులు టాప్ టెన్ ర్యాంకులు కైవసం చేసుకున్నారని నారాయణ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పీ సింధూర నారాయణ తెలిపారు. మంగళవారం విడుదలైన రెండోదశ పరీక్ష ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతోపాటు వరుసగా పది ర్యాంకులు సాధించారని ఆమె మీడియాకు చెప్పారు.

ఫ్లాష్.. ఫ్లాష్..



మూసాపేటలో బస్సు బోల్తా

ఆరుగురికి గాయాలు.. అర్ధరాత్రి హాహాకారాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని మాదాపూర్ నుంచి చింతల్‌కు సిబ్బందితో వెళ్తున్న సియాంట్ కంపెనీకి చెందిన బస్సు మంగళవారం అర్ధరాత్రి 1.10 గంటల ప్రాంతంలో బోల్తాపడింది. మూసాపేట ఫ్లైఓవర్‌పై భరత్‌నగర్ రైల్వేస్టేషన్ వద్ద డివైడర్‌కు తగిలి, అవతలివైపు ఉన్న రెయిలింగ్‌ను ఢీకొని ఫ్లైఓవర్ పైనుంచి కింద రోడ్డుపై బోల్తాపడింది. ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. ఈ సమయంలో బస్సులో 60 మంది సిబ్బంది ఉన్నారు. మిగతా వారు హాహాకారాలు చేస్తూ ప్రాణాలు అరచేతిలో పట్టుకొని బస్సులోనుంచి దూకి బయటకు పరుగులు తీశారు. అర్ధరాత్రి కావడం.. ఫ్లైఓవర్ కింద ఎటువంటి వాహనాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అటుగా వెళ్తున్న ప్రయాణీకులు సహాయక చర్యలు చేపట్టారు.



ప్రమాదం నుంచి బయటపడ్డ సియాంట్ కంపెనీ సిబ్బంది

ఎంసెట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కాలేజీల్లో సీట్ల భర్తీకి మే 2వ తేదీ నుంచి 7 వరకు నిర్వహించనున్న ఎంసెట్-2018 కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్ 4 వరకు కొనసాగుతుంది.

హంతకులకు టీడీపీలో పదవులు

- మేం నోరు విప్పితే బండారం బట్టబయలు
- ఏపీ బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలో తెలుగుదేశం పార్టీ గుండాలకు, రౌడీలకు మాత్రమే పదవులు ఇస్తున్నారని ఆ రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీపక్షనేత విష్ణుకుమార్‌రాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.5 లక్షలు ఇస్తే హత్య చేసే వారిని ప్రోత్సహిస్తున్నారని, రూ.10 లక్షలు ఇస్తే తనను కూడా చంపేస్తారని అన్నారు. విశాఖపట్నంలో టీడీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్.. ప్రధాని మోదీ మెడలు వంచినట్టు నిరసన తెలుపడాన్ని ఆయన ఆక్షేపించారు. ఓ హత్యకేసులో నేరస్థుడు ప్రధానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేయడమేంటి? అటువంటి వారికి నగర ఉపాధ్యక్ష పదవి ఎలా ఇచ్చారు? అని ప్రశ్నించారు. టీడీపీ నేతలు పిచ్చిపిచ్చి వేషాలు వేస్తే సహించబోమని హెచ్చరించారు. తాము నోరు విప్పితే ఏపీలో టీడీపీ నేతల బండారం బయటపడుతుందని, మిత్రధర్మాన్ని పాటిస్తున్నాం కాబట్టే సంయమనంతో ఉన్నామని విష్ణుకుమార్‌రాజు చెప్పారు.

కొచ్చర్, శిఖాలకు సమన్లు

పీఎన్‌బీ స్కామ్‌లో విచారణకు పిలిచిన ఎస్‌ఎఫ్‌ఐవో

రెండు బ్యాంకుల ఉన్నతాధికారులను రెండు గంటలుపైగా ప్రశ్నించిన దర్యాప్తు బృందం



పీఎన్‌బీ స్కాం కేసులో ముంబైలోని ఎస్‌ఎఫ్‌ఐవో ఎదుట హాజరై వెళ్తున్న యాక్సిస్ బ్యాంక్ డీఎండీ వీ శ్రీనివాస్

ముంబై, మార్చి 6: దేశంలో తీవ్రమైన ఆర్థిక నేరాలపై దర్యాప్తు జరిపే అవినీతి నిరోధక విభాగం ఎస్‌ఎఫ్‌ఐవో (సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్) ఐసీఐసీఐ బ్యాంకు సీఈవో చందా కొచ్చర్‌తోపాటు యాక్సిస్ బ్యాంకు ఎండీ శిఖా శర్మకు సమన్లు జారీ చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో ఇటీవల వెలుగులోకి వచ్చిన రూ.12,700 కోట్ల భారీ కుంభకోణంపై ప్రశ్నించేందుకు వారిని పిలిచింది. ఈ కుంభకోణంలో వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీతోపాటు మరో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆయన మామ మెహుల్ చోక్సీ ఆధ్వర్యంలోని గీతాంజలి జెమ్స్ సంస్థకు ఇచ్చిన రూ.5 వేల కోట్ల రుణాలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేసేందుకు కొచ్చర్, శిఖా తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని, లేదంటే ప్రతినిధులను పంపాలని ఎస్‌ఎఫ్‌ఐవో ముంబై శాఖ ఆ సమన్లలో స్పష్టం చేసింది. కొన్ని విషయాలపై స్పష్టత కోసమే వారిని విచారణకు పిలిచామని, అంతేతప్ప పీఎన్‌బీ కుంభకోణంలో నిందితులుగా కాదనీ తెలిపింది. దీంతో ఆ రెండు బ్యాంకుల ఉన్నతాధికారులు ఎస్‌ఎఫ్‌ఐవో ఎదుట హాజరయ్యారు. యాక్సిస్ తరఫున ఈ విచారణకు హాజరైన బృందానికి డిప్యూటీ ఎండీ వీ శ్రీనివాసన్ నాయకత్వం వహించారు. రెండు గంటలుపైగా ఎస్‌ఎఫ్‌ఐవో కార్యాలయంలోనే ఉన్న ఈ బృందాన్ని దర్యాప్తు అధికారులు అనేక ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారని, ప్రత్యేకించి గీతాంజలి జెమ్స్ సంస్థతోపాటు నీరవ్‌కి చెందిన సంస్థలతో యాక్సిస్ సాగిస్తున్న వ్యాపారం గురించి లోతుగా ఆరా తీశారని అధికార వర్గాలు తెలిపాయి. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐవో.. ఈ వ్యవహారంలో కేవలం యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకుల అధికారులకేగాక మరో 30కిపైగా బ్యాంకుల అధికారులకూ సమన్లు జారీ చేసినట్లు తెలుస్తున్నది. దేశీయ బ్యాంకింగ్ రంగ చరిత్రలోనే అతిపెద్దదిగా 'ఘనత'కెక్కిన పీఎన్‌బీ కుంభకోణంపై ఎస్‌ఎఫ్‌ఐవోతోపాటు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఇప్పటికే విస్తృత దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. నీరవ్, చోక్సీలకు చెందిన సంస్థలు ముంబైలోని పీఎన్‌బీ శాఖ ఉద్యోగులతో కుమ్మక్కై తప్పుడు ఎల్‌వోయూలతో ఈ కుంభకోణానికి పాల్పడినట్లు స్పష్టమవుతున్నది. ఈ ఎల్‌వోయూల ఆధారంగా విదేశీ శాఖల ద్వారా పీఎన్‌బీకి రుణాలిచ్చిన అనేక బ్యాంకుల్లో యాక్సిస్ కూడా ఉన్నది. కాగా, గీతాంజలి జెమ్స్‌కు సమష్టిగా రూ.6,800 కోట్లకుపైగా రుణాలిచ్చిన 31 బ్యాంకుల కన్సార్టియంకు ఐసీఐసీఐ లీడ్ బ్యాంకర్‌గా ఉన్నది.

నేడు ఎస్‌ఎఫ్‌ఐవో ముందుకు పీఎన్‌బీ చీఫ్

పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సునీల్ మెహతా బుధవారం ఎస్‌ఎఫ్‌ఐవో ముందుకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. బ్యాంకులో జరిగిన రూ.12,700 కోట్ల కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే ఎస్‌ఎఫ్‌ఐవో..యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్నతాధికారులను ప్రశ్నించింది.

పీఎన్‌బీ కేసులో గీతాంజలి' వైస్‌ప్రెసిడెంట్ నిర్బంధం

ముంబై విమానాశ్రయంలో అరెస్టు చేసిన సీబీఐ

పీఎన్‌బీలో జరిగిన వేలాది కోట్ల రూపాయల కుంభకోణ కేసు దర్యాప్తులో భాగంగా గీతాంజలి గ్రూపు కంపెనీల వైస్ ప్రెసిడెంట్ విపుల్ చైతాలియాను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మంగళవారం అరెస్టు చేసింది. చైతాలియాను ముంబై విమానాశ్రయంలో నిర్బంధించి విచారణ నిమిత్తం బాంద్రా-కుర్లా కాంప్లెక్స్‌లోని సీబీఐ కార్యాలయానికి తరలించినట్లు ఒక అధికారి తెలిపారు. అయితే పీఎన్‌బీ కుంభకోణంలో చైతాలియా పోషించిన పాత్ర ఏమిటన్న దానితో పాటు ఇతర వివరాలను ఆ అధికారి వెల్లడించలేదు. అయితే ఈ కేసులో నిందితులుగా ఉన్న పీఎన్‌బీ అధికారులు ఈ ఎల్‌వోయూలకు సంబంధించిన ఆదేశాలను తమ బ్యాంకు అంతర్గత సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చకుండా వాటిపై పరిశీలనకు ఆస్కారం లేకుండా చేశారని, అంతర్జాతీయ స్థాయిలో నిధుల బదలాయింపునకు సంబంధించిన ఆదేశాల చేరవేత కోసం బ్యాంకులు ఉపయోగించే సమాచార వ్యవస్థ (స్విఫ్ట్) ద్వారా వారు ఈ ఎల్‌వోయూలను పంపారని తెలుస్తున్నది. ఒక బ్యాంకు తమ దరఖాస్తు దారునికి స్వల్పకాలిక రుణాన్ని మంజూరు చేయించేందుకు విదేశాల్లో శాఖలను కలిగివున్న భారతీయ బ్యాంకులకు ఇచ్చే హామీనే అండర్ టేకింగ్ లెటర్ అంటారు. ఈవిధంగా తీసుకున్న రుణాన్ని ఎవరైనా ఎగ్గొడితే అండర్‌టేకింగ్ లెటర్‌ను జారీ చేసిన బ్యాంకే వడ్డీతో సహా ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రపంచంలోనే టాప్

నాలుగోసారి విశిష్ట గుర్తింపు ఇచ్చిన ఏసీఐ



హైదరాబాద్, మార్చి 6: జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు మరోసారి విశిష్టమైన ఖ్యాతి లభించింది. 2017 సంవత్సరానికి నిర్వహించిన ఏఎస్‌క్యూ (ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ) పాసింజర్స్ సర్వేలో హైదరాబాద్ విమానాశ్రయం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, 50 లక్షల నుంచి 1.5 కోట్ల ప్రయాణికుల రవాణా కేటగిరీలో హైదరాబాద్ విమానాశ్రయానికి ఈ ఖ్యాతి లభించిందని మాంట్రియల్‌కు చెందిన ఏసీఐ (ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్) ప్రకటించింది. ప్రయాణికులకు అందుతున్న స్థిరమైన, నాణ్యమైన సేవలపై స్వయంగా వారి అభిప్రాయాలనే ఆధారంగా చేసుకుని హైదరాబాద్ విమానాశ్రయానికి మరోసారి ఈ విశిష్టమైన గుర్తింపును ఇచ్చినట్లు ఏసీఐ వెల్లడించింది. ఎప్పుడూ ప్రపంచంలోని టాప్-3 విమానాశ్రయాల జాబితాలో కొనసాగుతున్న హైదరాబాద్ విమానాశ్రయానికి గత పదేండ్లలో ఈ గుర్తింపు లభించడం నాలుగోసారి. 2014లో ఏసీఐ డైరెక్టర్ జనరల్ రోల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును కైవసం చేసుకుని దేశంలో ఈ అవార్డు అందుకున్న తొలి ఎయిర్‌పోర్టుగా ఖ్యాతి పొందిన హైదరాబాద్ విమానాశ్రయం ఇప్పుడు మరోసారి ఏఎస్‌క్యూ అవార్డును పొందడం పట్ల జీఎంఆర్ గ్రూపు చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల సంతోషాన్ని వ్యక్తం చేశారు. భాగస్వాములందరి సమష్టి కృషి ఫలితంగానే తమ విమానాశ్రయానికి ఈ అవార్డు లభించిందని ఆయన అన్నారు. ఏసీఐ ఏఎస్‌క్యూ సర్వేలో హైదరాబాద్ విమానాశ్రయం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలవడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నామని జీహెచ్‌ఐఏఎల్ (జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్) సీఈవో ఎస్‌జీకే కిశోర్ పేర్కొన్నారు.

బజాజ్ నుంచి కొత్త బీమా పథకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీమా రంగంలో తనదైన ముద్ర వేస్తున్న బజాజ్ అలియాంజ్ ప్రైవేట్ సంస్థ మరో కొత్త పథకాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. బజాజ్ అలియాంజ్ లైఫ్ గోల్ అస్యూర్ పేరుతో ఈ ప్లాన్‌ను రూపొందించింది. ఈ తరానికి సరిపోయే విధంగా కొత్త పథకాన్ని రూపొందించామని కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సంపత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడి ప్రయోజనాలు, జీవిత బీమా రెండూ కలిసివచ్చేలా ఈ పథకం రూపొందించామని చెప్పారు. పాలసీదారుడికి పూర్తి స్థాయి లాభాలు కల్గించేలా ఉండే ఈ యూలిప్ వల్ల పూర్తిస్థాయి భద్రత సమకూరుతుందన్నారు. ఒకవేళ పాలసీదారుడు మరణిస్తే ఈ సందర్భంలో వారి కుటుంబాలు పలు దఫాలుగా ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు బజాజ్ అలియంజ్‌ను ఆశించినదానికంటే ఎక్కువగా ఆదరిస్తున్నారని చెప్పారు.

ఆందోళన బాటపట్టిన గ్రామీణ బ్యాంకు సిబ్బంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పలు సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు ఆందోళనకు దిగుతున్నట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రకటించింది. ఈ నెల 20న ఢిల్లీలో సామూహిక ధర్నా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న 2,150 శాఖల్లోని పది వేల మంది ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొంటారని, ఈ నెల 26 నుంచి 28 వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఇతర బ్యాంకుల మాదిరిగానే గ్రామీణ బ్యాంకుల్లో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, వేతనాల పెంపుతోపాటు పలు డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్నట్లు వెంకటేశ్వర్‌రెడ్డి ప్రకటించారు.

నీటి శుద్ధి యంత్రాల మార్కెట్లోకి హావెల్స్

హైదరాబాద్, మార్చి 6: ప్రముఖ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థ హావెల్స్ తాజాగా నీటి శుద్ధి తయారీ పరికరాల మార్కెట్లోకి ప్రవేశించింది. నూతన టెక్నాలజీతో రూపొందించిన ఈ పరికరాలు రూ.10,499 నుంచి రూ.23,999 మధ్య ధరల్లో లభించనున్నాయని కంపెనీ వాటర్ ప్యూరిఫైర్ విభాగ వైస్ ప్రెసిడెంట్ శశాంక్ శ్రీవాస్తవ్ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం నుంచి రూ.100 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. 2023 నాటికి రూ.500 కోట్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు. హరిద్వార్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో యేటా 5 లక్షల యూనిట్లు తయారవుతున్నాయని, డిమాండ్ అధికంగా ఉంటే ఉత్పత్తిని మరింత పెంచనున్నట్లు ఆయన ప్రకటించారు. కాగా, రూ.5,800 కోట్ల స్థాయిలో ఉన్న ఈ మార్కెట్లో వచ్చే ఐదేండ్లలో 10 శాతం వాటా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

మరో వెయ్యి కోట్ల మోసం

ప్రభుత్వ, పీఎస్‌యూ ఉద్యోగుల అతితెలివి

నకిలీ ధ్రువపత్రాలతో ట్యాక్స్ రిఫండ్స్ కోసం దరఖాస్తులు

ఐటీ శాఖ విచారణలో బట్టబయలు



న్యూఢిల్లీ, మార్చి 6: మొన్న పీఎన్‌బీ కుంభకోణం.. నిన్న కార్పొరేట్ల మాయాజాలం.. నేడు ప్రభుత్వ ఉద్యోగుల అతితెలివి. కారణాలు ఏమైనా.. వరుసగా వెలుగుచూస్తున్న మోసాలు భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తాజాగా మరో రూ.1,000 కోట్ల మోసాన్ని ఆదాయం పన్ను (ఐటీ) శాఖ బయటపెట్టింది. సోమవారం 447 సంస్థలు.. రూ.3,200 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన ఘరానా మోసాన్ని కనుగొన్న ఐటీ అధికారులు.. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల వల్ల కలిగిన వెయ్యి కోట్ల నష్టాన్ని గుర్తించినట్లు మంగళవారం వెల్లడైంది. 2016-17 మదింపు సంవత్సరానికిగాను ఆదాయం పన్ను రిటర్నుల సవరణ (రివైజ్)కు గడువు దగ్గర పడుతున్న సమయంలో.. వివిధ నగరాల్లో జరిగిన ఈ భారీ మోసాన్ని ఐటీ శాఖ తమ విచారణలో కనుగొన్నది. నకిలీ ధ్రువపత్రాలు, ఖర్చులు ఎక్కువగా చూపి ప్రభుత్వ, పీఎస్‌యూ ఉద్యోగులు పెద్ద ఎత్తున ట్యాక్స్ రిఫండ్స్ (పన్నుల వాపసు)కు క్లెయిమ్ చేసుకున్నారు. ఒక్క ముంబైలోనే ఈ తరహాలో దాదాపు 17,000 రివైజ్డ్ రిటర్నులు దాఖలు కావడం గమనార్హం. గృహ రుణాలకు చెల్లింపుల కారణంతో బెంగళూరులో ఇంకో వెయ్యి రిటర్నుల్ని క్లెయిమ్ చేశారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 24 కింద గృహ రుణ వడ్డీకి పన్నుల నుంచి మినహాయింపున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఐటీ శాఖ విచారణ కొనసాగుతుండగా, దీంతో ఐటీ శాఖకు కనీసం రూ.1,000 కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నది. మరోవైపు లెక్కల్లోకి రాని సంపదను వెలికి తీయడంలో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అన్ని వివరాల్ని ఐటీ శాఖ అందిస్తున్నది. కాగా, ఈ క్లెయిమ్‌లలో ఎక్కువగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లోని సిబ్బందివే ఉన్నాయని ఐటీ శాఖ తెలిపింది. వీరందరి వాస్తవ రిటర్నులను ఇప్పటికే ఐటీ శాఖకు చెందిన కేంద్రీకృత ప్రాసెసింగ్ సెంటర్ పరిశీలించిందని, కానీ సవరించిన రిటర్నుల్లో రిఫండ్స్ కోసం సంబంధిత డాక్యుమెంట్లనూ జోడించారని ఐటీ శాఖ అధికారి ఒకరు అంటున్నారు. గడిచిన మూడేండ్లలో రివైజ్డ్ ట్యాక్స్ రిటర్నుల దాఖలు గణనీయంగా పెరిగిందంటున్న సదరు అధికారి.. ఎలా నకిలీ ధ్రువపత్రాలతో రిఫండ్స్ కోసం దరఖాస్తు చేస్తున్నారో కూడా మేము కనుగొన్నామని చెప్పారు. ఇక పన్ను చెల్లింపుదారులు గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రివైజ్డ్ రిటర్నులను ఈ ఏడాది చివరికల్లా దాఖలు చేసుకోవచ్చన్నారు. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాలకుగాను ఈ నెల 31 వరకు క్లెయిమ్ చేసుకోవచ్చన్నమాట. కాగా, గత నెల ఫిబ్రవరి 10దాకా 4.19 కోట్లకుపైగా ఐటీ రిటర్నుల్ని పరిశీలించి.. 1.62 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులకు రూ.1.42 లక్షల కోట్లు మేర రిఫండ్స్‌ను ఐటీ శాఖ అందజేసింది. సాధారణంగా రూ.50,000 లోపు రిఫండ్స్ చేసుకునే చిన్న ట్యాక్స్‌పేయర్లకే ఐటీ శాఖ ప్రాధన్యమిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18)లోనూ ఇప్పటివరకు జారీ అయిన రిఫండ్స్‌లో 90 శాతం వేతన జీవులు, చిన్న ట్యాక్స్‌పేయర్లకు చెందినవే. ముందుగా చెల్లించిన పన్నుల మొత్తాల్లో.. నిర్దేశిత సెక్షన్ల కింద పన్ను మినహాయింపులు చూపిస్తే, పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ తిరిగి చెల్లించేవే రిఫండ్స్ అన్న సంగతి విదితమే.

మార్కెట్లకు బ్యాంకింగ్ స్ట్రోక్

భారీ నష్టాల్లో సూచీలు

సెన్సెక్స్ 430, నిఫ్టీ 110 పాయింట్లు పతనం



ముంబై, మార్చి 6: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ స్థాయిలో నష్టపోయాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో 31 బ్యాంకర్లకు తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్‌ఎఫ్‌ఐవో) సమన్లు జారీ చేసిందన్న వార్తలతో మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. రూ.12,700 కోట్ల పీఎన్‌బీ స్కాం కేసులో భాగంగా ఐసీఐసీఐ ఎండీ, సీఈవో చందా కొచ్చర్, యాక్సిస్ బ్యాంక్ చీఫ్ శిఖా శర్మలకు మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐవో సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే బ్యాంకింగ్ షేర్లు పెద్ద ఎత్తున పతనమయ్యాయి. దీంతో సెన్సెక్స్ దాదాపు 430 పాయింట్లు, నిఫ్టీ 110 పాయింట్లు పడిపోయాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎన్‌బీ, కొటక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఫెడరల్, కెనరా, ఐడీఎఫ్‌సీ, యెస్ బ్యాంక్‌ల షేర్ల విలువ నిఫ్టీలో గరిష్ఠంగా 5.10 శాతం, సెన్సెక్స్‌లో 2.77 శాతం దిగజారింది. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ లేదా మొండి బకాయిలు) వర్గీకరణ నిబంధనల్ని ఉల్లంఘించారని యాక్సిస్ బ్యాంక్‌పై రూ.3 కోట్లు, కేవైసీ నియమాలను పాటించలేదని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఓబీసీ)పై రూ.2 కోట్లు చొప్పున రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జరిమానాలు వేయడం కూడా బ్యాంకింగ్ సూచీ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగానే 429.58 పాయింట్లు క్షీణించి 33,317.20 వద్ద సెన్సెక్స్ స్థిరపడగా, గతేడాది డిసెంబర్ 14నాటి (33,246.70) స్థాయికి మళ్లీ చేరినట్లైంది. అంతేగాక గత నెల ఫిబ్రవరి 6 (561.22 పాయింట్లు) తర్వాత ఒక్కరోజే సూచీ ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే. ఇక నిఫ్టీ 109.60 పాయింట్లు కోల్పోయి 10,249.25 వద్ద నిలిచింది. కాగా, ఉదయం ఆరంభంలో సూచీలు చెప్పుకోదగ్గ లాభాల్లోనే కదలాడినప్పటికీ.. ఎస్‌ఎఫ్‌ఐవో సమన్ల నేపథ్యంలో నష్టాల్లోకి జారుకున్నాయి. ఫలితంగా ఒడిదుడుకులు తప్పలేదు. ఈ క్రమంలోనే ఒకానొక దశలో సెన్సెక్స్ 34,060.13 పాయింట్ల గరిష్ఠాన్ని, 33,209.76 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ సైతం 10,441.35 పాయింట్ల గరిష్ఠ స్థాయికి, 10,215.90 పాయింట్ల కనిష్ఠ స్థాయికి వెళ్లింది. బ్యాంకింగ్ రంగంతోపాటు రియల్టీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్, పీఎస్‌యూ షేర్లు నష్టపోగా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు మాత్రం లాభపడ్డాయి. మిడ్-క్యాప్ షేర్లు 0.84 శాతం, స్మాల్-క్యాప్ షేర్లు 1.32 శాతం మేర నష్టపోయాయి.

రూ.4.30 లక్షల కోట్లు ఆవిరి

దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాల మధ్య లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద ఆవిరైపోతున్నది. గడిచిన ఐదు సెషన్లలో రూ.4.30 లక్షల కోట్లు కనుమరుగైంది. ఈ ఐదు రోజుల్లో సెన్సెక్స్ 1,129 పాయింట్లు దిగజారగా, ఆయా సంస్థల మార్కెట్ విలువ రూ.4,30,042.5 కోట్లు క్షీణించింది. రూ.1,44,20,606 కోట్ల వద్ద నిలిచింది.

సీఐడీలో కదులుతున్న పెండింగ్ ఫైళ్లు

- 'ఇందిరమ్మ ఇండ్ల' గోల్‌మాల్‌పై దర్యాప్తు ముమ్మరం
- మరింత సమాచారం కోసం విజిలెన్స్ అధికారులకు లేఖ
- త్వరలో ఎంసెట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో చార్జిషీట్ దాఖలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఐడీ పోలీసులు పెండింగ్ కేసు ఫైళ్ల దుమ్ము దులుపున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల స్కామ్‌ను పరిశీలిస్తున్నారు. మరోవైపు, ఎంసెట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో చార్జిషీట్ దాఖలు చేసే పనిలోపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు 2004 నుంచి 2014 మధ్యలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులొచ్చాయి. 2014లో అధికారంలోకొచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఇందిరమ్మ ఇండ్లలో జరిగిన గోల్‌మాల్‌పై దృష్టిసారించింది. విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించి, మోసాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేయాలంటూ సంబంధిత అధికారులు 2014 ఆగస్టులో సీఐడీలో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. శాఖాపరంగా నిర్వహించిన విచారణలో తొలుత విజిలెన్స్ అధికారులే మోసాన్ని బయటపెట్టారు.ఈ కేసును సీఐడీ దర్యాప్తు చేస్తున్నది. మరింత సమాచారం కోసం విజిలెన్స్ అధికారులకు లేఖ రాసినట్టు అదనపు డీజీపీ (సీఐడీ) గోవింద్ సింగ్ తెలిపారు. ఎంసెట్ పరీక్ష పత్రం లీకేజీ కేసులోనూ దర్యాప్తు ముగింపునకు వచ్చిందని, త్వరలోనే చార్జిషీట్ దాఖలు చేయనున్నట్టు వెల్లడించారు.

పింఛన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు

సకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయండి • ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి



నాంపల్లి టీఎన్జీవో కార్యాలయంలో సకల ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

సుల్తాన్‌బజార్: ఉద్యోగులు పింఛన్ పొందడం భిక్ష కాదని, అది వారి హక్కు అని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో కార్యాలయంలో ఉద్యోగసంఘాల జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 25న నిర్వహించే సకల ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను కారం రవీందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి పదవీవిరమణ పొందిన అనంతరం ఉత్తిచేతులతో సాగనంపేందుకే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను అమల్లోకి తెచ్చారని ధ్వజమెత్తారు. గడిచిన నాలుగేండ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు, ఉద్యోగుల పీఆర్సీ బకాయిలు, హెల్త్‌కార్డులు మంజూరుచేశారని, అదే విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు డిమాండ్‌తో ఈ నెల 25న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న సకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని ఉద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు. సకల ఉద్యోగుల మహాసభలో తెలంగాణ ఉద్యోగులు భారీగా పాల్గొని, కేంద్రం కండ్లు తెరిపించాలని ఉద్యోగసంఘాల జేఏసీ సెక్రటరీ జనరల్ మమత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిళ్ల చంద్రశేఖర్‌గౌడ్, టీటీయూ అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి, ముజీబ్ హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష అమలుతీరుపై తమిళనాడులో అధ్యయనం

- నందిని సిధారెడ్డి సారథ్యంలో నేటి నుంచి పర్యటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి సారథ్యంలోని నిపుణుల బృందం బుధవారం నుంచి మూడు రోజులపాటు తమిళనాడులో పర్యటించనున్నది. అక్కడ మాతృభాష అమలవుతున్న తీరును ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఈ బృందం అధ్యయనం చేయనున్నది. నందిని సిధారెడ్డితోపాటు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఎస్వీ సత్యనారాయణ, ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి తదితరులు ఈ పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడున్న విద్యాసంస్థల్లో తమిళభాష అమలును వీరు ప్రధానంగా పరిశీలించనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మాతృభాష అమలుతీరును, అధికారిక పత్రాలను మాతృభాషలో జారీచేస్తున్న విధానాలు, చట్టపరమైన అంశాలను అధ్యయనం చేస్తారు.

ముగిసిన శ్రీనివాస్‌రెడ్డి ఏసీబీ కస్టడీ

కొత్తకేసులో హెచ్‌ఎండీఏ పురుషోత్తంరెడ్డి బినామీ శ్రీనివాస్‌రెడ్డి అరెస్టుకు రంగంసిద్ధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగం డైరెక్టర్ (సస్పెన్షన్) పురుషోత్తంరెడ్డి బినామీ, బావమరిది శ్రీనివాస్‌రెడ్డి ఐదురోజుల కస్టడీ గడువు మంగళవారంతో ముగియడంతో ఏసీబీ అధికారులు తిరిగి అతడిని జైలుకు తరలించారు. బినామీ చట్టం కింద కేసును ఎదుర్కొంటున్న శ్రీనివాస్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్టుచేసి, కోర్టు అనుమతితో ఈ నెల 2న ఐదురోజుల కస్టడీకి తీసుకున్నారు. విచారణలో అతడు పెదవి విప్పలేదని, ఆస్తుల డాక్యుమెంట్లపై సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఓ బిల్డర్ ఫిర్యాదుతో పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిపై మరో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టు ప్రక్రియ పూర్తయిన వెంటనే మరోసారి ఇద్దర్ని కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు.

మరో బినామీ నిశాంత్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు

పురుషోత్తంరెడ్డి కేసులో బినామీగా ఉన్న అతడి బంధువు నిశాంత్‌రెడ్డికి మంగళవారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరుచేసింది. ప్రతి సోమ, బుధవారం కేసు విచారణ అధికారి ముందు హాజరుకావాలని షరతులు విధించినట్టు అధికారులు తెలిపారు.

చెప్పు, డప్పు కళాకారులకు పింఛన్ ఇవ్వాలి



హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, చిత్రంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్

బడ్జెట్ సమావేశాల్లో ఈ మేరకు తీర్మానించాలి

టీఎమ్మార్పీఎస్ నేతల విజ్ఞప్తి

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వివిధవర్గాలకు ప్రతినెలా పింఛన్ ఇస్తున్నట్లుగా చెప్పు, డప్పు కళాకారులకుఈ బడ్జెట్ సమావేశాల్లో పెన్షన్ పథకాన్ని ప్రకటించాలని టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. రూ.2వేల పింఛన్ చెల్లింపు కోసం తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం సత్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లాల అధ్యక్షులు, ఇంచార్జులు, ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఎస్సీ వర్గీకరణకు సీఎం కేసీఆర్ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకువెళ్లాలని వారు కోరారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రతినిధుల రాష్ట్ర మహాసభను ఈ నెల 11న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య, కొక్కెర భూమన్న, రత్నయ్య, శంకర్, కనకరాజు, థామస్, నర్సింగ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా తాండూరు సభలో మాట్లాడుతున్న రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

దేశప్రజల ఆకాంక్ష మేరకే మూడో ఫ్రంట్

రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు, నమస్తే తెలంగాణ: దేశ ప్రజల ఆకాంక్షమేరకే మూడోఫ్రంట్ వైపు సీఎం కేసీఆర్ అడుగులు వేస్తున్నారని, దేశ ప్రజలకు ముఖ్యమంత్రి సేవలు అవసరం ఉన్నాయని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయ నాయకత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరులో రైతు సమన్వయ సమితుల సభలో ప్రసంగించిన మహేందర్‌రెడ్డి.. అనతరం విలేకరులతో మాట్లాడారు. మూడోఫ్రంట్ ఏర్పాటులో సీఎం కేసీఆర్ నిర్ణయాలకు అనుగుణంగా తాము అడుగులు వేస్తామని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష కేంద్రానికి..



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న గంట్ల రాజు

పెద్దపల్లి, నమస్తే తెలంగాణ: ఇంట్లో కన్న తండ్రి శవాన్ని పెట్టుకొని ఓ విద్యార్థి ఇంటర్ పరీక్ష రాశాడు. అందరిని కంటతడి పెట్టించిన ఈ ఘటన పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో చోటుచేసుకుంది. రాఘవాపూర్‌కు చెందిన గంట్ల సుధాకర్(35) ఏడాదికాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయనకు భార్య స్వప్న, కూతురు సౌమ్య, కుమారుడు రాజు ఉన్నారు. రాజు సీఈసీ మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ మంగళవారం ఉదయం ఐదు కిలోమీటర్ల దూరంలోని పెద్దపల్లికి వెళ్లి పరీక్ష రాసి వచ్చాడు. ఆ వెంటనే తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. విద్యార్థి రాజుకు ఎదురైన పరిస్థితి స్థానికులు, బంధువులు, తోటి విద్యార్థులను సైతం కంటతడిపెట్టించింది.

కట్టుకోమన్నందుకు కడతేర్చాడు

- బావి వద్ద ప్రియురాలిని పాతిపెట్టిన కిరాతకుడు
- 48 గంటల్లోనే మరొకరిని పెండ్లాడిన ప్రబుద్ధుడు
- యాదాద్రి భువనగిరి జిల్లా బుజిలాపురంలో ఘటన



భార్గవి (ఫైల్)



నిందితుడు నరేందర్

మోత్కూరు: ప్రేమించినోడిని పెండ్లి చేసుకోవాలని కోరడమే ఆమె పాలిటశాపమైంది. వేరొకరితో తన పెండ్లికి అడ్డుపడుతున్నదని.. ప్రియురాలిని అతిదారుణంగా హతమార్చి, వ్యవసాయబావి వద్ద పాతిపెట్టాడో కిరాతకుడు. ఆపై మరో అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం బుజిలాపురంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మోత్కూరు మండల కేంద్రానికి చెందిన బొడ్డుపల్లి భార్గవి (22), బుజిలాపురం గ్రామానికి చెందిన కాసగల్ల నరేందర్ (28) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. నరేందర్ జనగామ జిల్లాలోని మరో అమ్మాయితో ఈ నెల 4న వివాహం నిశ్చయించుకున్నాడు. పెండ్లి చేసుకోవాలని కోరుతున్న ప్రియురాలు భార్గవిని అడ్డు తప్పించాలని భావించాడు. ఈ నెల 2న బుజిలాపురం తీసుకొచ్చి ప్రియురాలిని హత్యచేశాడు. మృతదేహాన్ని వ్యవసాయబావి వద్ద పూడ్చిపెట్టాడు. అనంతరం ఈ నెల 4న మరో అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడు. భార్గవి కనిపించడంలేదని, నరేందరే అపహరించాడని ఆమె తండ్రి లక్ష్మయ్య ఆత్మకూరు (ఎం) పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదుచేశారు. రంగంలోకి దిగిన పోలీసులు మంగళవారం నరేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, భార్గవిని తానే హత్య చేసినట్టు అంగీకరించినట్టు సమాచారం. పోలీసులు పాతిపెట్టిన యువతి మృతదేహాన్ని వెలికితీశారు. చౌటుప్పల్ ఏసీపీ రమేశ్ నేతృత్వంలో సీఐ శ్రీనివాస్, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



వరంగల్ అర్బన్ జిల్లాలోని ఎంజీఎంలో డయాలసిస్ సెంటర్ పనితీరును డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి వివరిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కొండా సురేఖ, వినయ్ భాస్కర్

రాష్ట్రవ్యాప్తంగా డయాగ్నసిస్ సెంటర్లు

- త్వరలో పదివేల వైద్య పోస్టుల భర్తీకి చర్యలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

పోచమ్మమైదాన్(వరంగల్): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో వైద్య పరీక్షల కోసం తెలంగాణ డయాగ్నసిస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. వరంగల్ ఎంజీఎం దవాఖానలో జర్మనీ దేశానికి చెందిన డీమెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధునాతన డయాలసిస్ సెంటర్‌తోపాటు సుమారు రూ.4 కోట్ల వ్యయంతో మెకనైజ్డ్ లాండ్రీ, సీనియర్ రెసిడెన్షియల్ వైద్యుల భవనం, ఫిమేల్ సర్జికల్ వార్డు, మాతా శిశు సంరక్షణ కేంద్రం తదితర వైద్య సేవల అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు కొండా సురేఖ, దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడారు. వైద్యం కోసం దవాఖానలకు వచ్చే పేదలకు అన్ని రకాల వైద్య సదుపాయాలతోపాటు పలు రకాల పరీక్షలు ఒకేచోట అందేలా ప్రత్యేకంగా 'తెలంగాణ డయాగ్నసిస్' సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ డయాగ్నసిస్ సెంటర్లను పీహెచ్‌సీ, సీఎస్‌సీ, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా దవాఖానలు, టీచింగ్ దవాఖానల్లో ఏర్పాటు చేస్తామని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖలో పదివేల పోస్టులు మంజూరు అయ్యాయని, వీటిని రానున్న రెండు, మూడు నెలల్లో భర్తీ చేస్తామన్నారు. దీంతో ఎక్కడా ఖాళీలు లేకుండా చర్యలు తీసుకుంటూ రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

సర్కార్ దవాఖానల్లో కార్పొరేట్ వైద్య సేవలు: కడియం

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. అందుకోసం అధునాతన పరికరాలతో సమకూర్చినట్టు తెలిపారు.

సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించండి

మీకోసమే ఢిల్లీతో పోరాడుతున్నారు..

మీ దీవెనలు ఉంటే మరిన్ని మెరుగైన సేవలు: డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

ప్రభుత్వ దవాఖానల్లో సేవలు అమోఘం: స్పీకర్ సిరికొండ

అద్భుతాలు సృష్టిస్తున్న సీఎం కేసీఆర్: మంత్రులు తుమ్మల, లక్ష్మారెడ్డి

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

అన్ని వర్గాల ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందించాలనే ఏకైక లక్ష్యంతో సీఎం కేసీఆర్ జాతీయ స్థాయిలో పోరాటానికి సిద్ధమయ్యారని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. రైతాంగ సమస్యలు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా దేశంలో కొత్త ఫ్రంట్ ఏర్పాటు చేయబోతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రయత్నాలకు మీ ఆశీస్సులు ఉండాలని ప్రజలను కోరారు. శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం కడియం మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టేకుమట్లలో కేజీబీవీ భవన నిర్మాణానికి కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. అనంతరం భూపాలపల్లిలో రూ.కోటితో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. చిట్యాలలో రూ.10 కోట్లతో నిర్మించిన 50 పడకల దవాఖానను మంత్రి లక్ష్మారెడ్డి, టేకుమట్ల, రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై రూ.18 కోట్లతో నిర్మించిన వంతెనను మంత్రి తుమ్మల ప్రారంభించారు. అనంతరం రూ.45 కోట్లతో మోరంచపల్లి-గర్మిళ్లపల్లి రోడ్డు విస్తరణ పనులకు మోరంచపల్లి వద్ద శంకుస్థాపన చేశారు. కాగా భూపాలపల్లిలో రూ.1.78కోట్లతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనం, చిట్యాలలో ఐదు వేట టన్నుల సామర్థ్యంతో నిర్మించిన ఆధునిక మార్కెట్ గిడ్డంగిని స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్యాల, భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభల్లో డిప్యూటీ సీఎం కడియం ప్రసంగించారు. రైతు ఎజెండాతో సీఎం కేసీఆర్ ఢిల్లీపై పోరుకు సిద్ధపడుతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి యావత్ భారతదేశం ఆశ్చర్యపోతున్నదన్నారు. తెలంగాణలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను దేశవ్యాప్తంగా రైతాంగానికి ఎందుకు అమలు చేయలేకపోతున్నారని సీఎం కేసీఆర్ కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలకంటే ఎక్కువ అధికారమే లక్ష్యంగా ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. అభివృద్ధిని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు చిల్లరమల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. భూపాలపల్లి నియోజకవర్గంలో సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎస్సారెస్పీ డీబీఎం-38 కాల్వల ఆధునీకరణ పనులకు రూ.60 కోట్లు మంజూరు చేసినట్టు స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రభుత్వ దవాఖానల్లో అద్భుతమైన సేవలందుతున్నాయని తెలిపారు.



భూపాలపల్లి జిల్లా చిట్యాల సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీ లక్ష్మారెడ్డి ఉన్నారు

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన కేసీఆర్: తుమ్మల

సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత మూడున్నరేండ్లలో రాష్ట్రంలో జరిగిన అనేక అద్భుతాలను దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు చూసి ఇన్నాళ్లు దేశంలో కాంగ్రెస్, బీజేపీ పాలనలో అనుకున్నంత అభివృద్ధి జరుగలేదని చెబుతున్నారన్నారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు మొత్తం తెలంగాణ చుట్టూ తిరుగుతున్నాయని చెప్పారు.

ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ: మంత్రి లక్ష్మారెడ్డి

సీఎం కేసీఆర్ తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ముందుకు తీసుకెళ్తున్నారని మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ఇలాంటి నేత దేశానికి అవసరమన్నారు. ప్రజల భవిష్యత్తు, భావితరాల గురించి ఆలోచించే నేత దేశంలో కరువయ్యారన్నారు. ఉద్యమ నేత కేసీఆర్ సీఎం కావడం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు.



నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి

ఉన్మాదిలా మాట్లాడితే

ప్రజలే దండిస్తారు

- మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లను విమర్శిస్తే ఊరుకోం
- మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ చేపట్టిన బస్సు యాత్ర.. తుస్సు యాత్రగా మారడంతో తట్టుకోలేక మాజీ విప్ ఈరవత్రి అనిల్ ఉన్మాదిలా మాట్లాడుతున్నారని, ఇలాంటి వారిని ప్రజలే దండిస్తారని మిషన్ భగీరథ వైస్ చైర్మన్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. చిల్లరగా మాట్లాడకుండా ముందుగా రాజకీయ విలువలు నేర్చుకోవాలని ఆయన హితవుపలికారు. మంత్రి హరీశ్‌రావు బాల్కొండకు వస్తే చంపివేస్తామని అనిల్ మాట్లాడిన తీరును, మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి చేసిన వాఖ్యలను ఆయన ఖండించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో వేముల ప్రశాంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, నేడు అభివృద్ధి కోసం కష్టపడుతున్న హరీశ్‌రావు ఆదర్శ నాయకుడని, తండ్రిబాటలో ఉద్యమంలో నడిచి నేడు బంగారు తెలంగాణ కోసం పాటుపడుతున్న కేటీఆర్ విలక్షణ నాయకుడని చెప్పారు. వీరిపట్ల చులకనగా మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు. ఉద్యమ సమయంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా అమెరికాకు పారిపోయిన అనిల్.. ఇప్పుడు సిగ్గులేకుండా వాఖ్యలుచేయడం తగదని చెప్పారు. 'హరీశ్‌రావును ఎందుకు చంపుతారు? బాల్కొండ నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు మంజూరు చేసినందుకా? కప్పలవాగు, పెద్దవాగులో తొమ్మిది చెక్‌డ్యామ్‌లు మంజూరు చేసినందుకా? రైతుల కోసం గోదాంలు నిర్మించి ఇస్తునందుకా? ఎలక్షన్ స్టంట్ కోసం కాంగ్రెస్ హయాంలో ప్రారంభించి వదిలేసిన లక్ష్మి ఎత్తిపోతల, వేముగంటి ప్రాజెక్టును పూర్తి చేయించినందుకా?' అని ఆయన ప్రశ్నించారు.

కాంగ్రెస్ బస్సుయాత్ర తుస్సు

ఉత్తమ్‌కుమార్ ముందే తన్నుకున్న పార్టీవర్గాలు • బయటపడ్డ అంతర్గత కుమ్ములాటలు

వరంగల్ నాయకుడికి గాయాలు • మెట్‌పల్లి సభలో బోసిపోయిన కుర్చీలు • జనంలేక.. స్పందన రాక నిరాశలో కాంగ్రెస్ శ్రేణులు



మెట్‌పల్లి కాంగ్రెస్ సభలో వెలవెలబోయిన కుర్చీలు



ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద తన్నుకుంటున్న వెంకట్, ఆజాద్ వర్గీయులు

నమస్తే తెలంగాణ, జగిత్యాల ప్రతినిధి: పూర్వ కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ బస్సు యాత్ర తుస్సుమన్నది. పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు భగ్గుమన్నాయి. పీసీసీ అధ్యక్షుడి ముందే తన్నుకునే స్థాయికి చేరాయి. మరోవైపు కాంగ్రెస్ సమావేశానికి ఆశించినస్థాయిలో జనం రాకపోవడం, వచ్చిన వారినుంచి స్పందన లేక కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరాశలో మునిగిపోయాయి. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్, హన్మంతరావు, మల్లు రవి, జీవన్ రెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులతో కూడిన బస్సుయాత్ర మంగళవారం సాయంత్రం ఆర్మూర్ వైపు జగిత్యాల జిల్లాలోకి ప్రవేశించింది. కాంగ్రెస్ పార్టీ మెట్‌పల్లి నాయకుడు డాక్టర్ జేఎన్ వెంకట్, అతడి భార్య, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ సభ్యురాలు జేఎన్ సునీత బస్సుయాత్రకు స్వాగతం పలికేందుకు అనుచరులతో కలిసి జిల్లా సరిహద్దులో ఉన్న ఇబ్రహీంపట్నం మండలం మూడుబొమ్మల మేడిపల్లి గ్రామం వద్దకు వెళ్లారు. అక్కడినుంచి బస్సు వెంటే ర్యాలీగా ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వరకు చేరుకున్నారు. అప్పటికే క్రాస్ రోడ్డు వద్ద మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు కొడుకు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ తన అనుచరులతో బస్సుయాత్రకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో వెంకట్, ఆజాద్ వర్గీయులు పరస్పరం వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల్లోనూ మద్యంతాగిన కొందరు పరస్పరం నెట్టివేసుకొన్నారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలోనే ఇరువర్గాలు పిడిగుద్దులు కురిపించుకున్నాయి. కొందరు కార్యకర్తలు కర్రలతో దాడి చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ఇతర నాయకులు బస్సు దిగే ప్రయత్నం చేయలేదు. బస్సు యాత్ర బృందంతో వచ్చిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు జంగ రాఘవరెడ్డి ఇరువర్గాలను శాంతింపజేసేందుకు యత్నించగా, ఆయనపైనా దాడి చేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ రాము నాయక్ ఇరువర్గాలను శాంతింపజేసి.. చాకచక్యంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్న బస్సును మెట్‌పల్లికి పంపించారు. ఆజాద్ వర్గం కూడా మెట్‌పల్లికి వెళ్లిపోయింది. ఆజాద్ వర్గీయుల దాడిని నిరసిస్తూ జేఎన్ వెంకట్ వర్గం, జెడ్పీటీసీ సభ్యురాలు సునీత రోడ్డుపై ధర్నాకు దిగారు. ఆందోళనతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరెడ్డి చెప్పడంతో వారు ధర్నాను విరమించారు.

స్పందన రాలేదు.. కుర్చీలూ నిండలేదు

మెట్‌పల్లిలోని ఖాదీ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ సభకు జనం అంతంతమాత్రంగానే హాజరయ్యారు. చిన్న మైదానమే అయినా, అదికూడా పూర్తిగా నిండకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు నిరాశకు గురయ్యాయి. మెట్‌పల్లి, మెట్‌పల్లి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున జనం తరలివస్తారని ఆశించినా, నిరాశే ఎదురైంది. సభలో చాలా కుర్చీలు ఖాళీగానే కనిపించాయి. కాంగ్రెస్ నేతల ప్రసంగాలకు ప్రజల నుంచి కనీస స్పందనరాలేదు. చివరకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రసంగం ప్రారంభమయ్యే సమయంలో సభ పూర్తిగా పలుచబడిపోయింది. బస్సుయాత్రతో ఉత్సాహం నెలకొంటుందని భావించిన కాంగ్రెస్ శ్రేణులకు నిరాశ, నిస్పృహలు మిగిలాయి. కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు ఊహిస్తున్నట్టు ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని, కాంగ్రెస్‌పైనే వ్యతిరేకత ఉందని కొందరు నాయకులు వ్యాఖ్యానిస్తూ, సభాస్థలం నుంచి నిష్క్రమించడం కనిపించింది. మెట్‌పల్లి బస్సుయాత్ర సందర్భంగా ఇబ్రహీంపట్నం క్రాస్‌రోడ్డు వద్ద కొమిరెడ్డి, జేఎన్ వెంకట్ వర్గాల మధ్య జరిగిన బాహాబాహీపై పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర నాయకులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. గతంలో రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంలోనూ ఇరువర్గాలు ఇలాగే ప్రవర్తించాయని, ఇప్పుడు పీసీసీ చీఫ్ ముందే తన్నుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారని తెలిసింది.

జోగాపూర్ ఎంపీటీసీపై హత్యాయత్నం


- రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం అర్ధరాత్రి కత్తితో దాడి
- పరారీలో జనశక్తి మాజీ నక్సలైట్ సలీం, మరొకరు



గాయాన్ని చూపుతున్న కనుకయ్య

చందుర్తి: అధికార పార్టీ ఎంపీటీసీ సభ్యుడిపై సోమవారం అర్ధరాత్రి హత్యాయత్నం జరిగింది. పాతకక్షలతో ఓ జనశక్తి మాజీ నక్సలైట్ మరో వ్యక్తితో కలిసి కత్తితో దాడిచేశాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం సృష్టించింది. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని జోగాపూర్ ఎంపీటీసీ సభ్యుడు వట్టెంల కనుకయ్య సోమవారం రాత్రి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్నారు. కుమారుడు, కుమార్తెతో కలిసి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా గేటువద్ద మాటువేసిన మాజీ నక్సలైట్ సలీం.. గొల్లపల్లి శంకరయ్యతో కలిసి కత్తితో దాడిచేశాడు. కనుకయ్య పొట్టలో కత్తిగాట్లు పడటంతో బైక్‌ను వదిలి తప్పించుకొనే ప్రయత్నంచేశారు. ఆయన పిల్లలు భయంతో కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకున్నారు. దీంతో నిందితులిద్దరు గుర్తుతెలియని మరోవ్యక్తి బైక్‌పై పరారయ్యారు. గ్రామంలో చేస్తున్న భూ దందాలకు కనుకయ్య అడ్డుపడుతున్నాడన్న అనుమానంతో కక్ష పెంచుకొని సలీం దాడికి పాల్పడ్డట్టు ఎస్‌ఐ మల్లేశంగౌడ్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని చెప్పారు.

వృద్ధుడిని హతమార్చిన సైకో



సైకో రాజు

ములుగురూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం జాకారం లో మంగళవారం సైకో చేతిలో ఓ వృద్ధుడు హత్యకు గురయ్యాడు. జాకారానికి చెందిన సామంతుల రాజు మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నాడు. భార్య అతన్ని వదిలిపెట్టి తల్లిగారింటికి వెళ్లడంతో సైకోగా మారాడు. మంగళవారం ఉదయం రాజు నడుచుకుంటూ భార్య దగ్గరకు బయలుదేరాడు. అబ్బాపురం గ్రామానికి చెందిన కొంగొండ నర్సయ్య(70) ములుగు వైపు వెళ్తూ రాజుకు ఎదురుపడ్డాడు. సైకోగా మారిన రాజు కర్రతో నర్సయ్యను కొట్టి, తలను రోడ్డుకేసి బాధడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం రాజు జాకారంలోని డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలో యువతపై రాళ్లతో దాడిచేశాడు. అడ్డుకోబోయిన వాచ్‌మెన్ ఉస్మాన్‌ను గాయపర్చాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ రాఘవేందర్‌రెడ్డి, సీఐ సాయిరమణ ఘటనాస్థలానికి చేరుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్ నాయకులు



ఆదిలాబాద్ జిల్లా చాంద(టి) మైనారిటీ గురుకుల పాఠశాలలో కేసీఆర్ చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న చిన్నారులు, నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:

జాతీయ స్థాయిలో మూడో కూటమి దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తానని సీఎం కేసీఆర్ ప్రకటనను స్వాగతిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబురాలు జరుపుకొంటున్నారు. మంగళవారం కూడా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు. కేసీఆర్ ప్రయత్నం ఫలించాలని కోరుతూ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం తమ్మడపల్లిలో టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద(టి) మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు, టీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్‌కు చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గట్టుసింగారంలో టీఆర్‌ఎస్ నాయకులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు మరింత శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.



సూర్యాపేట జిల్లా ఎర్కారంలో గులాబీ కండువా కప్పి టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

టీఆర్‌ఎస్‌లోకి జోరుగా వలసలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. మంగళవారం కూడా ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాలవారు పెద్ద ఎత్తున టీఆర్‌ఎస్ గూటికి చేరారు. సూర్యాపేట జిల్లా ఎర్కారంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చింతలపాటి మధుతోపాటు టీడీపీకి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వికారాబాద్ జిల్లా యాలాల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 200 మందికిపైగా తాండూరులో రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మాజీ జెడ్పీటీసీ వసంత్ గౌడ్, మోతె గ్రామానికి చెందిన 50మంది నాయక్‌పోడ్ సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌లో మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. జగిత్యాల జిల్లా మేడిపల్లిలో ఎమ్మెల్యే రమేశ్ బాబు, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి సమక్షంలో తొంబర్‌రావుపేటకు చెందిన 'మహి ఫౌండేషన్', 'ఓంసాయి టౌన్‌షిప్' అధ్యక్షుడు నల్ల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కట్లకుంట, కొండాపూర్, కల్వకోట, గోవిందారం గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని వెంకటేశ్వర్లబావికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్ కండువా కప్పుకొన్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్‌లో 30మంది గొల్ల, కురుమలు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలో కాంగ్రెస్‌తోపాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, ఇబ్రహీంపట్నం నగరపంచాయతీ పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన యువకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
బుధవారం 7 మార్చి 2018



ఓం ప్రకాశ్ — మను భాకర్

స్వర్ణ గురి

షూటింగ్ ప్రపంచకప్‌లో భాకర్‌కు రెండు స్వర్ణాలు

ఈ ఘనత సాధించిన పిన్న వయస్కురాలిగా రికార్డు



మెక్సికో: మను భాకర్ మళ్లీ పసిడి కొల్లగొట్టి సంచలనం నమోదు చేసింది. ఇక్కడ జరుగుతున్న సీనియర్ షూటింగ్ ప్రపంచకప్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఓం ప్రకాశ్‌తో జత కట్టి స్వర్ణ పతకం సాధించింది. అంతకు ముందు రోజు మహిళల పదిమీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన మను..మంగళవారం జరిగిన 10మీటర్ల ఎయిర్‌పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలోనూ స్వర్ణం సాధించింది . సీనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్‌కు స్వర్ణం అందించిన అతిపిన్న వయస్కురాలిగా 16 ఏండ్ల మను చరిత్ర సృష్టించింది. టీమ్ ఈవెంట్ ఫైనల్స్‌లో ఓంప్రకాశ్, మనుజోడి 476.1 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా, జర్మనీ (475.2), ఫ్రాన్స్ (415.1)తో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మరోవైపు పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో మెహులీ ఘోష్-దీపక్‌కుమార్ జోడీకి కాంస్యం దక్కింది. దీంతో భారత్ పతకాల సంఖ్య ఏడుకు చేరింది.

ధవన్ దంచినా..

భారత్‌కు తప్పని ఓటమి

5 వికెట్ల తేడాతో లంక గెలుపు

కుశాల్ పెరీరా విజృంభణ

ప్రయోగాల వేళ .. భారత్‌కు తొలి ఓటమి. ఫార్మాట్లతో సంబంధం లేకుండా తమ గడ్డపై వరుసగా సిరీస్‌లను క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియాకు ఒకే ఒక్క మ్యాచ్‌తో లంకేయులు చెక్ పెట్టారు. ధవన్ దంచికొట్టినా.. కుశాల్ పెరీరా ప్రతీకార ఇన్నింగ్స్ ముందు రోహిత్‌సేన తేలిపోయింది. ఆఖర్లో కాస్త కోలుకున్నట్లే కనిపించినా.. మన కుర్రాళ్ల అనుభవలేమి బౌలింగ్ అద్భుతం చేయలేకపోయింది. పరుగులు వరదలా పారిన ప్రేమదాసలో ఘన విజయం సాధించిన లంకేయులు ముక్కోణపు పోరులో శుభారంభం చేశారు.



ధవన్ (90)

కొలంబో: ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారత్ శుభారంభం చేయలేకపోయింది. బ్యాటింగ్‌లో శిఖర్ ధవన్ (49 బంతుల్లో 90; 6 ఫోర్లు, 6 సిక్సర్లు) దంచికొట్టినా.. లంక ఆటగాడు కుశాల్ పెరీరా (37 బంతుల్లో 66; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) సుడిగాలి ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను ఎగురేసుకుపోయాడు. ఫలితంగా ముక్కోణపు సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో శ్రీలంక 5 వికెట్ల తేడాతో భారత్‌పై గెలిచింది. దీంతో టీమ్‌ఇండియాపై వరుసగా ఏడు పరాజయాల రికార్డుకు ఎట్టకేలకు ఫుల్‌స్టాప్ పెట్టింది. టాస్ గెలిచిన లంక ఫీల్డింగ్ ఎంచుకోగా.. భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 174 పరుగులు చేసింది. ధవన్‌కు తోడుగా మనీష్‌పాండే (35 బంతుల్లో 37; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. తర్వాత లంక 18.3 ఓవర్లలో 5 వికెట్లకు 175 పరుగులు చేసింది. తిసారా పెరీరా (10 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నాడు. కుశాల్ పెరీరాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. గురువారం జరిగే మ్యాచ్‌లో భారత్.. బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.



కుశాల్ పెరీరా (66)

లంకలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కారణంగా మ్యాచ్ జరుగుతుందో లేదనన్న అనుమానాలు వెల్లువెత్తినా.. నిర్ణీత సమయానికి మ్యాచ్ ప్రారంభంకావడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మ్యాచ్‌కు కొన్ని గంటల ముందు ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లా, బీసీసీఐ లంక బోర్డుతో చర్చలు జరిపి ఓ ప్రకటనను విడుదల చేసింది. భారత్ జట్టుకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని కోరారు. 'క్యాండీలో నెలకొన్న పరిస్థితులు కొలంబోలో లేవు. భద్రతా అధికారులతో సంప్రదింపులు జరిపిన తర్వాత మ్యాచ్‌కు ఎలాంటి ఆటంకం లేదని తేలింది. కొలంబోలో పరిస్థితులు సాధారణంగా ఉన్నాయి' అని బీసీసీఐ మీడియా మేనేజర్ వెల్లడించాడు. మరోవైపు ముక్కోణపు టోర్నీకి వచ్చిన ఇబ్బందులేమీ లేవని లంక బోర్డు వర్గాలు తెలిపాయి. క్యాండీలో బౌద్ధులు, ముస్లింల మధ్య మత ఘర్షణలు చెలరేగడంతో 10 రోజుల పాటు అత్యవసర పరిస్థితిని విధించారు.

ధవన్ పోరాటం..

ఆరంభంలో పిచ్ పేసర్లకు అనుకూలించడంతో ఇన్నింగ్స్ నాలుగో బంతికే భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. చమీరా బంతిని మిడాఫ్‌లో గాల్లోకి లేపిన రోహిత్.. మెండిస్ చేతికి చిక్కాడు. టీ20ల్లో ఐదుసార్లు డకౌట అయిన భారత తొలి క్రికెటర్‌గా రోహిత్ రికార్డులకెక్కాడు. ఏడు బంతుల తర్వాత రైనా (1) వికెట్లను వదిలిపెట్టి ఆడి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన టీమ్‌ఇండియాను ధవన్ ఒంటరిపోరాటంతో ఆదుకున్నాడు. ఐదోఓవర్‌లో 17 పరుగులు రావడంతో పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ స్కోరు 40/2కు చేరింది. రెండో ఎండ్‌లో మనీష్ పాండే కూడా భారీ షాట్లకు తెరలేపడంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. ఫెర్నాండో వేసిన 9వ ఓవర్‌లో ధవన్ వరుస బంతులను సిక్సర్లుగా మలిచాడు. తొలి 10 ఓవర్లు ముగిసేసరికి భారత్ 80/2కు చేరింది. ఈ క్రమంలో ధవన్ 30 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు 13వ ఓవర్‌లో మెండిస్ ఝలక్ ఇచ్చాడు. మెలికలు తిరుగుతూ వచ్చిన బంతిని పాండే భారీ షాట్ కొట్టబోయి మిడాఫ్‌లో క్యాచ్ ఇచ్చాడు. దీంతో మూడో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 15వ ఓవర్ నుంచి ధవన్ గేర్ మార్చాడు. చకచకా ఐదు భారీ సిక్సర్లు కొట్టి 90ల్లోకి వచ్చాడు. కానీ దురదృష్టవశాత్తు గుణతిలక బంతిని వేటాడి క్యాచ్ ఇచ్చాడు. రిషబ్ (23 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి నాలుగో వికెట్‌కు 49 పరుగులు జోడించాడు. వచ్చి రావడంతోనే కార్తీక్ (13 నాటౌట్) వరుసగా ఫోర్లు బాదాడు. ఐదో వికెట్‌కు 12 బంతుల్లోనే 21 పరుగులు జత చేశారు.

కుశాల్‌గా..

భారీ లక్ష్యం కండ్ల ముందున్నా.. ఓపెనర్లు గుణతిలక (19), మెండిస్ (11) తక్కువ స్కోరుకే ఔటైనా.. వన్‌డౌన్‌లో వచ్చిన కుశాల్ పెరీరా చెలరేగిపోయాడు. బౌండరీతో ఖాతా తెరిచిన అతను వరుసపెట్టి ఫోర్లు, సిక్సర్లు బాదాడు. బౌలర్ ఎవరైనా సరే బంతి రోప్ దాటేలా బలమైన షాట్లతో ఆకట్టుకున్నాడు. శార్దూల్ వేసిన మూడో ఓవర్‌లో 4, 4, 4, 6, 4తో 27 పరుగులు రాబట్టాడు. దీంతో నాలుగు ఓవర్లు కూడా పూర్తికాకముందే లంక స్కోరు 50 పరుగులకు చేరింది. గుణతిలకతో కలిసి రెండో వికెట్‌కు 58 పరుగులు జత చేసి అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. చండిమల్ (14) కూడా నిలకడను చూపడంతో పవర్‌ప్లేలో లంకేయులు 2 వికెట్లకు 75 పరుగులు చేశారు. లంక టీ20 చరిత్రలో ఇదే అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో పెరీరా 22 బంతుల్లోనే ఫిఫ్టీ మార్క్‌ను అందుకున్నాడు. చాహల్ తన రెండో ఓవర్‌లో చండిమల్‌ను ఔట్ చేయడంతో మూడో వికెట్‌కు 28 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 9.4 ఓవర్లలో లంక 100 పరుగులకు చేరుకోవడంతో లక్ష్యం 62 బంతుల్లో 75గా మారింది. అప్పటివరకు సునామీలా సాగిన లంక ఇన్నింగ్స్‌కు 13వ ఓవర్‌లో సుందర్ బ్రేక్ వేశాడు. అద్భుతమైన ఫ్లైట్ బంతితో పెరీరాను పెవిలియన్‌కు చేర్చడంతో 127 పరుగుల వద్ద నాలుగో వికెట్ పడింది. కొద్దిసేపటికే తరంగ (17), తిసారా పెరీరా, శనక (15 నాటౌట్) సమయోచితంగా స్పందించారు. 18 బంతుల్లో 24 పరుగులు చేయాల్సిన దశలో తిసారా ఓ సిక్స్, రెండు ఫోర్లతో విజయాన్ని ఖాయం చేశాడు. వీరిద్దరు ఆరో వికెట్‌కు అజేయంగా 23 బంతుల్లోనే 39 పరుగులు చేసి లాంఛనం ముగించారు. సుందర్, చాహల్ చెరో రెండు వికెట్లు తీశారు.

స్కోరు బోర్డు

భారత్: రోహిత్ (సి) మెండిస్ (బి) చమీరా 0, ధవన్ (సి) పెరీరా (బి) గుణతిలక 90, రైనా (బి) ఫెర్నాండో 1, మనీష్ పాండే (సి) గుణతిలక (బి) మెండిస్ 37, రిషబ్ పంత్ (సి) ఫెర్నాండో (బి) చమీరా 23, కార్తీక్ నాటౌట్ 13, **ఎక్స్‌ట్రాలు:** 10, **మొత్తం:** 20 ఓవర్లలో 174/5. **వికెట్లపతనం:** 1-1, 2-9, 3-104, 4-153, 5-174. **బౌలింగ్:** చమీరా 4-0-33-2, ఫెర్నాండో 3-0-38-1, ధనంజయ 4-0-37-0, పెరీరా 3-0-25-0, మెండిస్ 3-0-21-1, గుణతిలక 3-0-16-1.

శ్రీలంక: గుణతిలక (సి) పంత్ (బి) ఉనాద్కట్ 19, మెండిస్ (సి) ధవన్ (బి) సుందర్ 11, కుశాల్ పెరీరా (స్టంప్) కార్తీక్ (బి) సుందర్ 66, చండిమల్ (బి) చాహల్ 14, తరంగ (బి) చాహల్ 17, శనక నాటౌట్ 15, తిసారా నాటౌట్ 22, **ఎక్స్‌ట్రాలు:** 11, **మొత్తం:** 18.3 ఓవర్లలో 175/5. **వికెట్లపతనం:** 1-12, 2-70, 3-98, 4-127, 5-136. **బౌలింగ్:** ఉనాద్కట్ 3-0-35-1, సుందర్ 4-0-28-2, శార్దూల్ 3,3-0-42-0, చాహల్ 4-0-37-2, శంకర్ 2-0-15-0, రైనా 2-0-14-0.

మను చరితం

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

అద్భుతమైన ప్రతిభ ఉంటే అనుభవంతో పనిలేదని నిరూపించింది హర్యానా షూటర్ మనుభాకర్. 16 ఏండ్ల వయసులోనే తొలిసారిగా సీనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో పాల్గొని రెండు స్వర్ణ పతకాలు సాధించింది. హర్యానాలోని జజ్జర్‌కు చెందిన మను గతేడాది పదో తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియెట్‌లోకి ప్రవేశించింది. చిన్నతనం నుంచే క్రీడల పట్ల అమితమైన ఆసక్తి ఉన్న మను రెండేండ్ల కిందటి నుంచే షూటింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నది. నిజానికి ఈ యువ సంచలనం ఒక ఆటకే పరిమితం కాలేదు. ఆరేండ్ల వయసులోనే బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుని రాష్ట్ర స్థాయి బాక్సర్‌గా ఎదిగింది. అంతేకాదు మణిపురికి చెందిన టాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లోనూ ప్రావీణ్యం ఉన్నది. అక్కడితో ఆగలేదు. స్కేటింగ్‌లోనూ సత్తా చాటింది. జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో విజేతగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నది. మను అంటే మల్టీ టాలెంటెడ్ అని పేరు తెచ్చుకున్నది.

> ఇది నమ్మలేకపోతున్నా, నేను ఆడిన తొలి సీనియర్ ప్రపంచకప్‌లో రెండు స్వర్ణ పతకాలు గెలుస్తానని ఊహించలేదు. నేనిప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నా. రాబోయే టోర్నీల్లోనూ మెరుగైన ప్రదర్శన కనబరుస్తా. దేశానికి మరిన్ని పతకాలు సాధించి పెట్టాలని అనుకుంటున్నా.
> -మను భాకర్

నాన్న రివాల్వర్‌తో మొదలైంది..

మనుభాకర్ తండ్రి రామ్ కిషన్ భాకర్ మర్చంట్ నేవీ హైలింగ్‌లో ఇంజనీర్. ఒకసారి ఆయన తన కుమార్తెను రేంజ్‌కు తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న టార్గెట్‌ను తన రివాల్వర్‌తో షూట్ చేసి, ఈ క్రీడలోనూ ఓసారి ప్రయత్నించమని చెప్పాడు. మను రివాల్వర్‌తో షూట్ చేయగా అవి టార్గెట్‌లోని సెంటర్ పాయింట్‌లో తగిలాయి. ఇక అక్కడి నుంచి ఈ యువకెరటం గురి తప్పలేదు. మొదట కోచ్ నరేశ్ దగ్గర ప్రాథమిక శిక్షణ తీసుకుని ఆ తర్వాత జస్పాల్ రాణా వద్ద పూర్తి స్థాయిలో మెళకువలు నేర్చుకున్నది. 2016 నుంచి షూటింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుని వరుస పతకాలతో బుల్లెట్‌లా దూసుకొస్తున్నది.

పతకాల పంట

గతేడాది డిసెంబర్‌లో తిరువనంతపురంలో జరిగిన 61వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాల పంట పండించింది. పదిమీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత టాప్ క్లాస్ షూటర్ హీనాసిద్ధూను ఓడించి తన సత్తా ఏంటో తెలియజెప్పింది. అంతేకాదు ఆ టోర్నీలో ఏకంగా15 పతకాలు గెలుచుకున్నది. ఇందులో 9 స్వర్ణ పతకాలు ఉండటం విశేషం.

ద్యుతి 'పసిడి' పరుగు



కోచ్ రమేశ్‌తో ద్యుతి

పటియాల: భారత స్టార్ స్ప్రింటర్ ద్యుతీచంద్ జోరు కొనసాగుతూనే ఉన్నది. ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడల అర్హత టోర్నీ 22వ ఫెడరేషన్ కప్ జాతీయ సీనియర్ అథ్లెటిక్స్‌లో ద్యుతీ పసిడి పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 100మీటర్ల రేసును ద్యుతి 11.60 సెకన్లతో ముగించి స్వర్ణం దక్కించుకోగా, ప్రజ్న(11.81సె), హీనా (11.83సె) వరుసగా రజత, కాంస్య పతకాలు గెలిచారు. కామన్వెల్త్ గేమ్స్ కోసం నిర్దేశించిన అర్హత మార్క్(11.15సె)ను ద్యుతి అందుకోలేకపోయింది. మరోవైపు పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా 85.94మీటర్ల దూరం విసిరి పసిడి పతకాన్ని ముద్దాడాడు.

సాల్గవోంకర్‌పై ఆరు నెలల సస్పెన్షన్

దుబాయ్: మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ పిచ్ క్యూరేటర్ పాండురంగా సాల్గవోంకర్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం ఆరు నెలల సస్పెన్షన్ విధించింది. గత అక్టోబర్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య పుణె మ్యాచ్‌కు ముందు ఓ పత్రిక జర్నలిస్టులు జరిపిన స్టింగ్ ఆపరేషన్‌లో సాల్గవోంకర్ స్పాట్ ఫిక్సింగ్‌కు మొగ్గుచూపాడు. పిచ్ ఎలా కావాలంటే అలా తయారు చేస్తానంటూ మీడియాకు అడ్డంగా దొరికిపోయిన సంగతి తెలిసిందే. సదరు పత్రిక ఆరోపణలపై సమగ్ర విచారణ చేసిన ఐసీసీ సస్పెన్షన్ విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే తమకు నివేదించడంలో విఫలమైనందుకు సాల్గవోంకర్‌పై సస్పెన్షన్ వేశామని, అవినీతి కారణంగా కాదని ఐసీసీ జనరల్ మేనేజర్ అలెక్స్ మార్షల్ పేర్కొన్నాడు.

విండీస్ బోణీ

ఐసీసీ ప్రపంచకప్ అర్హత టోర్నీ

హరారే: ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో వెస్టిండీస్ శుభారంభం చేసింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో గెలిచి బోణీ కొట్టింది. కిస్‌గేల్(97 బంతుల్లో 123; 7 ఫోర్లు, 11 సిక్సలు) , హెట్‌మైర్ (93 బంతుల్లో 127; 14 ఫోర్లు, 4 సిక్సలు) శతకాలు బాదడంతో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో యూఏఈ 6 వికెట్లు కోల్పోయి 297 పరుగులకే పరిమితమైంది. రమీజ్ అజేయ శతకం (112 నాటౌట్)తో ఆకట్టుకున్నా, అన్వర్ (64) అద్నన్ (45) పోరాడినా భారీ టార్గెట్‌ను అందుకోలేకపోయారు.

రెండో ర్యాంకులోనే కోహ్లీ



దుబాయ్: భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో యధాతథంగా రెండో స్థానంలోనే కొనసాగుతుండగా, స్పిన్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ ర్యాంకు పడిపోయింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో బ్యాట్స్‌మన్ జాబితాలో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ (947 పాయింట్లు) మొదటి స్థానంలో ఉండగా, కోహ్లీ (912) రెండు, పుజార (810) ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. బౌలింగ్ విభాగంలో రవీంద్ర జడేజా (844) మూడో స్థానంలో ఉండగా, అశ్విన్ (803) ఆరో స్థానానికి పడిపోయాడు. తాజాగా దక్షిణాఫ్రికాపై చెలరేగిన ఆసీస్ బౌలర్ మిచెల్ స్టార్క్ (805) అశ్విన్‌ను వెనక్కినెట్టి ఐదో స్థానానికి చేరుకుని కెరీర్ బెస్ట్ ర్యాంకు దక్కించుకున్నాడు. కాగా షమీ 15, భువీ 20వ ర్యాంకులో ఉన్నారు.

భారత మహిళలకు రెండో గెలుపు



ఇంచియాన్: భారత మహిళా హాకీ జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 3-2తో దక్షిణకొరియాను ఓడించింది. మ్యాచ్ ఆరంభమైన ఆరో నిమిషంలో పూనమ్ రాణి భారత్‌కు తొలి గోల్ అందించి 1-0 ఆధిక్యంలో నిలిపింది. యురిమ్ లీ (10ని) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలుచడంతో తొలి పార్శ్వం ముగిసే సరికి స్కోర్లు సమమయ్యాయి. ఆతిథ్య జట్టును సమంగా నిలిపింది. రెండో క్వార్టర్‌లో దక్షిణకొరియాకు వరుసగా పెనాల్టీ కార్నర్‌లు లభించినప్పటికీ భారత్ సమర్థవంతంగా అడ్డుకున్నది. కెప్టెన్ రాణి రాంపాల్ (27ని) గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపింది. మూడో క్వార్టర్‌లో ఆతిథ్య జట్టుకు జున్‌జెయెన్(31ని) గోల్ అందించడంతో స్కోర్లు మళ్లీ సమమయ్యాయి. మరో గోల్ కోసం ఇరుజట్లు ప్రయత్నించినా గుర్జిత్ కౌర్ (32ని) గోల్ చేసి భారత్‌ను మళ్లీ ఆధిక్యంలోకి తెచ్చింది. ఆ తర్వాత భారత గోల్‌కీపర్ స్వాతి ప్రత్యర్థి సంధించిన పెనాల్టీ కార్నర్స్‌ను అడ్డుకుని విజయంలో కీలకపాత్ర పోషించింది. మార్చి 8న ఇరుజట్ల మధ్య మూడో మ్యాచ్ జరుగుతుంది.

దేవధర్ ఫైనల్లో కర్ణాటక



ధర్మశాల: దేవధర్ ట్రోఫీలో కర్ణాటక ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం భారత్ 'ఎ'తో జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక 65 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. కర్ణాటక నిర్దేశించిన 340 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 'ఎ' 39.5 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది. ఉన్ముక్త్ చంద్(81), ఇషాన్‌కిషన్(73) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. కృష్ణప్ప గౌతమ్(4/52), మోరె(3/64) భారత్ 'ఎ' పతనంలో కీలకమయ్యారు. తొలుత దేశ్‌పాండే(95), సమర్థ్(85) అర్ధసెంచరీలతో కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 339/4 స్కోరు చేసింది. షమీ(2/96)కి రెండు వికెట్లు దక్కగా, కేజ్రోలియా, యాదవ్ ఒక్కో వికెట్ తీశారు. గురువారం భారత్ 'బి', కర్ణాటక మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

సర్దార్ సేనకు మరో ఓటమి



ఇఫో(మలేసియా): అదే తీరు, అదే వైఫల్యం..గత ఓటమి నుంచి పాఠాలు నేర్వని భారత హాకీ జట్టు 2-4తో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో గెలిచి ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉంచుకుందామనుకున్న సర్దార్ సింగ్ సేనకు భంగపాటు తప్పలేదు. సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ టోర్నీలో భాగంగా మంగళవారం ఇక్కడ జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆటగాళ్లు భారత గోల్‌పోస్ట్‌పై వరుస దాడులు చేసి మొదటి మూడు పార్శ్వాలు ముగిసే సరికి 4 గోల్స్ సంధించారు. మార్క్ నోవ్లెస్, అరన్ జల్వెస్కి, డేనియల్, బ్లేక్‌లు తలో గోల్ చేశారు. ఇక నాలుగో పార్శ్వంలో రమణ్‌దీప్ సింగ్ భారత్‌కు రెండు గోల్స్ అందించి వైట్‌వాష్‌ను తప్పించాడు. ఈ ఓటమితో భారత్ పాయింట్ల పట్టికలో ఒక్క పాయింట్‌తో ఐదో స్థానంలో నిలిచింది. భారత్ నేడు మలేసియాతో తలపడుతుండగా, శుక్రవారం ఐర్లండ్‌తో చివరి లీగ్ మ్యాచ్ ఆడుతుంది.





రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జీ వివేక్, సరోజ దంపతుల కుమారుడు వంశీకృష్ణ, సామల వేణు, మాధవి దంపతుల కుమార్తె రోషినీల వివాహ రిసెప్షన్ వేడుక మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మంగళవారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు గవర్నర్ నరసింహన్, సీఎం కే చంద్రశేఖర్‌రావు, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, రాజకీయనేతలు, ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. -మాదాపూర్



టీఆర్ఎస్ నేత పీఎల్ శ్రీనివాస్ రాష్ట్ర సర్కారు సాధించిన విజయాలను సంకలన పరిచి ప్రచురించిన 'కరదీపిక'ను సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. వాస్తవాలను ప్రజలకు తెలుపడంలో 'కరదీపిక' ఉపయోగపడుతుందని, దీన్ని సంకలనపరిచి గొప్ప ప్రయత్నం చేశారని శ్రీనివాస్‌ను సీఎం అభినందించారు.

కురుమలందరికీ గొర్రెలు

- స్వార్థరాజకీయాల కోసం ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న కాంగ్రెస్ నేతలు
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధ్వజం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కురుమలందరికీ గొర్రెలు పంపిణీ చేస్తామని, ఈ విషయంలో ఆందోళన అవసరం లేదని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నేతలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం గద్వాల జిల్లాకు చెందిన కురుమ కులస్థులు పెద్ద ఎత్తున సచివాలయానికి తరలివచ్చి మంత్రులు తలసాని, జూపల్లి కృష్ణారావులను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కురుమలకు సబ్సిడీపై అందజేస్తున్న గొర్రెలను తమకూ ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం గొర్రెలను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. గద్వాల జిల్లాలోని కాంగ్రెస్ నేతల మాటలను విని గొర్రెలను తీసుకొనేందుకు తాము ఆసక్తి చూపలేదని, తమ తప్పిదాన్నిమన్నించి గొర్రెలను పంపిణీచేయాలని మంత్రులను కోరారు. ప్రతిఒక్క కురుమ కులస్థుడికి గొర్రెలను పంపిణీచేస్తామని మంత్రి తలసాని హామీఇచ్చారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిస్తామని చెప్పారు.



మంగళ వారం సచివాలయంలో గద్వాల జిల్లాకు చెందిన కురుమలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, తదితరులు

అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యం

రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నారని మంత్రి తలసాని చెప్పారు. ప్రభుత్వం రూ.5,000 కోట్లతో గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ చేస్తున్నదని, 47 లక్షలకుపైగా గొర్రెలను అందజేసిందని వివరించారు. జీవాల వద్దకే వైద్యం తీసుకొచ్చేందుకు 100 సంచార పశువైద్యశాలలను ప్రవేశపెట్టామన్నారు. 45 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని, టీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేండ్లలో చేసిందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు. బస్సుయాత్ర పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని, మాటల ప్రభుత్వం కాదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి, గద్వాల టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కృష్ణమోహన్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, రాజశేఖర్, తిరుమల్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

మన్ననూరు గిత్తకు జాతీయ గుర్తింపు..?

(ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ)

- ఫలించిన పరిశోధనలు.. ముగిసిన అధ్యయనం
- త్వరలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక

తెల్లనిరంగులో ఒంటిపై గోధుమ వర్ణపు చుక్కలతో అందంగా, దృఢంగా కనిపించే మన్ననూరు తూర్పు జాతి గిత్తకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలు కొలిక్కివచ్చాయి. మన్ననూరు ఎడ్లకు జాతీయస్థాయిలో గుర్తించడానికి అవసరమైన అన్ని లక్షణాలున్నాయంటూ వీటిపై అధ్యయనం చేసిన రాష్ట్ర జీవ వైవిధ్యమండలి ఇటీవల పశుసంవర్ధకశాఖకు నివేదికను సమర్పించింది. ఈ మేరకు మన్ననూరు గిత్తకు జాతీయ గుర్తింపునివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ బ్యూరో ఆఫ్ యానిమల్ జెనెటిక్ రిసోర్సెస్ (ఎన్బీఏజీఆర్)ను కోరుతూ పశుసంవర్ధకశాఖ నివేదిక పంపనున్నది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 151 పశువులు, జంతువులను ప్రత్యేక మేలురకం లక్షణాలున్నవిగా ఎన్‌బీఏజీఆర్ గుర్తించింది. అందులో ఒంగోలుగిత్తతో పాటు పలు రకాల పశువులు, గొర్రెలు, గుర్రాలున్నాయి. త్వరలో తెలంగాణ మన్ననూరు జాతి గిత్తకు కూడా భారతజాతి మేలురకం పశువుగా గుర్తింపు రానున్నదని అధికారులు వెల్లడించారు. తూర్పు పశువులను ప్రత్యేక జాతిగా గుర్తించాలంటే ఎన్బీఏజీఆర్ ధృవీకరించాల్సి ఉంది. ఎన్బీఏజీఆర్ మార్గదర్శకాల ప్రకారం ఒక జాతిని గుర్తించాలంటే ఆ పశుజాతి పూర్తి వర్ణన, భౌతిక లక్షణాలు, ఉత్పత్తి పనితీరు వివరాలతో నివేదిక రూపొందించి పంపించాల్సి ఉంటుంది. ఈ మేరకు మన్ననూరు చుట్టూ వివిధ ప్రాంతాల్లో సుమారు వెయ్యి తూర్పు జాతి పశువుల డాటా రికార్డింగ్‌చేసి నివేదికను సిద్ధం చేశారు.



మన్ననూరు తూర్పుజాతి గిత్తలు (ఫైల్)

తెలంగాణ షాన్

ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 39 రకాల గుర్తించబడిన గోజాతులు ఉన్నాయి. గుజరాత్ రాష్ట్రానికి గిర్, కాంక్రేజ్, తమిళనాడుకు పుల్లికులం, కాంగేయం, కర్నాటకకు హల్లికర్, మలనాడు గిడ్డ, కేరళకు పెచ్చురు ఇలా ప్రత్యేక గోజాతిని గుర్తించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు జాతులు ఒంగోలు, పుంగనూరు ఉండేవి. తెలంగాణ ఏర్పడిన తర్వాత మనకంటూ ప్రత్యేక పశుజాతి లేకుండా పోయింది. ఇప్పుడు తూర్పు ఎడ్లకు గుర్తింపుతో ఆ లోటు తీరనుంది.

పెద్దపులి.. మన్ననూరు గిత్త

మన వ్యవసాయానికి బాగా పనికొచ్చే, అన్ని శీతోష్ణస్థితులను తట్టుకునే పశుజాతి ఒకటి మన తెలంగాణ ప్రాంతంలో కొన్ని శతాబ్దాలుగా మనుగడ సాగిస్తున్నా, పాలకులు దీన్ని గుర్తించలేదు. మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్, అచ్చంపేట మండలాల్లో మన్ననూర్ గిత్తల సంచారం ఎక్కువగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా నల్లమల అటవీ తూర్పు భాగంలో ఎక్కువ ఉన్నాయి కాబట్టి వీటిని తూర్పు అని, మన్ననూరు ప్రాంతంలో ఉన్నాయి కాబట్టి మన్ననూరు అన్న పేర్లతో పిలుస్తున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌జోన్, శ్రీశైలం దిగువ కొండల్లో వీటి మనుగడ ఎక్కువగా ఉన్నది. ఇవి సాధారణంగా తెల్లగా ఉండి ఎరుపు లేదా గోధుమ మచ్చలు లేదా లేత ఎరుపు మచ్చలతో ఉంటాయి. వీటికి పదునైన కొమ్ములు నిటారుగా ఉంటాయి. గిట్టలు మిగతా జంతువులకంటే బలిష్ఠంగా ఉంటాయి. మెడకింద వేలాడే చర్మం, మూపురం.. మధ్యస్థం నుంచి పెద్దగా ఉంటాయి. తోక.. పొడవుగా కాళ్ల చీల మండలం దాక ఉంటుంది. ఈ జాతి ఎద్దులు తెలంగాణ వాతావరణ పరిస్థితులకు చక్కగా సరిపోతాయి. తక్కువ పశుగ్రాసం తీసుకోవడం, సమర్థంగా పనిచేయడం ఈ పశువుల ప్రత్యేక లక్షణం. వీటికి పులితో నేరుగా పోరాడే సత్తా ఉంటుంది. 25 ఏండ్ల వరకు వీటి జీవిత కాలం ఉంటుంది.

మహిళలతో చంద్రగిరి రైల్వేస్టేషన్ నిర్వహణ

- అంచెలంచెలుగా దక్షిణమధ్య రైల్వేలోని అన్ని జోన్లకు విస్తరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళా ఉద్యోగుల్లోని శక్తియుక్తులు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేసేందుకు దక్షిణమధ్యరైల్వే కొత్త చొరవ తీసుకున్నది. గుంతకల్లు డివిజన్‌లోని చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో రైళ్ల నిర్వహణ, టికెట్ బుకింగ్, భద్రతకు మహిళా ఉద్యోగులనే నియమించి 'మహిళా ఉద్యోగుల రైల్వేస్టేషన్'గా ఏర్పాటుచేసింది. బేగంపేట, ఫిరంగిపురం రైల్వేస్టేషన్లనూ మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున 'మహిళా ఉద్యోగుల రైల్వే స్టేషన్లు'గా ప్రకటించనున్నది. చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో నలుగురు మహిళలు అసిస్టెంట్ స్టేషన్‌మాస్టర్లుగా, ముగ్గురు మహిళలు పాయింట్స్ విమెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగుల అంకితభావాన్ని దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ మంగళవారం అభినందించారు. బేగంపేట, ఫిరంగిపురం రైల్వేస్టేషన్లలోని రిజర్వేషన్ గుమాస్తా పోస్టులు, రైల్వే రక్షకదళానికి సంబంధించిన పోలీస్, అసిస్టెంట్ స్టేషన్‌మాస్టర్లు, ఆర్పీఎఫ్ పోలీసు పోస్టుల్లో మహిళలనే నియమించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నది.